ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, మార్గశిరమాసం; తిథి: బహుళ ద్వాదశి రా.తె.3.22 వరకు, నక్షత్రం: విశాఖ మ.12.01 వరకు, అనంతరం అనురాధ; అమృతకాలం: రా.1.58 నుండి 3.36 వరకు; వర్జ్యం: సా.4.07 నుండి 5.45 వరకు; దుర్ముహూర్తం: మ.11.40 నుండి 12.30 వరకు, రాహుకాలం: మ.12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు.

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 63 • సంచిక: 354 • బుధవారం 2 జనవరి 2019 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



"తెలంగాణపై ద్వేషంతో చంద్రబాబు రాజకీయం చేద్దామని చూశారు... అందుకే జనం తిప్పికొట్టారు... మహాకూటమికి బుద్ధి చెప్పారు..."

మహాకూటమి

వైఫల్యం

2018లో ఉజ్వల ప్రగతి... 2019లో మళ్లీ మేమే...

"...నాలుగు తరాలుగా అధికారం అనుభవించి నేడు బెయిల్‌పై బయట తిరుగుతున్నారు... రుణమాఫీ పేరుతో మళ్లీ మోసానికి తెర తీస్తున్నారు..."



రుణమాఫీ కేవలం ఎన్నికల స్టంట్

- అబద్ధాలతో కాంగ్రెస్ మోసం
- ఆదాయం పెంపే పరిష్కారం
- మార్పు తెచ్చి రుణం తీర్చుకుంటా
- నాపై ద్వేషంతోనే బాబు కూటమి
- తెలంగాణలో చిత్తు చిత్తయ్యింది
- కేసీఆర్ ఫ్రంట్ గురించి తెలియదు
- నోట్ల రద్దుతో ముందుందు మేలు
- జీఎస్టీతో సామాన్యుడికి ఊరట
- కలిసొచ్చే పార్టీలతో కలసి పోటీ
- సార్వత్రిక ఎన్నికల వేళ...
- ఏఎన్ఐ వార్తా సంస్థతో మోడీ

సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ప్రధాని నరేంద్రమోడీ తన అంతరంగాన్ని బయట పెట్టారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి కంచుకోటలాంటి రాష్ట్రాల్లో అధికారం కోల్పోయినా.. వాటి ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై ఏ మాత్రం ఉండబోదన్నారు. మహాకూటమి విఫల ప్రయోగమని నూతన సంవత్సర వేళ ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై తనదైన శైలిలో స్పందించిన ప్రధాని.. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ గురించి తనకు తెలియదంటూనే.. చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. తనపై ద్వేషంతోనే చంద్రబాబు కాంగ్రెస్ పార్టీ దరిచేరి చేతులు కాల్చుకున్నారని విమర్శలు గుప్పించారు. రైతు రుణమాఫీ ఎన్నికల స్టంటేనని ప్రధాని మోడీ అన్నారు. బీజేపీకి కంచుకోట లాంటి మూడు రాష్ట్రాల్లో రుణమాఫీ హామీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మోడీ పై విధంగా స్పందించారు...

న్యూఢిల్లీ: రైతులు అప్పు చేయాల్సిన అవసరం లేకుండా తమ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఉత్పత్తి జరిగిన చోట పంట విక్రయం జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. రుణమాఫీతో రైతుల బతుకులు మారుతాయని అనుకుంటే తాము సిద్ధమేనని చెప్పారు. రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెబుతోందని. గతంలో తొలగిపోని రైతు కష్టాలు ఇప్పుడు వారి హామీలతో తొలగిపోతాయా అని ప్రశ్నించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం ద్వారా వారిని రుణ విముక్తుల్ని చేస్తామన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నిజమైన రైతులకు రుణాలు అందడం లేదన్న మోడీ.. మాఫీకి అర్హమైన రైతులెవరూ బ్యాంకింగ్ వ్యవస్థలో లేరని వారంతా వడ్డీ వ్యాపారుల వద్దే రుణాలు తీసుకుంటున్నారని

5వ పేజీలో...

"కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ గురించి నేను ఆలోచించనేలేదు... అసలు నా దృష్టికే రాలేదు... జరగబోయే ఎన్నికలు దేశ ప్రజలు, మహాకూటమిల మధ్యే..."





మాది విఫల కూటమి కాదు...

వైఫల్య ప్రధాని మోడీనే

దేశానికి మీరు చేసిందేమిటి? • చర్చకు రావాలని సవాల్ చేస్తున్నా...

- మీవి దివాళాకోరు ఆర్థిక విధానాలు
- దేశానికి ఎంతో నష్టం జరిగింది
- రాష్ట్రంలో అస్థిరతకు ముగ్గురు మోడీల కుట్రలు
- తెలంగాణలో మీరు గెలిచింది ఒక్క సీటేగా?
- కేసీఆర్ దూషణలు మరిచారా?
- ఫెడరల్ ఫ్రంట్ ఎక్కడ ఉంది?
- మోడీ ప్రమోట్ చేస్తున్నదే ఈ ఫ్రంట్
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : మహాకూటమి ఎక్కడా వైఫల్యం చెందలేదని, ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి జైట్లీ దేశాన్ని పాలించడంలో దారుణంగా విఫలం చెందారని సీఎం చంద్రబాబు అన్నారు. దివాళాకోరు ఆర్థిక విధానాలతో దేశాన్ని తీవ్రంగా నష్టపరిచారని విమర్శించారు. దమ్ముంటే చర్చకు రావాల్సిందిగా ఆయన మోడీకి సవాల్ విసిరారు. మోడీ, అరుణ్ జైట్లీ సంయుక్తంగా ఫెడరల్ ఫ్రంట్‌ను ప్రోత్సహిస్తున్నారని, కానీ దీని జాడే ఎక్కడా లేదని, కేవలం స్వార్థపూరితమైన ప్రయోజనాలకోసమే వీరు ఫెడరల్ ఫ్రంట్‌ను ప్రమోట్ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తృణమూల్ కాంగ్రెస్ ఫెడరల్ ఫ్రంట్‌లో చేరుతున్నట్లు చెప్పకపోయినా కేంద్రం తప్పుదారి పట్టిస్తుందని అన్నారు. ఇటీవల కేసీఆర్ మమతా బెనర్జీ, నవీన్ పట్నాయక్‌లను కలిసినా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ఫెడరల్ ఫ్రంట్ పట్ల ఎలాంటి ఆసక్తి కనబర్చలేదని చెప్పారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చివరి శ్వేతపత్రం విడుదల చేసిన అనంతరం ఉండవల్లిలోని ప్రజావేదికలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పెద్ద మోడీ, మధ్య మోడీ, చిన్న మోడీలు అస్థిరపరచాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాజకీయ కుట్ర జరుగుతుందని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని బీజేపీ, టీఆర్ఎస్, వైకాపాలు ప్రయత్నిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. అస్థిర ప్రభుత్వం ఉంటే తమ ఆటలు సాగుతాయన్న ఉద్దేశంతో ప్రధాని మోడీ వీరిని తమపైకి ఉసిగొలుపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందడంతోపాటు అన్నింటా అగ్రగామిగా నిలుస్తుందన్న

2వ పేజీలో...

రుణభారం వేధిస్తున్నా.. ప్రగతి శ్వాసిస్తున్నా..

నేటి నుంచి జన్మభూమి-మా ఊరు

2లో

చరిత్ర సృష్టిస్తా



సామాన్యుడే రాజై వెలగాలి

- బెజవాడ నుంచి ఎన్నికల సమరశంఖం పూరించిన పవన్ కల్యాణ్
- ప్రజలతో మమేకం కావాలని కేడర్‌కు పిలుపు
- అవినీతి రహిత పాలనకు అవకాశం ఇవ్వాలని విన్నపం

అమరావతి, ఆంధ్రప్రభ : వచ్చే సార్వత్రిక ఎన్నికల అనంతరం సామాన్యుడే రాజై వెలగాలని, అందుకు జనసేన పార్టీ అవిరళ కృషి ఉండబోతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కొణిదెల పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విజయవాడలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఆయన 2019 ఎన్నికల ప్రచారానికి సమరశంఖం పూరిస్తున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. గత అనుభవాలను ప్రేరణగా తీసుకుని నూతన నిర్ణయాలతో ముందడుగు వేయాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. ఈ కొత్త సంవత్సరంలో సామాన్యుడే రాజై వెలగాలన్నదే జనసేన అభిమతమన్నారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా మానవీయ పాలనకు, నవ చరిత్రకు జనసేన విధివిధానం ప్రేరణ అని చెప్పారు. ఆ దిశగా జనసేన ఆశయాలను, ఆలోచనలను, విధి విధానాలను పార్టీ కేడర్ ప్రజల మధ్యకు తీసుకెళ్లే ప్రయత్నాన్ని ఈ రోజునుండే ప్రారంభించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు వంటివన్నారు. ఈ రెండింటినీ సమపాళ్లలో జోడించి రాష్ట్రంలో ప్రగతిని పరుగులు పెట్టించాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క నిరుపేద జీవితానికి భరోసా

3వ పేజీలో...

బంగారు భవితలో జనసేన భాగస్వామ్యం

3లో

ఆదర్శ హైకోర్టు అందరి బాధ్యత

- నిష్పక్ష తీర్పులతోనే ప్రజలకు చేరువయ్యేది
- ప్రాథమిక హక్కులకు తొలి ప్రాధాన్యం
- తాత్కాలిక హైకోర్టు ప్రారంభోత్సవంలో సుప్రీం కోర్టు జస్టిస్ రమణ



అమరావతి, ఆంధ్రప్రభ : 'హైకోర్టు ఏర్పడినంతనే మన కర్తవ్యం తీరదు. అందుకు మనం అర్హులమని రుజువు చేసుకుంటూ ఆదర్శ సంస్థగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేయాలంటూ, 1954 జూలై 5న గుంటూరులో హైకోర్టు ప్రారంభించిన సందర్భంలో ప్రముఖ న్యాయ దిగ్గజం కోకా సుబ్బారావు గారి వ్యాఖ్యలు అప్పటికీ, ఇప్పటికీ అనుసరణీయం' అంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ

3వ పేజీలో...

కొలువుదీరిన కొత్త న్యాయపీఠం

సీజేతో సహా 13 మంది జడ్జిల ప్రమాణం



3లో


ఔరా..!



పామర్రులో పట్టు ఎవరిది?

చెరిగోరి

సమరన్నినాదం 2019



- ప్రాభవం నిలబెట్టుకునేందుకు టీడీపీ ఆరాటం
- వైభవం నిలుపుకునేందుకు వైకాపా పాట్లు
- చాపకింద నీరులా జనసేన విస్తరణ
- త్రిముఖ పోటీతో రసవత్తరం

వివరాలు 2లో..

గుంటూరు తీర్పు తెస్తుందా మార్పు!

- అధికార పార్టీ అభివృద్ధి మంత్రం
- పల్నాడులో పట్టుకు వైకాపా
- డెల్టాలో జనసేన దూకుడు
- రసవత్తరంగా రాజధాని జిల్లా రాజకీయం



నేటి నుంచి జన్మభూమి-మా ఊరు


● 10 రోజులపాటు నాలుగేళ్ల అభివృద్ధిపై చర్చ ● రెండు దశాబ్దాలుగా నిరంతరాయంగా సాగుతున్న కార్యక్రమం ● ప్రజల భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి ● ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: 'ప్రజల వద్దకు పాలన' పేరుతో రెండు దశాబ్ధాల క్రితం ప్రారంభమైన 'జన్మభూమి' కార్యక్రమం మరోదఫా బుధవారం నుండి ప్రజల ముందుకు రానున్నది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. 6వ విడత జన్మ భూమి-మా ఊరు కార్యక్రమం నేటి నుండి 11 వరకూ నిర్వహిం చనున్నారు. 10 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో పది అంశాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన 10 శ్వేతపత్రాలపైన జన్మభూమి గ్రామసభల్లో ప్రజల ముందు చర్చించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ప్రభుత్వం అధికారిక ఆదేశాలను కూడా జారీ చేసింది. శ్వేతపత్రాలపై చర్చతోపాటు ఆయా గ్రామాల సమగ్రాభివృద్ధికి సంబంధించిన వ్యూహ ప్రణాళికలను జన్మభూమి కార్యక్రమం చివరిరోజు వెల్లడిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే గ్రామసభల్లో ప్రజా సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారు. కొత్తరేషన్ కార్డులను ఇదే కార్యక్రమంలో అందించేందుకు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే వివిధ పథకాలలోని లబ్ధిదారులకు ప్రోత్సాహకాలను కూడా పంపిణీ చేయనున్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అందిస్తున్న ఇతర సేవలపై 10 రోజులపాటు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. సీఎం సందేశాన్ని గ్రామసభల్లో వినిపిస్తారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లోనూ వివిధ రకాల పోటీలు నిర్వహించి, వారికి పురస్కారాలను అందజేయనున్నారు. ఫుడ్ ఫెస్టివల్, 5కే రన్, సాంస్కృతిక కార్యక్రమాలు, 'జన్మభూమి-మాఊరు'కు అదనపు ఆకర్షణ. హెల్త్ క్యాంపులు, వెటర్నరీ క్యాంపులను కూడా ఈసందర్భంగా అధికారులు ఏర్పాటు చేయనున్నారు.

జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో సక్రమ నిర్వహణకు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 13 జిల్లాలలోని 51 రెవెన్యూ డివిజన్లలో 31మంది ఐఏఎస్ అధికారులను కేంద్ర సర్వీసులకు చెందిన మరికొందరిని నోడల్ అధికారులుగా నియమించారు. 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాల సమగ్ర ప్రణాళిక కోసం వివిధ శాఖలతో రాష్ట్రప్రణాళికా శాఖ సమన్వయం చేసుకొని పర్యవేక్షించనున్నది.

ఈ జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలు జరిగే 10 రోజులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 13 జిల్లాల్లోనూ పర్యటించి పలు గ్రామ సభల్లో పాల్గొననున్నారు. మొదటి రోజు చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

కార్యక్రమంలో చర్చించే అంశాలు



2వ తేదీ: వయాడక్ట్ కరప్రతాల ఆవిష్కరణ. రాష్ట్ర పునర్విభజన అంశాలపై చర్చ

3వ తేదీ : రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వృద్ధిరేటు

4వ తేదీ : 100శాతం రేషన్, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లికానుక, గృహనిర్మాణం, ఉపకారవేతనాలు, వసతిగృహాలు, జ్ఞానభూమి, ఆదరణ, అన్న క్యాంటీన్లు, మధ్యాహ్న భోజన పథకం, పేదరికంపై గెలుపు, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై చర్చ.

5వ తేదీ : రైతు సంక్షేమం, పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆహారశుద్ధి రంగంపై చర్చ.

6వ తేదీ : భూగర్భజలాలు సహా జలవనరుల నిర్వహణ, పచ్చదనం, పునరుత్పాదక విద్యుత్, కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పులు, పర్యావరణ హిత కార్యక్రమాలు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, విద్యారంగం, వైద్యం-ఆరోగ్యం, సూక్ష్మపోషకాల పంపిణీ, ఐఎంఆర్, ఎంఎంఆర్‌పై చర్చ.

7వ తేదీ : మానవవనరుల అభివృద్ధి, నైపుణ్యాల వినియోగం, విద్య, వైద్యం, పోషకాహారం, తల్లీబిడ్డలు, చిన్నారుల సంరక్షణ కార్యక్రమాలపై చర్చ, ప్రోత్సాహకాల పంపిణీ.

8వ తేదీ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, గ్రామాల వారీగా స్టార్ రేటింగ్, వ్యర్థాల నిర్వహణ, సుస్థిర అభివృద్ధి సాధన, ఎల్ఈడీ వీధి దీపాలు, ఫైబర్‌గ్రిడ్, రహదారుల అనుసంధానం, తాగునీరు, గ్యాస్ కనెక్షన్లు, ఓడీఎఫ్, విద్యాపరమైన వసతులపై చర్చ.

9వ తేదీ: విద్యుత్, వనరుల అభివృద్ధి, ఓడరేవులు, జలరవాణా, విమానాశ్రయాలు, అమరావతి నిర్మాణం, రహదారుల అభివృద్ధిపై చర్చ.

10వ తేదీ : పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, తయారీ పరిశ్రమ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక నగరాలు, నైపుణ్యాభివృద్ధి, ముఖ్యమంత్రి యువనేస్తం, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, ఐటీ, ఐటీఈఎస్, ఫిన్‌టెక్, ఏవీజీసీ, పర్యాటక రంగాల అభివృద్ధిపై చర్చ.

11వ తేదీ : సుపరిపాలన, ఆర్టీజీ, ఈ-ప్రగతి, ఈ-గవర్నెన్స్, శాంతి భద్రతలు, ఎక్సైజ్‌పై చర్చ.



విశాఖ శారదాపీఠంలో ప్రముఖుల పూజలు

● ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో : విశాఖ శారదా పీఠంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం పీఠ ప్రాంగణంలో సీబీఐ కోర్టు జడ్జి పాపిరెడ్డి దంపతులు, సినీనటులు, ఎంపీ మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ తదితరులు దేవతామూర్తులను దర్శనం చేసుకున్నారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర అనుగ్రహ భాషణం నిర్వహించారు.

శారదామాత ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరుగుతుందని స్వామీజీ ఆకాంక్షించారు. దేశ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రతీ పీఠా లోక కళ్యాణార్థం అనేక పూజలు కార్యక్రమాలు పీఠంలో నిర్వహిస్తున్నామన్నారు. ఉత్తర పీఠాధిపతి కిరణ్‌కుమార్ శర్మ ఏర్పాట్లు పర్యవేక్షించగా, పీఠం శ్రీకార్యం కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వాగతించారు.

తొలుత సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని సినీనటుడు రాజేంద్రప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

రుణభారం వేధిస్తున్నా... ప్రగతి శ్వాసిస్తున్నా...

● విభజన చట్టంలో 9, 10 షెడ్యూళ్లపై కాలయాపన ● రూ.3,800 కోట్లు నష్టపోయిన ఏపీ ● గ్రామ సభల్లో శ్వేతపత్రాలపై చర్చిస్తాం ● ఆఖరి శ్వేతపత్రం విడుదలలో సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంపై ఎంతో రుణ భారం ఉన్నప్పటికీ, ప్రజలమీద భారం వేయకుండా అభివృద్ధి ద్వారా ఆదాయ వనరులను సమీకరించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. ఉండవల్లిలోని ప్రజావేదికలో చివరిదైన 10వ శ్వేతపత్రం విడుదల చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత నాలుగేళ్లలో పెన్షన్ల చెల్లింపునకు రూ.20,466 కోట్లు, రైతు రుణమాఫీకి రూ.14,926 కోట్లు వ్యయం చేశామన్నారు. అంతేకాకుండా స్వయం సహాయక సంఘాలకు రూ.10,018 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందని వివరించారు. వీటితోపాటు జలవనరులకు రూ.37,205 కోట్లు, రేషన్ బియ్యం సబ్సిడీ కింద రూ.8,817 కోట్లు వెరసి రూ.91,432 కోట్లు మేర వ్యయం చేయడం జరిగిందన్నారు. అన్నివర్గాల ప్రజలకు చేయూతనిచ్చేందుకు ఎన్టీఆర్ వైద్య సేవ పరిమితిని రూ. 2 లక్షల నుంచి రూ.5 లక్షలుకు గరిష్టంగా పెంచామన్నారు. మానవాభివృద్ధి సూచికల్లో అత్యధిక వృద్ధి సాధించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఆర్థిక పరిపుష్టిని ప్రతి కుటుంబానికి కల్పించేందుకుగానూ ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్‌ను తయారుచేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. ప్రతి కుటుంబానికి ఒక స్మార్ట్ ఫోన్ అందించాలని యోచనలో ఉన్నామని తెలిపారు. సామాన్యుడు కూడా సాంకేతికతను వినియోగించుకోవాలన్న ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టంచేశారు. 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. శ్వేత పత్రాల విడులపై కొంత మంది ఏమీ తెలియకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనా అనుభవం లేని కొంత మంది అది చేస్తా.. ఇది చేస్తానంటూ మాట్లాడుతున్నారని పరోక్షంగా వైకాపా అధినేత జగన్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. తమ అభివృద్ధి, కష్టం ప్రజలకు స్పష్టంగా తెలియాలనే శ్వేతపత్రాల్లో స్పష్టంగా తెలియజేశామన్నారు. షెడ్యూల్ 9, 10 ప్రకారం రెండు రాష్ట్రాల సంస్థల విభజన ఇంతవరకు జరగలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమౌతుందన్నారు. ఇవన్నీ చేయకుండా అదే సమయంలో కేంద్రం మనల్ని అణగదొక్కడానికి ప్రయత్నించడమే దుర్మార్గమన్నారు. ఈనాలుగున్నరేళ్లు సాధించిన ప్రగతి, సమస్యలపై రేపటి నుంచి జరిగే జన్మభూమి గ్రామసభలలో, వార్డు సభలలో చర్చించబోతున్నామన్నారు, దీర్ఘకాలంలో, తక్కువ కాలంలో సమాజానికి మేలు కలిగే అనేక కార్యక్రమాల్ని అమలు చేయబోతున్నామన్నారు. మోయలేని భారంతో అప్పులు చేస్తే చివరికి దివాళా తీసే పరిస్థితి రాకూడదన్నారు. ఆస్తులన్నీ హైదరాబాద్‌లోనే ఉండటంతో ఏపీ భారీ స్థాయిలో రూ.3,800 కోట్లు నష్టపోయిందన్నారు. మన రాష్ట్రంలో సేవారంగం ద్వారా రాబడి చాలా తక్కువగా ఉందన్నారు. నాలుగేళ్లుగా ఏపీ 10.52 సుస్థిర వృద్ధిరేటుతో బెస్ట్ ఎకనమిక్ పెర్ఫామర్‌గా మారిందన్నారు. 2013-14 లో రూ.4.64 లక్షల కోట్లు గా ఉన్న ఆదాయం 2017-18 నాటికి రూ.8.40 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. అంటే నాలుగేళ్ల వ్యవధిలో రూ.3.4 లక్షల కోట్లు (73 శాతం) కు పెరిగిందని తెలిపారు. జిఎస్‌డిపి చూస్తే రెండు రాష్ట్రాలకు వ్యత్యాసం రూ.12, 692 కోట్లు (1.4 శాతం). మాత్రమేనన్నారు. ప్రస్తుత ధరలతో పోలిస్తే గత నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్ సుస్థిరమైన అభివృద్ధి వల్ల సరాసరి వృద్ధిరేటు 14.72 శాతంగా నమోదైందని చెప్పారు.

ప్రజలతో చర్చిస్తాం

నాలుగున్నరేళ్లలో ఈ ప్రభుత్వం ఏంచేసిందో ఈ పది శ్వేత పత్రాల్లో వివరించడం జరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. బుధవారం నుంచి పది రోజుల పాటు జరగనున్న జన్మభూమి సభలలో వీటన్నింటినీ ప్రజలకు చెబుతామన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన కృషి అభివృద్ధి రూపంలో కళ్లముందు కనిపిస్తోందన్నారు. ప్రజలకు కష్టం వస్తే ప్రభుత్వం ఆదుకుంటోందనే భరోసా కల్పించామన్నారు. జల సంరక్షణ, నదుల అనుసంధానం వంటి విధానాలతో నాలుగున్నరేళ్ల క్రితం వరకు వున్న నీటి సమస్య ఇప్పుడు లేకుండా చేయగలిగామన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచలేదన్నారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షల్ని ఉచితంగా అందేలా చేస్తున్నామన్నారు. జన్మభూమి సభలకు తనే స్వయంగా వెళ్లనున్నట్లు తెలిపారు. జన్మభూమి అనంతరం 11వ తేదీ తరువాత ప్రతి గ్రామానికి విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తామన్నారు.

వైఫల్య ప్రధాని మోడీనే

(మొదటి పేజీ తరువాయి)



అక్కసుతో కేసీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి రూ. 5 వేల కోట్ల విద్యుత్ బకాయిలను చెల్లించాల్సి ఉండగా ఇక్కడ ప్రజలను రెచ్చగొట్టాలనే ఉద్దేశంతో లక్షలాది రూపాయల పత్రికా ప్రకటనలను ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు దేశాన్ని బీజేపీ భ్రష్టుపట్టించిందని, ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశంలో రెండే కూటములున్నాయని, అసలు ఫెడరల్ ఫ్రంట్ ఊసేలేదన్నారు. బీజేపీ, మిత్రపక్షాలు ఒక్కటైతే కాంగ్రెస్‌తోపాటు బీజేపీ వ్యతిరేక పార్టీలు మరో కూటమని చెప్పారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను సహించేది లేదన్నారు. ముగ్గురు మోడీలు కలిసి ఏదో చేద్దామని అనుకుంటున్నారని, అదిసాధ్యమయ్యే పరిస్థితి లేదన్న అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి వ్యక్తంచేశారు. యూపీఏ హయాంలో జరిగిన అభివృద్ధికి, ఎన్డీఏలో జరిగిన అభివృద్ధికి ఏమాత్రం తేడాలేదన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్ గెలిస్తే వీరంతా ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. మీవల్ల దేశానికి ఏం మేలు చేకూరిందని, దీనిపై చర్చకు సిద్ధమా అని ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన వృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. నోట్ల రద్దు, జీఎస్టీతో సాధించిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశాన్ని బీజేపీ భయభ్రాంతులకు గురిచేస్తోందని, అసంబద్ధమైన నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని అన్నారు. తెలంగాణ ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోడీతోపాటు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అనేక మార్లు పర్యటించి కేవలం ఒక్క ఎమ్మెల్యే సీటు గెలుచుకున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలోనూ, అటు తరువాత కేసీఆర్ ప్రధాని మోడీని ఎన్ని మాటలు మాట్లాడారో గుర్తులేదా అని నిలదీశారు. ప్రజలను మోసం చేద్దామని మోడీ, కేసీఆర్ బృందం ప్రయత్నిస్తుందని, ఇది జరగని పని అన్నారు. కేంద్రం అనుసరించిన ఆర్థిక, పరిపాలనా పరమైన విధానాల వలన దేశానికి ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. అదేవిధంగా ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్రం తలదూర్చి ముస్లిం కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేయాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ అంశంలో ముస్లిం నేతలు ఎంతగా మొరపెట్టుకున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కేవలం వ్యక్తులకోసం కాకుండా వ్యవస్థకోసం, దేశం కోసం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలవల్ల దేశ సమగ్రత దెబ్బతినే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్రం ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడుతుందని ఆరోపించారు. ఎవరికీ ఫోన్‌లో మాట్లాడుకునే స్వేచ్ఛలేదని, పొరపాటున ఎవరైనా మాట్లాడితే రికార్డింగ్ బెదిరింపులు వచ్చే పరిస్థితులున్నాయన్నారు.

ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి: సీఎంకు జేపీసీ నేతల వినతి

అమరావతి, ఆంధ్రప్రభ : నూతన సంవత్సరం సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రెవెన్యూ ఉద్యోగుల డైరీని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం పునరుద్ధరించాలని కోరారు. 70 ఏళ్లు నిండిన విశ్రాంతి ఉద్యోగులకు 15శాతం అదనపు పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని, కాంట్రాక్ట్, రోజువారీ, ఎన్ఎమ్ఆర్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌పాలసీ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగుల వినతులపై సీఎం సానుకూలంగా స్పందిస్తూ, స్వర్ణాంధ్రకు సహకరించాలని కోరినట్టు నాయకులు తెలిపారు.

పామర్రులో పట్టెవరిది?

● ప్రాభవం నిలబెట్టుకునేందుకు టీడీపీ ఆరాటం ● వైభవం నిలుపుకునేందుకు వైకాపా పాట్లు ● చాపకింద నీరులా జనసేన విస్తరణ ● త్రిముఖ పోటీతో రసవత్తరం

కృష్ణా - ప్రభాన్యూస్ బ్యూరో: కృష్ణాజిల్లాలోని పామర్రు నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు స్వంత నియోజకవర్గం ఇది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ నియోజకవర్గ రూపురేఖలు మారాయి. దీంతో రాజకీయ సమీకరణలు కూడా మారిపోయాయి. ఈ నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు వైకాపా, తెలుగుదేశం పార్టీలు తలపడుతుంటే, జనసేన తన సత్తా చాటుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. పామర్రు నియోజక వర్గం ఏర్పడిన అనంతరం రెండు సార్లు జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం ఓటమి చవిచూసింది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సొంత నియోజకవర్గం కావడంతో ఇక్కడ వచ్చే ఎన్నికల్లో పాగావేసేందుకు తెలుగుదేశం ఉవ్విళ్లూరుతోంది. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ స్వగ్రామ మైన నిమ్మకూరును మంత్రి నారా లోకేష్ దత్తత తీసుకుంటే అదే మండలంలోని కొమరవోలు గ్రామాన్ని ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి దత్తత తీసుకున్నారు. దీంతో ఎస్సీ రిజర్వుడు నియోజక వర్గమైన పామర్రుపై అందరి దృష్టిపడింది.

గత ఎన్నికల్లో వైకాపా నుంచి గెలిచిన ఉప్పులేటి కల్పన తెలుగుదేశం పార్టీలో చేరారు. మరోవైపు గత ఎన్నికల్లో విజయం సాధించిన వైకాపా తిరిగి మరోమారు విజయ ఢంకా మ్రోగించేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఇదిలా ఉండగా 2009 ఎన్నికలలో ప్రజారాజ్యానికి 16.30 శాతం ఓట్ల లభించాయి. అప్పటి కన్నా జనసేన పట్ల ప్రజల్లో విశ్వాసం, నమ్మకం ఉందనే అభిప్రాయం పార్టీ నేతలలో ఉంది. ఈనేపథ్యంలో ముక్కోణ పోటీలో తమ సత్తా చాటుకోవాలని జనసేన నేతలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

నియోజకవర్గ ముఖ చిత్రం

ఈ నియోజకవర్గంలో పామర్రు, మొవ్వ, పమడిముక్కలు, తోట్లవల్లూరు, పెదపారుపూడి మండలాలున్నాయి. గతంలో మొవ్వ మండలం నిడుమోలు నియోజకవర్గంలోను, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాలు ఉయ్యూరు నియోజకవర్గంలోను, పెదపారుపూడి, పామర్రు మండలాలు గుడివాడ నియోజకవర్గ పరిధిలో ఉండేవి. నియోజకవర్గం నుంచి తొలిసారిగా 2009లో కాంగ్రెస్ పార్టీకి చెందిన డి.వై.దాస్, 2014లో వైకాపా అభ్యర్ధి ఉప్పులేటి కల్పన గెలుపొందారు. 2009 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి 41.76 శాతం, తెలుగుదేశం పార్టీకి 36.93 శాతం, ప్రజారాజ్యం పార్టీకి 16.30 శాతం ఓట్లు పోలయ్యాయి. 2014లో జరిగిన ఎన్నికలలో వైకాపాకు 45.83 శాతం ఓట్లు రాగా, తెలుగుదేశం పార్టీకి 45.12 శాతం ఓట్లు వచ్చాయి. ప్రస్తుతం పామర్రు నియోజకవర్గంలో 1.85 లక్షలు ఓట్లు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో ప్రధానంగా ఎస్సీ, కమ్మ, కాపు, రెడ్డి సామాజిక వర్గాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి.

అదే సమయంలో నియోజకవర్గంలో బీసీ ఓటర్ల కూడా గణనీయంగా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ నుంచి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన తిరిగి పోటీ చేయాలని భావిస్తున్నారు. పార్టీ టిక్కెట్ ఇచ్చే ఒప్పందంపైనే ఆమె తెలుగుదేశంపార్టీలో చేరినట్లు ఆమె వర్గీయులు పేర్కొంటున్నారు. అయితే ఈమె పార్టీ మారిన అనంతరం నియోజకవర్గ ప్రజలతో సరైన రీతిలో మెలగడంలేదనే ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలోనే మాజీ ఎమ్మెల్యే డి.వై.దాస్ తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయన వర్గీయులు కొంత మంది తెలుగుదేశం పార్టీలో చేరి ఆయకు అనుకూలంగా పావులు కదుపుతున్నట్లు వినికిడి. తెర వెనుక మరికొంత మంది నేతలు ఇక్కడ నుంచి పోటీ చేసేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

వైకాపా నుంచి కైలే అనిల్‌కుమార్ నియోజకవర్గ సమన్వయకర్తగా వ్యవ హరిస్తున్నారు. కల్పన టిడిపి తీర్థం తీసుకున్న అనంతరం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. మరోవైపు జనసేన పార్టీ నుంచి ఆ పార్టీ జిల్లా కన్వీనర్ పాలవర్తి డేవిడ్‌రాజు పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ముక్కోణ పోటీ జరుగనున్న నేపథ్యంలో పోటి ఆస్తకికరంగా మారే అవకాశం ఉంది.

గుంటూరు తీర్పు తెస్తుందా మార్పు!

● అధికార పార్టీ అభివృద్ధి మంత్రం
● పల్నాడులో పట్టుకు వైకాపా
● డెల్టాలో జనసేన దూకుడు
● రసవత్తరంగా రాజధాని జిల్లా రాజకీయం



నక్కా ఆనందబాబు



యరపతినేని



ఆలపాటి రాజేంద్ర



నాదెండ్ల మనోహర్



పిన్నెలి రామకృష్ణ



రావెల కిషోర్‌బాబు

గుంటూరు, ప్రభ న్యూస్ బ్యూరో: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గుంటూరు జిల్లా రాజకీయాలు శరవేగంగా మారు తున్నాయి. ఆదినుండీ ఈ జిల్లా ఓటరు నాడి గమనించడం రాజకీయ విశ్లేషకులకు కొంచెం కష్టంగానే ఉంటోంది. ఈ జిల్లాలో మొత్తం 17 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 2014లో 12 అసెంబ్లీ స్థానాలను టీడీపీ, 5 నియోజక వర్గాలతో వైకాపా గెలుపొందాయి. అయితే ప్రస్తుత పరి స్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా మారింది. జనసేన ఈసారి బరిలోకి రావడంతో రాజకీయ సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. పల్నాడులో టీడీపీ, వైసీపీలు ఢీ అంటే ఢీ అన్నట్లు ఉన్నాయి. టీడీపీ కంచుకోటలను ఎలాగైనా బద్దలు కొట్టేందుకు వ్యూహాలు పన్నుతూ వైసీపీ ఈ మధ్యకాలంలో దూకుడు పెంచింది. దీనికి తగ్గట్లు గానే టీడీపీ కూడా ప్రతివ్యూహాలు రచిస్తోంది. గత నెలలో ముఖ్య మంత్రి చంద్రబాబు పర్యటనతోపాటు మంత్రి నారా లోకేష్ కూడా ఈ ప్రాంతంలో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభో త్సవాలు చేశారు. వైసీపీ కూడా పల్నాడు గర్జన సభను విజయవంతం గా నిర్వహించింది. మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరోసారి ఇక్కడ నుంచే పోటీ చేస్తుండగా, టీడీపీ మాత్రం ఎప్పటిలాగే చివరి వరకు అభ్యర్థిని ప్రకటించపోవచ్చనే తెలుస్తోంది. గురజాలలో టీడీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావునే అధిష్టానం మరోసారి బరిలోకి దింపనుండగా, వైసీపీ నుండి కాసు మహేష్‌రెడ్డి బరిలోకి నిలవనున్నారు. ఇక్కడ యరపతినేనిపై గట్టి పోటీకి వైసీపీ వ్యూహాలు చేస్తోంది. వైసీపీ ప్రతి సభను పల్నాడులోని గురజాల నియోజకవర్గాన్ని వేదికగా చేసుకుంటోంది. దీంతో అక్కడ రాజకీయం రసవత్తంగా మారింది.

డెల్టాలో చాపకింద నీరులా జనసేన..

డెల్టా ప్రాంతంలో చాపకింద నీరులా జనసేన విస్తరిస్తూ ఇరు పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఇప్పటికే తెనాలిలో మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ జనసేనలో చేరడంతో ఇరు పార్టీలకు గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది. త్రికోణంలో నాదెండ్ల హవానే కనిపిస్తుండటంతో టీడీపీకి ఇది గట్టిషాక్‌గా పరిణమించింది. ఇక్కడ ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. వైసీపీ నుండి శివకుమార్ రేసులో ఉన్నారు. జనసేన తరపున నాదెండ్ల పోటీతో ముగ్గురు ఒకే సామాజిక వర్గం కావడంతో పోటీ హోరాహోరీగా మారనుంది. వేమూరు నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా నక్కా ఆనందబాబు టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. ఇక్కడ నుంచి ఈసారి జనసేన పార్టీ తరపున రావెల కిషోర్‌బాబు పోటీ చేయాలని ఆయన సామాజికవర్గం కోరుతోంది. పొన్నూరులో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మరోసారి అవకాశం దక్కించుకుంటుండా, రెండోసారి కూడా వైసీపీ రావి వెంకటరమణకే సీటు ఇచ్చేందుకు సిద్ధమైంది. అయితే ఇక్కడ కాపు సామాజికవర్గం ఓట్లు 40 వేలకు పైగా ఉన్నాయి. జనసేన గట్టి అభ్యర్థి కోసం పావులు కదుపుతోంది. ఇక్కడ కూడా త్రికోణంలో పోటీ రసవత్తరం కానుంది.

రాజధాని కేంద్రంగా..

రాజధాని అమరావతికి కేంద్రమైన గుంటూరులో తేదేపాలో ఈసారి తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల అభ్యర్థుల మార్పు ఖాయం కానుందని భావిస్తున్నారు. తూర్పులో ఈసారి మైనార్టీలకు కేటాయించేలా చూస్తున్నారు. ఈ స్థానాల్లో అటు మైనార్టీలు, ఇటు బీసీ లేదా కమ్మ సామాజిక వర్గం వారికి ఛాన్స్ కనిపిస్తోంది. బీసీలకైతే యాదవ సామాజికవర్గానికి చెందిన బోనబోయిన శ్రీనివాసయాదవ్ పేరు వినిపిస్తుండగా, కమ్మ సామాజిక వర్గంలో రాయపాటి రంగబాబు, మన్నవ మోహనకృష్ణ మన్నవ సుబ్బారావు, భాష్యం రామకృష్ణలతోపాటు పెదకూరపాడు టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ల పేర్లున్నాయి. ఇక వైసీపీకొచ్చేసరికి తూర్పు సిట్టింగ్ ఎమ్మెల్యేపై కొంత అసంతృప్తితో ఉన్నట్లు తెల్సింది. అలాగే ఆపార్టీ అధిష్టానం కొత్త అభ్యర్థి కోసం వేట సాగిస్తున్నట్లు సమాచారం. పశ్చిమకు బీసీ సామాజికవర్గానికి మాజీ డీజీపీ చంద్రగిరి ఏసురత్నాన్ని ప్రకటించేసింది. కాగా మారిన సమీకరణలు, జనసేన పోటీతో గుంటూరు రాజకీయం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రసవత్తరం కానుంది. బాపట్ల నుండి వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతినే మరోమారు బరిలోకి దింపనుండగా, టీడీపీ నుండి ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, నరేంద్ర వర్మ, గాదె వెంకట రెడ్డిలు పోటీలో ఉన్నారు.

రేపల్లెలో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు మరోసారి అవకాశం దక్కనుంది. వైసీపీ నుండి మోపిదేవి వెంకట రమణ బరిలో నిలవనున్నారు. జనసేన అభ్యర్థికోసం వెతుకుతోంది. ఇక్కడ 42 వేల కాపు సామాజికవర్గ ఓటింగ్ ఉంది. అందుకే కొత్త అభ్యర్థికోసం అన్వేషణ ప్రారంభించింది. చిలకలూరిపేట నుండి రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి పత్తిపాటి పుల్లారావు మరోమారు బరిలోకి దిగుతుండగా వైసీపీ నుండి విడుద రజని పోటీలో ఉన్నారు. రాజధాని ప్రాంతమైన మంగళగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డినే వైకాపా మరోసారి బరిలోకి దింపనుండగా, టీడీపీ గంధి చిరంజీవి, బోనబోయిన శ్రీనివాస యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. జనసేన నుండి బీసీ వర్గానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ వస్తారని ఆపార్టీ నేతలు చెబుతున్నారు. నర్సరావుపేట నియోజకవర్గం నుండి శాసన సభ స్పీకర్ కోడెల శివప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే, ఈసారి ఈయన సత్తెనపల్లి నియోజకవర్గానికి మారతారనే ప్రచారం జరుగుతోంది. ఇక్కడ ఆయన కుమారుడు శివరామ్‌కు అవకాశం దక్కుతుందని చెబుతున్నారు. వైసీపీ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమౌతున్నారు. జనసేన పార్టీ మైనార్టీ నేతలను బరిలోకి దింపాలని యోచిస్తోంది.

సత్తెనపల్లి టీడీపీకి కొత్త అభ్యర్థిని వెతుకుతున్నారు. వైసీపీ నుండి అంబటి రాంబాబు, జనసేన నుండి బైరా దిలీప్ పోటీలో ఉన్నారు. పత్తిపాడులో సిట్టింగ్ ఎమ్మెల్యే రావెల కిషోర్ బాబు జనసేనకు వెళ్లారు. ఈ నేపద్యంలో ఈస్థానాన్ని స్థానికులకే కేటాయించాలని సమావేశం నిర్వహిస్తున్నారు. వైసీపీ మేకతోటి సుచరిత, జనసేన నుండి రావెల కిషోర్ బాబు పేర్లు వినిపిస్తున్నాయి. రావెల వేమూరు పట్ల ఆసక్తిగా ఉన్నారు. దీంతో ఇక్కడ రావెల లేదా కొత్త వ్యక్తి రంగంలోకి దిగే అవకాశం ఉంది. వినుకొండ నుండి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే టీడీపీ జీవీ ఆంజనేయులు తేదేపా నుండి మరోసారి బరిలో నిలవనున్నారు. వైసీపీ నుండి బొల్లా బ్రహ్మనాయుడు, కాంగ్రెస్ నుండి మక్కెన మల్లిఖార్జున్ బరిలో నిలవనున్నారు. అయితే, మల్లిఖార్జున్ జనసేనలో చేరతారనే ప్రచారం సాగుతోంది. తాడికొండలో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్ పనితీరుపట్ల అధిష్టానం అసంతృప్తితో ఉంది. మార్పు జరగవచ్చని అంటున్నారు. మార్పు జరిగితే శాసన మండలి విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ పేరు పరిశీలించే అవకాశం ఉంది. వైసీపీ నుండి ఉండవల్లి శ్రీదేవి బరిలో నిలవనున్నారు.

పార్లమెంటు స్థానాలిలా..

పార్లమెంటు స్థానాలను పరిశీలిస్తే ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన బాపట్లలో ఈసారి టీడీపీ, వైసీపీకి కొత్త అభ్యర్థులు తెరపైకి వస్తారనే ప్రచారం సాగుతోంది. నరసరావుపేట నుంచి రాయపాటి సాంబశివరావు టీడీపీ ఎంపీగా విజయం సాధించారు. అయితే ఈసారి కూడా ఆయన పోటీ చేస్తారని చెబుతున్నప్పటికీ, అధిష్టానం మాత్రం ఆయన కుమారుడికి స్థానం కల్పించే ఉద్దేశంలో ఉన్నట్లు తెలుస్తోంది. వైసీపీ నుండి విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య కుమారుడు శ్రీకృష్ణదేవరాయలును బరిలోకి దింపనుంది. గుంటూరు పార్లమెంటు విషయానికొస్తే మరోసారి గల్లాజయదేవ్‌కే ఎంపీ టిక్కెట్ ఖాయమయ్యేలా కనిపిస్తోంది. వైసీపీ అభ్యర్థిగా కిలారి రోశయ్య పేరును అధిష్టానం పరిశీలిస్తోంది.

చరిత్ర సృష్టిస్తా



(మొదటిపేజీ తరువాయి)

కల్పించేలా మన ప్రణాళికలు ఉండబోతున్నాయని వెల్లడించారు. కేవలం రాష్ట్ర అభివృద్ధేకాకుండా రాజకీయాల్లో కూడా విలువలు నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నానాటికీ దిగజారి పోతున్న రాజకీయ విలువలను పునరుద్ధరించేందుకు జనసేన అవిరళ కృషి చేస్తుందని చెప్పారు. నైతికత అనే మాటలకు తిలోదకా లిచ్చిన నేటి రాజకీయ నాయకులకు జనసేన వాటి అర్థం, పరమార్థం తెలిసొచ్చేలా చేస్తుందన్నారు. ఇవన్నీ జరగాలంటే అందరం కష్టపడి జనసేన పార్టీని గెలిపించుకుందామని కేడర్‌లో స్ఫూర్తినింపారు. అవి నీతి రహిత పాలన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అందరి దృష్టి ఆకర్షించిన జనసేనాని

ఎన్నికల బరిలోకి దిగుతామని గతంలోనే ప్రకటించినప్పటికీ బెజవాడ నుండే ఆ కార్యక్రమం మొదలు పెడతారని ఎవరూ ఊహించ లేదు. చివరికి పార్టీ కేడర్ కూడా. పవన్ ప్రకటన అటు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతోపాటు ఇటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల దృష్టినీ ఆకర్షించింది. ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని, ఆంధ్ర ప్రదేశ్‌కు బంగారు భవిష్యత్తు ఉండా లని ఆకాంక్షించిన పవన్, అట్టడుగు వర్గాలకు ఏమి కావాలో అదే జనసేన ఎజెండా అంటూ తన తొలి ప్రచారంలో పేర్కొనడం

ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కినప్పటికీ అటు అధికార పార్టీ అయిన తెలుగుదేశం కానీ, ఇటు ప్రతిపక్షమైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కానీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్ట లేదు. కానీ, నిన్నగాక మొన్న వచ్చిన జనసేన అంటున్న వారందరికీ సమాధానం చెప్పేలా పవన్ కల్యాణ్ ఊహించని రీతిలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడం విశేషం. దీంతో అన్ని రాజకీయ పార్టీల్లోనూ విస్తృత మైన చర్చ జరుగుతోంది.

ప్రచారంలోనూ ముందంజ

నిరుపేదల గుండెల్లో చిగురించిన ఆశలు

రాష్ట్రంలో సామాన్యుడే రాజై వెలగాలన్న ప్రకట నిరుపేదల గుండెల్లో ఆశలు చిగురింపజేసింది. ఇప్పటివరకూ కేవలం ఎన్నిక ల్లో ఓట్లేసే పరికరాలుగా మాత్రమే రాజకీయ పార్టీలు నిరుపేదలను చూశాయి. ఇప్పుడు కొత్తగా పవణ్ కళ్యాణ్ చేసిన ఈ ప్రకటన వారి లో ఒక భరోసాను, ఒక ధైర్యాన్ని నింపిందడనంలో ఎటువంటి సందే హం లేదని ఒక సీనియర్ రాజకీయ విశ్లేషకుడు చెప్పారు. రాజకీయా ల్లోనూ నూతన శకం ఆరంభమైందని ఆయన పేర్కొన్నారు. యువత రాజకీయాల్లోకి వస్తేనే అన్ని రంగాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని చెప్పారు.

తో రాజకీయ నాయకుల దృష్టి పవన్ కల్యాణ్‌వైపునకు మరలింది.

రాష్ట్ర రాజకీయాలపై రసవత్తర చర్చలు

జనసేనాని ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడంతో రాష్ట్ర రాజకీయాలపై చర్చ ప్రారంభమైంది. ఒకవైపు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పరస్పర ఆరోపణల చుట్టూ తిరిగిన రాజ కీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ ఎజెండా ఎలా ఉండబోతోంది, ఏ పార్టీ మేనిఫెస్టో ఎలా ఉండబోతోం ది అనే అంశంపై చర్చ ప్రారంభమైంది. దీనికితోడు సామాన్యుడే రాజై వెలగాలన్న పవన్ నినాదం అన్ని పార్టీల నేతలను ఆకట్టుకోవడం విశేషం.

ముఖ్యంగా రాష్ట్రంలో నెలకొన్న అనేక సమస్యలను కూడా పవన్ ప్రస్తావించే అవకాశముందని తెలుస్తోంది. ప్రత్యే క హోదా అంశంతోపాటు విభజన చట్టంలో పేర్కొ న్న కేంద్రప్రభుత్వ సంస్థల ఏర్పాటు, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారం ఏర్పా టు, లోటు బడ్జెట్ పూరించడం, అమరా వతి రాజధాని నిర్మాణం వంటి కీలక అం శాలపై వపన్ ప్రచారంలో పేర్కొనే అవకా శముందని పలు రాజకీయ విశ్లేష కలు చెబుతున్నారు. దీనికితోడు గతంలోనే ఉ ద్దానం కిడ్నీ బాధితులకు బాసటగా నిలచిన అంశాన్ని వారు ఈ సందర్భంగా ఉటంకిస్తు న్నారు. సమాజంలో అట్టడుగు వర్గాలకు చే యూతనిచ్చే విధంగా జనసేన హామీలు ఉండబో తున్నాయంటూ ఇప్పుడే ప్రచారం ప్రారంభమైంది.

కొలువుదీరిన కొత్త న్యాయపీఠం

- సీజేతో సహా 13 మంది న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం
- గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు హాజరు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తుల ప్రమాణ స్వీకారం అత్యంత వేడుకగా మంగళ వారం విజయవాడలోని ఇందిరాగాంధీ మైదానంలో జరిగింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ హైకోర్టు న్యాయమూర్తులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉదయం 10.30 గంటల నుంచి అరగంట పాటు హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకార కార్య క్రమం జరిగింది. ముందుగా వేదికకు చేరుకున్న ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు గవర్నర్ నరసింహన్‌కు సాదరస్వాగతం పలికారు. అనంతరం తాత్కాలిక న్యాయ మూర్తితో పాటు 13మంది న్యాయమూర్తులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. హైకోర్టు తాత్కాలిక న్యాయ మూర్తిగా జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ తొలుత ప్రమాణ స్వీకా రం చేయగా.. ఆ తర్వాత వరుసగా జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ ఎం.సీతారామమూర్తి, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్, జస్టిస్ జె.ఉమాదేవి, జస్టిస్ ఎన్.బాలయోగి, జస్టిస్ టి.రజని, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ కె.విజయలక్ష్మి, జస్టిస్ ఎం.గంగారావు ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముం దు రాష్ట్రపతి నోటిఫికేషన్ ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సి.మానవేంద్రనాథ్ రాయ్ చదివి వినిపించగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు ప్రమాణ స్వీకారం తర్వాత కార్యక్రమాన్ని ముగించినట్లు ప్రకటిం చారు. హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, నక్కా ఆనందబాబు, కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, అధికారులు, హైదరాబాద్ నుంచి వచ్చిన న్యాయమూర్తులు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

బంగారు భవితలో జనసేన భాగస్వామ్యం

- ప్రతి కుటుంబంలోనూ సుఖసంతోషాలు వెల్లివిరియాలి
- నూతన సంవత్సర వేడుకల్లో జనసేనాని పవన్ కల్యాణ్ ఆకాంక్ష

అమరావతి, ఆంధ్రప్రభ : నూతన సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉండాలని, ఆ భవిష్యత్తు పునర్ని ర్మాణంలో జనసేన పార్టీ కీలక పాత్రపోషించాలని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. విజయవాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఉద యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్చాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కల్యాణ్



మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని చెప్పారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఇంట సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాం క్షించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా కష్టపడి పనిచేయాలని, ఆ శ్రమ ఫలితం అందరి కుటుంబాల్లో ఆనందాన్ని నింపేలా ఉండా లని చెప్పారు. ముఖ్యంగా మహిళా లోకం, యువతరం కొత్త సంవ త్సరంలో కొంగొత్త ఆశలతో తమ జీవితాన్ని ప్రారంభించాలని కోరారు. వారు కోరుకునే ప్రతి కోరికా సాఫల్యం కావాలని, మనస్ఫూ ర్తిగా నెరవేరి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మన ఉన్నతిని మనం సాధించడంతోపాటు మన సంపాదనలో కొంతమేర ఖర్చుచేసి నిరుపేదలను ఆదుకునే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు.

ఆంగ్లేయులు మనకు విడిచిపెట్టిన ఈ సంస్కృతిని వారు వెళ్లిపోయినా తూ.చ.తప్పకుండా పాటించడమే భారతీయుల్లోని గొప్పదనాన్ని చాటిచెబుతుందన్నారు. ఒక విధానాన్ని ఎవరు ప్రవేశపెట్టినా దానిని గౌరవించడమే భారతీయ సాంస్కృతి అని చెప్పారు. అటువంటి గొప్ప సంస్కృతి, సాంప్రదాయాలను అందిం చిన భారతమాత బిడ్డలుగా మన మీద భవిష్యత్ బాధ్యతలెన్నో ఉన్నాయని గుర్తించాలన్నారు. బాధ్యత గల పౌరులే జనసేన కార్యకర్తలని గుర్తుంచుకోవాలన్నారు. జనసేన పార్టీ భవిష్యత్ తరాల కోసం కష్టపడి పనిచేస్తూనే ఇప్పటితరం వారికి ఏది అవసరమో గుర్తించి దానిని అందించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని మరోవారు జనసేనాని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఆదర్శ హైకోర్టు అందరి బాధ్యత



(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మంగళవారం విజయవాడ లో కొలువుదీరింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హైకోర్టు తాత్కాలిక భవన సముదాయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, హైకోర్టు ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి జస్టిస్ రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శవంతమైన సంస్థగా కోర్టులను తీర్చిదిద్దడంలో న్యాయమూర్తులకు న్యాయవాదులు, ప్రజలు సహకరించి నప్పుడే సాధ్యపడుతుందన్నారు. హైకోర్టు విధులు క్లిష్టంగా ను, సున్నితంగాను ఉంటాయని ఆయన చెప్పారు. వ్యక్తుల మధ్య, వ్యక్తులు, ప్రభుత్వాల మధ్య వచ్చే వ్యాజ్యాలను విచా రించి న్యాయాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత న్యాయమూ ర్తులపై ఉందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడు తూ రాజ్యాంగంలోని నిబిడీకృత అంశాలకు తగిన ప్రాధా న్యత ఇస్తూ నిష్కర్షగా కర్తవ్యాన్ని నిర్వహించాల్సి ఉంటుం దని చెప్పారు. తీర్పులు వెలువరించడంతో న్యాయమూ ర్తులు నిష్కర్షగా, స్వతంత్రతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు గౌరవ భావం ఏర్పడే విధంగా పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. న్యాయస్థానాల ప్రాధాన్యతను పెంపొందించడంలో ప్రజలు సహకరిస్తారనే నమ్మకాన్ని జస్టిస్ రమణ వ్యక్తం చేశారు.

చరిత్ర పునరావృతం : సీజే ప్రవీణ్‌కుమార్


హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఏపీలో హైకోర్టు ఏర్పాటుకు జస్టిస్ రమణ సూచనలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పరిగణలోకి తీసుకోవడం ముదావహమని, ఇందుకు ధన్యవాదాలు చెపుతున్నానని ఆయన పేర్కొ న్నారు. రాష్ట్ర హైకోర్టు ఏర్పాటులో చరిత్ర పునరావృతం అయ్యిందన్నారు. ఏపీలో తొలి హైకోర్టు గుంటూరు కేంద్రంగా పనిచేసిందని చెపుతూ 1956లో హైదరాబాద్‌కు తరలించడం జరిగిందన్నారు. తిరిగి నూతన రాష్ట్రం ఏర్ప డిన తర్వాత రాజధాని అమరావతిలో హైకోర్టు కార్యకలాపాలకు శ్రీకారం చుడు తున్నట్లు పేర్కొన్నారు. అమరావతి రాజధాని కేంద్రంగా 62ఏళ్ల తర్వాత విజయ వాడలో హైకోర్టు కార్య కలా పాలు చేపట్ట డ ం

చారిత్రక ఘట్టం గా జస్టిస్ ప్రవీణ్ కుమార్ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సి.మానవేంద్రనాథ్ రాయ్, నూతన న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, అధికారులు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

సంతోషం కలిగిస్తోంది

-సుప్రీం సీజే రంజన్ గొగోయ్ సందేశం

రాష్ట్ర ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ విభాగం కార్యకలాపాలు విస్తృతం కావడం సంతోషం కలిగిస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పంపిన సందేశాన్ని జస్టిస్ ఎన్వి రమణ చదివి వినిపించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దేశ న్యాయ వ్యవస్థలోనే అతిపిన్న వయసు కలిగిందన్నారు. న్యాయ వ్యవస్థ గర్వించదగినదిగా ఉండాలని, ఇందుకు మనపై ఎంతో బాధ్యత ఉందన్నారు. విధుల్లో ఆనందంగా భాగస్వాములు కావడం ద్వారా న్యాయ వ్యవస్థలోని చట్టపరమైన వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. న్యాయవాదులు న్యాయ వ్యవస్థలో జవాబుదారీగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 21న అమరావతి రాజధానిలో తాత్కా లిక హైకోర్టు భవనాలు ప్రారంభించడం ద్వారా పూర్తి స్థాయి కార్యకలాపాలు నిర్వహించనున్నట్టు తన సందేశం లో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గొగోయ్ తెలిపారు.



చారిత్రక ఘట్టం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్ తొలి సీఎంగా తాను, తొలి గవర్నర్‌గా నరసింహన్ బాధ్యతలు చేపట్టామని చెపుతూ ఇక్కడ హైకోర్టు ప్రారంభోత్సవం కావడంతో తొలి ప్రధాన న్యాయమూర్తి గా జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్ వ్యవహరించడం చారిత్రక ఘట్టం అవుతుందన్నారు. న్యాయ వ్యవస్థ ప్రజల వద్దకు చేరాలనేదే తమ అభిమతమన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రాజధాని అమరావతి ప్రాంతంలో హైకోర్టు కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఏపీలో హైకోర్టు నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడ్డామని తెలిపారు. ప్రభుత్వపరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తనపై నమ్మకంతో 33వేల ఎకరాల భూమిని ఇచ్చిన రైతుల ఆకాంక్షల మేరకు రాజధాని నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే తరహాలో హైకోర్టు భవన నిర్మాణాలను కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పూర్తి చేయడం ద్వారా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

ఉత్తరాంధ్ర కళలకు పుట్టినిల్లు

- డాక్టర్ గేదెల శ్రీనుబాబుకు ఘన సన్మానం

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: ఉత్తరాంధ్ర కళలకు, కళాకారులకు పుట్టి నిల్లు అని జనసేన పార్టీ నాయకులు, పల్సస్ అధినేత డాక్టర్ గేదెల శ్రీనుబాబు కొని యాడారు. ఉత్తరాంధ్ర పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షి కోత్సవం మంగళవారం రాత్రి కళాభారతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రాచీన భారతీయ కళలు, పాటలను, సంస్కృతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతై నా ఉందన్నారు. నేటి యువతరం అర్థం చేసుకునే విధంగా ప్రాచీన కళలను సరళీ కరించి శబ్ద సౌందర్యంతో మేళవించి పాటలు, నాటకాల రూపంలో అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాంధ్ర కళాకారులకు తెలుగు కళలు అంటే ఎనలేని మక్కువ అన్నారు.

విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం కళాకారులకు తెలుగు నాటకరంగం లో మంచి ప్రావీణ్యత ఉండి, ఎనలేని పేరు ప్రఖ్యాతలు సాధించుకున్నారన్నారు. అయితే నేటి తరుణంలో ప్రాచీన కళలకు అంతంత మాత్రమే ఆదరణ లభిస్తుంద న్నారు. భారతీయ సంస్కృతులతో పాటు ఉత్తరాంధ్ర కళలను కూడా ప్రోత్సహిం చాల్సిన అసరం ఉందని శ్రీనుబాబు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తెలుగు నాటక కళాకారులను ఆయన చేతులు మీదుగా సన్మానించారు. నాటికలకు సంబం ధించిన హార్మోనియంతో పాటు పలు రకాల సామాగ్రిని కళాకారులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షులు, వైఎస్ఆర్



కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ పి.వి.రమణమూర్తి, అధ్యక్షులు బడే శ్రీరాములనాయుడు, కార్యదర్శి వంకాయల మారుతీప్రసాద్, కోశాధికారి దామోదరరావులతో పాటు రంగస్థల కళాకారులు కురిటి సత్యంనాయుడు తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు గరికిపాటి ఉమా కాంత్, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబులను అతిథుల చేతులు మీదుగా ఘనంగా సత్కరించారు.

'గన్నవరం' భూ నిర్వాసితులకు స్టాంప్ డ్యూటీ రూ. 100

అమరావతి, ఆంధ్రప్రభ: కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయ అభి వృద్ధికి రైతుల నుండి సేకరించే భూ ములకు ప్రత్యామ్నాయంగా రాజ ధాని అభివృద్ధి సాధి కారసంస్థ (సీ ఆర్‌డీఏ) పరిధిలో ఇచ్చే ప్లాట్ల రిజి స్ట్రేషన్ ఫీజును మినహాయిస్తూ రాష్ట్ర రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసిం ది. అలాగే స్టాంప్ డ్యూటీ రూ.100 లుగా నిర్ణయించారు. ఈమేరకు రెవె న్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి డాక్టర్ డి.సాంబ శివరావు మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. రైతు ల నుండి సేకరించే భూమికి బదులు గా అమరావతి క్యాపిటల్ సిటీ పరిధి లో వీరికి నివాస స్థలాలను అందజే యనున్నారు. ఇందుకోసం ప్రభు త్వం రూ.18.88 కోట్ల విలువైన స్టాం ప్ డ్యూటీని మిన హాయిస్తూ ఉత్తర్వు లు జారీ చేసింది.

హైకోర్టు విభజనపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: హైకోర్టు విభజన నోటిఫికేషన్‌పై స్టే విధించాలని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నేడు విచా రణ జరపనుంది. మంగళవారం జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అబ్దు ల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణ చేయనుం ది. ఉమ్మడి హైకోర్టు విభజనపై రాష్ట్రపతి నోటిఫికేషన్‌ను వాయిదా వేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అమరావతిలో హైకోర్టు భవన నిర్మాణాలు, రోడ్ల నిర్మాణం పూర్తి కాలేదని పిటిషన్లో పేర్కొన్నారు. మౌలిక సదుపా యాలు ఇంకా సమకూరనందున నోటిఫికేషన్‌పై స్టే విధించా లని పిటిషన్లో అభ్యర్థించారు. హైకోర్టు నోటిఫికేషన్‌పై దాఖలైన పిటిషన్ల విషయంలో తమ అభిప్రాయం కూడా తీసుకోవాలంటూ తెలంగాణ ప్రభుత్వం కేవియేట్ పిటిషన్ దాఖలు చేసింది.

అన్నదాతకు అండగా రుణాలు



- రబీ సీజన్ లక్ష్యం రూ. 42,533 కోట్లు
- ఇప్పటి వరకూ రూ. 25,404 కోట్ల పంపిణీ
- ప్రస్తుతం 14.74 లక్షల హెక్టార్లలో రబీ పంటలు

అమరావతి, ఆంధ్రప్రభ: అందరికీ అన్నం పెట్టే అన్నదాతల జీవితా లను అత్యున్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పాలన సాగిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం సాగును లాభసాటిగా మార్చడం కోసం దేశానికే ఆదర్శవంతమైన రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. విభజన తరువాత 13 జిల్లాలతో ఏర్పడిన నవ్యాంధ్రలోని జనాభాలో దాదాపు 62 శాతం మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవ సాయ రంగంపై ఆధారపడి జీవించడం జరుగుతోంది.

దీనితో రైతన్నల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న సంకల్పంతో చంద్రబాబు సర్కార్ కర్షకుడు సేద్యం ప్రారంభించినప్పటి నుంచి పంట లను మార్కెట్‌లో అమ్ముకునేంత వరకు వివిధ దశల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సాహకాలను, తోడ్పాటును అందిస్తోంది. ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఖరీఫ్ పంటలను, అక్టోబరు నుంచి మార్చి వరకు రబీ పంటలను రాష్ట్ర రైతాంగం పండించడం జరుగుతోంది. సేద్యానికి ముందు దుక్కి మొదలు పెట్టే దశ నుంచి గిట్టుబాటు ధరతో పంటను అమ్ముకునేంత వరకు ప్రభుత్వం అంది స్తున్న సహకారంతో రాష్ట్ర రైతాంగం ప్రతి పంటలో అధిక దిగుబడులను సాధిస్తూ గత మూడేళ్లుగా నవ్యాంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగ వృద్ధి రేటులో దేశంలోనే నెంబర్ వన్‌గా కొనసాగడంలో కీలకపాత్రను పోషిస్తున్నారు.

25.54 లక్షల హెక్టర్లలో రబీ పంటలు..

అక్టోబరు నుంచి మార్చి వరకు చేపట్టే రబీసాగులో వరి, గోధుమ తదితర ఆహార ధాన్యాలు, చిరు ధాన్యాలు, నూనె గింజలు, పత్తి, పొగాకు, మిరప, ఉల్లి తదితర 25 రకాలకు పైగా పంటలను పండిస్తారు. 2018-19 రబీ సీజన్‌కు గాను రాష్ట్ర వ్యాప్తంగా 25.54 లక్షల హెక్టార్లలో రబీ పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని చంద్రబాబు సర్కార్ నిర్ణయించింది. దీనితో సాగుకు అవసర మైన పెట్టుబడులను సహకార బ్యాంకులు, వ్యాపార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ద్వారా పంట రుణాలు, గడువు రుణాలు, కౌలు రుణాల రూపంలో సమయా నికి రైతన్నలకు ప్రభుత్వం అందిస్తోంది. 2018-19 గాను ఖరీఫ్ రుణాలను రూ.59,032 కోట్లను అందించాలని నిర్ణయించిన చంద్రబాబు ప్రభుత్వం రూ.56,070 కోట్లను సాగు సమ యానికి అన్నదాతకు అందించింది. అలాగే రబీ సీజన్‌కు గాను రూ.42,533 కోట్ల రుణాలను అందించాలని సంకల్పించి ఇప్పటి వరకు రూ.25,404 కోట్లను బ్యాంకుల ద్వారా అందించింది. వీటిలో పంట రుణాల లక్ష్యం రూ.29,250 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.17,657 కోట్లను ఇవ్వడం జరిగింది. అలాగే గడువు రుణాల లక్ష్యం 13,282 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 7,747 కోట్లను అర్హులైన రైతులకు అందించడం జరిగింది. వీటితో పాటు కౌలు రైతులకు ప్రతి ఏటా ప్రత్యేక రుణాలను కూడా టీడీపీ ప్రభుత్వం అందిస్తోంది. 2018-19 ఏడాదికి గాను 10,85,517 మంది కౌలు రైతులకు రూ.4,841.22 కోట్లను వ్యవసాయ రుణాలుగా ప్ర భుత్వం అందించి దేశానికే ఆదర్శంగా నిలిచింది.

మార్చి వరకు రుణాల పంపిణీ

- ప్రత్యేక కమిషనర్ మురళీధర్ రెడ్డి..

రబీ సీజన్‌కు గాను అర్హులైన రైతులకు మార్చి నెల చివరి వరకు పంట, గడువు, కౌలు రుణాలను బ్యాంకుల ద్వారా అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ మురళీధర్ రెడ్డి తెలియజేశారు. రబీ సీజన్‌కు గాను వ్యవసాయ రుణాలను ప్రణాళికా బద్ధంగా రైతులకు అందించడం జరుగుతోందన్నారు. జిల్లాల వారీగా టార్గెట్‌లను నిర్ణయించుకొని జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో సమయానికి సాగు పెట్టుబడులను అందించడులను అందిస్తామన్నారు.



సీఎంఆర్ఎఫ్ ఫైలుపై తొలి సంతకం

- 6,207 అభ్యర్థనలకు సీఎం ఆమోదం

అమరావతి, ఆంధ్రప్రభ: 2019 నూతన సంవత్సరం తొలిరోజున ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి సహాయనిధి ఫైలుపై తొలి సంతకం చేశారు. వైద్య చికిత్సల కోసం సీఎంఆర్ఎఫ్ రియంబర్స్‌మెంట్‌కు మొత్తం 7,386 దరఖాస్తు రాగా, వాటిలో 6,207 దరఖాస్తుల ను ఆమోదించారు.

ఇందుకోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మొత్తం రూ. 34,50,59,383 విడుదల చేశారు. అలాగే లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీలు)కు వచ్చిన దరఖాస్తులు 1,179 కాగా, వాటికి రూ. 19,13,41,055 విడుదల చేశారు. ముఖ్య మంత్రి సహాయనిధి నుండి వైద్యఖర్చుల రియంబర్స్ మెంట్, ఎల్ఓసీలకు విడుదల చేసిన మొత్తం రూ. 53కోట్ల 64లక్షల 438. 2014 నుండి ఇప్పటి వరకూ సీఎంఆర్ఎఫ్ నుండి విడుదల చేసిన మొత్తం రూ.1249.56 కోట్లు..

దూదేకుల కో-ఆపరేటివ్ సొసైటీకి రూ.11.94 కోట్లు

నూర్‌బాషా దూదేకుల కో ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ కు రూ.11.94 కోట్లు విడుదల చేస్తూ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారు. నూతన సంవత్సరం కానుకగా బీసీ ఫెడరేషన్ ద్వారా నూర్ బాషా దూదేకుల ఫెడరేషన్‌కు నిధులు విడుదల చేశారు. దీని ద్వారా 1,896 మందికి లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు అవకాశం లభించింది.

ముఖ్యమంత్రికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన 'మానసిక వికలాంగులు'

ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం కొత్తసం వత్సరం శుభాకాంక్షలు తెలిపిన వారిలో నున్నలోని 'మాన సిక వికలాంగుల సంఘం'లో ఆశ్రయం పొందుతున్న మాన సిక వికలాంగులు ఉన్నారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్‌కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన మాన సిక వికలాంగులను చూసిన వెంటనే ఎంతో ఆప్యాయంగా వారిని పలకరించారు. తనకు కొత్త సంవత్సరం శుభాకాం క్షలు తెలిపేందుకు వారు నున్న నుండి రావడంపై సంతోషా న్ని వ్యక్తం చేస్తూ వారి యోగక్షేమాలను సంఘ నిర్వాహకుల నుండి సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 2 జనవరి 2019

జీఎస్టీలో మార్పులు పెద్దలకే ప్రయోజనం!

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన వస్తుసేవా పన్ను (జీఎస్టీ) మీద ప్రయోగాలు జరుగుతున్నాయి. జీఎస్టీ కి కాంగ్రెస్ వ్యతిరేకం కాదు, యూపీఏ హయాంలోనే జీఎస్ టిని ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. ఈ అంశంపై ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రి చిదంబరం రాజ్యసభలో అప్పటి బీజేపీ నాయకుడు, ప్రస్తుత ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీని పలు మార్లు సంప్రదించారు. అయితే, బీజేపీ సహకరించకపోవడం వల్లనే అది ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఆమోదం పొందింది. ఒకే దేశం-ఒకే పన్ను నినాదంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ పన్నును ఆర్థిక రంగంలో గొప్ప సంస్కరణగా పార్లమెంటులోనూ, మన్ కీ బాత్ ప్రసంగాల్లోనూ పెక్కు మార్లు అభివర్ణించారు. ఆర్మీలో ఒకే ర్యాంకు - ఒకే పెన్షన్ విధానాన్ని అమలు జేస్తున్నట్టే, దేశమంతటా ఒకే పన్ను విధానాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. ఈ విషయమై ఆర్థికమంత్రి జైట్లీ పలుమార్లు రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చలు జరిపారు. జీఎస్టీ మండలి పేరిట నెలకొల్పి దేశంలోని వివిధ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. జీఎస్టీ గరిష్ట రేటును 28 శాతంగా నిర్ణయించడాన్ని కాంగ్రెస్ మాత్రమే కాకుండా, మిగిలిన ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. రేటు తగ్గింపునకు ప్రభుత్వం వెంటనే దిగి రాలేదు. దశలవారీగా గరిష్ట పన్ను వర్తించే వస్తువులు, సేవల సంఖ్యను తగ్గిస్తూ వచ్చింది. చివరికి ఒకే రేటు అమలు జరపాలని నిర్ణయించింది. ఇలా తరచూ మార్పుడలంలోని మతలబు ఏమిటని మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం ప్రశ్నిస్తున్నారు. ఒకే స్టాండర్డ్ రేటును తెలివి తక్కువ ఆలోచన అంటూ ఎద్దేవా చేసిన కమలనాథులు ఇప్పుడు అదే తన లక్ష్యమనడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అలాగే, 18 శాతం రేటు సాధ్యం కాదని చెప్పిన ప్రభుత్వంలో ఇంత త్వరగా మార్పు రావడానికి రాజకీయ కారణాలు ఉన్నట్టు స్పష్టం అవుతోందన్న చిదంబరం వ్యాఖ్య నిరాధారం కాదు. జీఎస్టీ వల్ల చిన్న వర్తకులు బాగా నష్టపోయారు. పెద్ద కరెన్సీ రద్దు వల్ల వ్యాపారాలు తగ్గిపోయి ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న చిన్న వ్యాపారులు జీఎస్టీ రేట్లు (28 శాతం) వల్ల ఇంకా దెబ్బతిన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ ఓటమికి జీఎస్టీ రేట్లే ప్రధాన కారణం. రాజస్థాన్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులు గతంలో ఈ విషయం నేరుగానే జీఎస్టీ మండలి సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. పెద్ద నోట్ల రద్దుతో పాటు జీఎస్టీ రేట్లు బీజేపీ కొంప ముంచాయి. ఈ విషయాన్ని ఈ మూడు రాష్ట్రాలకు చెందిన కమలనాథులు వేర్వేరు సందర్భాల్లో అంగీకరించారు. జీఎస్టీ రేట్లు మార్చకుంటే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు వస్తాయని హెచ్చరించారు. జీఎస్టీ రేట్లపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గబ్బర్ సింగ్ టాక్స్ అని ఎద్దేవా చేసినప్పుడు కమలనాథులు ఆయనకు రాజకీయ అవగాహనే కాదు, ఆర్థికపరమైన అంశాల్లో సైతం అవగాహన లేదని హేళన చేశారు. రాహుల్ గాంధీ ఎద్దేవా మాట ఎలా ఉన్నా, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో వాణిజ్య వర్గాలు బీజేపీకి నిధులు, ఓట్ల పరంగా అండగా ఉంటాయన్న సంగతి జగద్విదితం. సింగిల్ రేటును నిర్ధారించాలన్న ఆర్థిక వ్యవహారాల ప్రధాన సలహాదారు సలహాను కూడా ప్రభుత్వం బుట్ట దాఖలు చేసింది. ప్రధాన ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన అరవింద్ సుబ్రహ్మణ్యం పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ రేట్ల వల్ల ఆర్థిక వ్యవస్థ తిరోగమనం పట్టిందని ఇటీవల వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే, ఆయన ఆ రెండు సంస్కరణలు అమలులో పెట్టినప్పుడు కీలకమైన పదవిలో కొనసాగి ఇప్పుడు విమర్శించడం వల్ల ఆయన మాటలను ఎవరూ పరిగణనలోకి తీసుకోలేదు. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ మాదిరిగా ఆయన ముందే పదవి నుంచి వైదొలగి ఈ వ్యాఖ్య చేసి ఉంటే ఆయనపై అపవాదు వచ్చి ఉండేది కాదు. విలాసవంతమైన వస్తువులపై తప్ప మిగిలిన వస్తువులపై 28 శాతం జీఎస్టీని దశలవారీగా తొలగిస్తామంటూ ఆర్థికమంత్రి ప్రకటించారు. ఐదు రకాలుగా ఉన్న జీఎస్టీ రేట్లను ఒకే రకంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పన్నుల నిర్వహణ సులభతరం అవుతుందని ప్రభుత్వం ప్రకటించింది కానీ, పాలకూర, బెంజి కారుకూ ఒకే రేటు పన్ను వసూలు చేయడం న్యాయం కాదు. విలాసవంతమైన వస్తువులు, సేవలపై హెచ్చు పన్ను రేటును వసూలు చేయడం తప్పు సహేతుకమే. జీఎస్టీ రేటు ఉండటంవల్ల కుబేరులూ, కడుపేదలూ ఒకే రేటు పన్నును చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ పై ప్రభుత్వం చేస్తున్న ప్రయోగాలు అన్నింటికీ ఒకటే మంత్రం అనే సామెతను తలపింపజేస్తున్నాయి. ఎన్నికలు మరో ఐదు నెల్లలో లేకపోతే జీఎస్టీ విషయమై ప్రభుత్వం దిగి వచ్చి ఉండేది కాదు. పెద్ద నోట్ల రద్దును ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి జైట్లీలు ఇప్పటికీ సమర్ధిస్తున్నారు. జీఎస్టీ వల్ల వసూళ్ళు పెరిగాయని ఘనంగా ప్రకటిస్తున్న జైట్లీ జీఎస్టీ పన్ను ద్వారా వసూళ్ళు నవంబర్ నెలలో కన్నా డిసెంబర్‌లో మూడు వేల కోట్ల రూపాయలు తగ్గింది. ఒకే జీఎస్టీ రేటు వల్ల ఆర్థిక వ్యవస్థపై విరుద్ధ ప్రభావాలను చూపుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పేదలు వినియోగించే వస్తువులపై పన్ను రేటు తగ్గిస్తే ఎంతో మేలు జరుగుతుందనీ, వస్తువుల ధరలు పెరిగిపోవడం వల్ల కొనుగోలు శక్తి తగ్గిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకే జీఎస్టీ రేటు అమలులో ఉన్న దేశాల్లో పేదలకు సంక్షేమ పథకాల సబ్సిడీ సొమ్మును నగదు బదిలీ ద్వారా లబ్ధిదారులకు అందజేయాలని నిపుణులు సూచిస్తున్నారు. మన దేశంలో నగదు బదిలీ పథకం పరిహాసంగా తయారైంది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోంది. అయితే, లబ్ధిదారుల్లో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు కావడం వల్ల బ్యాంకు లావాదేవీలకు ఇతరులపై నిరుపేదలు ఆధారపడుతున్నందున వారికి చేరవల్సినసబ్సిడీ సొమ్ము దళారుల చేతికి చిక్కుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. సబ్సిడీ సొమ్మును పేదలకు నిరంతరం చేరగలిగేట్టు ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేస్తేనే నగదు బదిలీ పథకం విజయవంతం అవుతుంది. ఒకే రేటు జీఎస్టీ వల్ల పెద్దలకే ప్రయోజనమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలకు ఇలా...!



అసెంబ్లీ ఎన్నికల పర్వాన్ని పూర్తిచేసుకున్న తెలంగాణ ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సమాయత్తమైంది. ఈ ఎన్నికలను జనవరి 21వ తేదీ నుంచి మూడు విడతల్లో నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతలు, విధి విధానాల గురించి రిటర్నింగ్ అధికారిని తరచూ అడిగే ప్రశ్నల కోసం ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ మార్గదర్శకాలను విడుదల చేశారు.

గ్రామ పంచాయతీకి వార్డు సభ్యుడు లేదా సర్పంచ్‌గా పోటీచేయడానికి అభ్యర్థి వయసు 21 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలి. పంచాయతీరాజ్ చట్టం (2018)లోని సెక్షన్ 19 ఇది నిర్దేశిస్తోంది. నియమావళిలోని నియమం 7(2)(ఏ) ప్రకారం ఒక వ్యక్తి సర్పంచ్ లేదా వారు సభ్యునిగా పోటీ చేయడానికి సంబంధిత గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలో తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయి ఉండాలి.

వార్డు సభ్యునిగా ప్రతిపాదించే వ్యక్తి ఆ వార్డు ఓటరు లిస్టులో ఓటరుగా నమోదు అయి ఉండాలి. ఒక వ్యక్తి ఇద్దరు ఇద్దరు కంటే ఎక్కువమంది పిల్లలను కలిగి ఉంటే, ఆమె, అతడు పోటీచేయడానికి అనర్హుడు. ఒకవేళ ఆ వ్యక్తి 1995 కంటే ముందే ఇద్దరి కంటె ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉంటే ఆమె లేదా, అతడు పోటీ చేయడానికి అర్హుడు. 1.6.1995 నుండి లేదా ఆ తర్వాత ఒకరు లేదా అంతకంటె ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉంటే ఆ వ్యక్తి పోటీ చేయడానికి అనర్హుడు. 19.7.2006 హైకోర్టు తీర్పు ప్రకారం దత్తత ఇచ్చిన పిల్లలు స్వంత తల్లితండ్రుకు చెందిన పిల్లలుగానే పరిగణించబడతారు. ముగ్గురు పిల్లలు గల తల్లితండ్రులు ఒకరిని దత్తత ఇచ్చినా వారు కూడా అనర్హులుగా పరిగణించబడతారు. ఒకవ్యక్తి మొదటి భార్య ద్వారా ఇద్దరు పిల్లలను కలిగి భార్య చనిపోయిన తర్వాత రెండో భార్య ద్వారా ఇంకొక సంతానాన్ని పొందితే, అతడు ముగ్గురు సంతానాన్ని కలిగి ఉన్నందున పోటీ చేయడానికి అనర్హుడు.

నామినేషన్ పరిశీలన రోజు ఎంతమంది పిల్లలు ఉన్నారో లెక్కలోకి తీసుకుని అభ్యర్థి అర్హతను నిర్ణయిస్తారు. ఒక మహిళ నామినేషన్ పరిశీన రోజుకు ఇద్దరు పిల్లలను కలిగి ఉంటే ఆమె అర్హురాలు. ఒకవ్యక్తి నామినేషన్ పరిశీలన రోజుకు అతడి రాజీనామా ఆమోదించబడిన తర్వాత మాత్రమే అతని,లేదా ఆమె నామినేషన్ అంగీకరించబడుతుంది. సుప్రీంకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని రేషన్ దుకాణం యజమాని ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హుడే., అలాగే, అంగన్ వాడీవర్కర్లు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. పార్లమెంటు లేదా శాసనసభ చట్టాల ద్వారా ఏర్పాటు చేసిన సంస్థల ఆఫీసు బేరర్లు ఎన్నికల్లో పోటీచేయడానికి అనర్హులు.

పంచాయతీ రాజ్ ఎన్నికల్లో పోటీచేయడానికి సహకార సంఘాల సభ్యులు అర్హులు. సహకార సంఘాలు సహకార చట్టాల కింద నమోదు అవుతాయి కనుక, ఆ సంఘాల్లో సభ్యులు పోటీ చేయడానికి అర్హులే. మత సంస్థల చట్టం, దేవాదాయ శాఖ చట్టం ద్వారా ఏర్పాటైన సంస్థల సభ్యులు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. రోడ్డు రవాణా సంస్థ, సింగరేణి కాలరీస్ వంటి ప్రభుత్వ సంస్థల మేనేజర్లు, కార్యదర్శులు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు. సింగరేణిలో కార్యదర్శి, మేనేజింగ్ ఏజెంటు వంటి పోస్టుల్లో ఉన్నవారు తప్ప ఉద్యోగులు పోటీ చేయవచ్చు. ఒక అభ్యర్థి ప్రతిపాదకుడు అదే ప్రాదేశిక నియోజకవర్గం నుంచి పోటీ చేయవచ్చు. అభ్యర్థి ఇచ్చిన సమాచారం తప్పు అని రిటర్నింగ్ అధికారి భావిస్తే ఐపీసీ 195 ప్రకారం ఆ ప్రాంతానికి చెందిన కోర్టులో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అంతేకాని నామినేషన్‌ను తిరస్కరించరాదు. మతి స్థిమితం లేనట్టు నిర్ణీత అధికృత కోర్టు ఎవరైనా అభ్యర్థిని నిర్ధారిస్తే అతడు పోటీకి అనర్హుడు అవుతాడు. పోటీచేసే అభ్యర్థి సంబంధిత డాక్యుమెంట్లు లేకుండా చివరి తేదీ సాయంత్రం 5 గంటలకు వచ్చి నామినేషన్‌దాఖలు చేస్తే స్వీకరించవచ్చు. అయితే, చెక్‌లిస్ట్‌సంబంధిత డాక్యు మెంట్లు లేవని రాయాలి. నామినేషన్ల పరిశీలన సమయంలో ఆ నామినేషన్ తిరస్కరించాలా లేదా అనేది నిర్ణయించబడుతుంది. ప్రతిపాదకుని సంతకం విషయంలో రిటర్నింగ్ అధికారి తనంతట తానుగా సంతృప్తి చెందాల్సి ఉంటుంది. విచారణ తర్వాత ఆ సంతకం ఫోర్జరీ అని తేలిన పక్షంలో ఆ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించాల్సి ఉంటుంది. ఫోర్జరీదని తేలితే ప్రాసిక్యూట్ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలి. అలాంటి నామినేషన్ పరిశీలనను వాయిదా వేయవచ్చు. సంతకం ఫోర్జరీదని తేలితే నామినేషన్‌ను తిరస్కరించవచ్చు. చట్ట ప్రకారం ఒక వ్యక్తి గరిష్టంగా నాలుగు నామినేషన్లు వేయవచ్చు. ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు వేసి అన్ని నామినేషన్లు అంగీకరించబడి ఉంటే ఆ అభ్యర్థి పేరును ఒకసారి మాత్రమే నమోదు చేయాలి. రిటర్నింగ్ అధికారి చెల్లుబాటుకు నామినేషన్ల జాబితా నిర్ణీత నమూనాలో ప్రకటించేవరకూ నిర్ణయించాలి. నామినేషన్ సమర్పించేసమయంలో అభ్యర్థి, లేదా ప్రతిపాదకునితో పాటు ముగ్గురు వ్యక్తులను మాత్రమే అనుమతించాలి. అభ్యర్థి స్వయంగా నామినేషన్ సమర్పించలేని స్థితిలో అతడి ప్రతిపాదకుడు, మరో ఇద్దరు వ్యక్తులను రిటర్నింగ్ అధికారి గదిలోకి అనుమతించబడుతుంది. ఒకసారి నామినేషన్ సమర్పంచిన తర్వాత అభ్యర్థి తిరిగి దానిపై సంతకం చేయడానికి అనుమతించరాదు. నామినేషన్ ఉపసంహరణ నోటీసును అభ్యర్థి స్వయంగా ఇవ్వలేని పక్షంలో అతడి లేదా ఆమె ఏజెంట్ ద్వారా రిటర్నింగ్ అధికారికి సమర్పించవచ్చు. షెడ్యూల్డు కులాలు, తెగల అభ్యర్థులు వారికి కేటాయించబడిన సీట్లలో పోటీ చేస్తే ధరావత్తు సొమ్ములో రాయితీ పొందడానికి అర్హులు. ఒక అభ్యర్థి తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకునే నోటీసును రిటర్నింగ్ అధికారికి సమర్పించిన తర్వాత దానిని రద్దు చేయడానికి అనుమతించబడదు. నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరిస్తే రెవిన్యూ అధికారికి అప్పీలు చేయవచ్చు. అప్పిలేట్ అథారిటీకి దాఖలు చేయబడిన అట్టి అప్పీళ్ళను మరుసటి రోజున పరిష్కరించాలి. ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ వార్డుల్లో, ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఒకటి కంటే ఎక్కువ సార్లు తన ఓటు హక్కును వినియోగించుకోరాదు. ఒకవేళ అలా వినియోగించుకుంటే వారి ఓటు చెల్లదదగినవిగా పరిగణించబడవు. గ్రామ పంచాయతీతో పాటు పట్టణ, స్థానిక సంస్థల్లో కూడా ఒక వ్యక్తి పేరు నమోదు అయి ఉంటే అలాంటి వ్యక్తిని పోటీ చేయడానికి నిరాకరించేందుకు ఎటువంటి నిబంధనలేదు. ఒక వ్యక్తి దోషిగా నిర్ధారించబడి తే ఆరోజు నుంచి ఐదు సంవత్సరాల వరకూ స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడవుతాడు. అతడు దోషిగా నిర్ణయించబడిన నాటి నుంచి ఐదు సంవత్సరాల కాల వ్యవధి వరకూ స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీచేయడానికి అనర్హుడు. విచారణ అనంతరం కోర్టు దోషిగా నిర్ధారిస్తే ఎన్నికలలో పోటీ చేయడానికి అది అనర్హతగా పరిగణించబడుతుంది. ఆ వ్యక్తి బెయిల్ పై విడుదలైనంత మాత్రాన అనర్హత నుంచి బయటపడినట్టు కాదు.

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం)

గుణాత్మక మార్పుకు బీజం



జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నెలకొల్పి గుణాత్మక మార్పు సాధించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు మలివిడత ఫెడరల్ టూర్ విజయవంతమైంది. ఈ నెల 23న హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఆయన మూడు రాష్ట్రాల పర్యటనతో ఢిల్లీ చేరుకుని మూడు రోజులపాటు అక్కడే మకాం వేశారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, రాజకీయ ఉద్దండులు, వ్యూహకర్తలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సమావేశమైన కేసీఆర్ తన ఫెడరల్ భావజాలాన్ని జాతీయ స్థాయికి విస్తరింపజేయగలిగారు. మొదటిరోజు భువనేశ్వర్‌లో ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సమావేశమై తన ఆలోచనకు మద్దతు కూడగట్టుకున్నారు. 24న కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సమావేశమై ప్రత్యామ్నాయ రాజకీయ కూటమికి సిద్ధం చేశారు.

ఈనెల 25న ఢిల్లీ చేరుకుని ఫెడరల్ వ్యవస్థకు వ్యూహాన్ని రచించారు. అక్కడే బీఎస్పీ అధినేత్రి, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతితో సమావేశమై ఫెడరల్ వ్యవస్థకు బీజం వేశారు. అదే రాష్ట్రానికి చెందిన మరో మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్‌తోనూ కేసీఆర్ సమావేశమయ్యారు. మరికొందరు ముఖ్యనేతలు, ప్రాంతీయ పార్టీల అధినాయకులతో టెలిఫోన్‌లో చర్చలు జరిపి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. ఆరు రోజుల పర్యటన ముగించుకుని కేసీఆర్ శుక్రవారం తిరిగి రాష్ట్రానికి చేరుకున్నారు. గడిచిన ఏప్రిల్ నెలలో తొలివిడత పర్యటనతో సరికొత్త ఆలోచనను రేకెత్తించిన తర్వాత ప్రస్తుతం రెండో పర్యటనతో కొంతమంది ప్రాంతీయ పార్టీల నేతలను ఏకతాటిపైకి తీసుకురాగలిగారు.

తొలివిడత పర్యటనతోనే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన బెంగళూరులో మాజీ ప్రధాని దేవెగౌడ, కర్నాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామిని కలిశారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ అవసరాలు, రాజకీయ మార్పులు, ప్రజల ఆకాంక్షపై సమాలోచనలు జరిపారు. కాంగ్రెస్, భాజపా జాతీయ పార్టీల విధానాలకు భిన్నంగా, జాతి నిర్మాణానికి అనుసరించాల్సిన విధానాలు, దేశవ్యాప్త వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సాధించే ఆర్థిక పురోగతి, తద్వారా వ్యవసాయ రంగం, రైతు సంక్షేమం, గ్రామీణ సంపద సృష్టించే అంశాలపై లోతుగా చర్చించారు. ఇప్పటికే జాతీయ మీడియా ద్వారా థర్డ్‌ఫ్రంట్ ఆవశ్యకతను వివరించి దేశాన్ని ఆలోచింపజేసిన కేసీఆర్ తన లక్ష్యాన్ని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకువెళ్ళేందుకు పట్టుదలతో ముందుకు సాగుతున్నారు.

రాజకీయ వ్యూహంపై భారీ కసరత్తు

2019లో అనుసరించాల్సిన జాతీయ రాజకీయ వ్యూహంపై ఆయన భారీ స్థాయిలో కసరత్తు మొదలుపెట్టనున్నారు. దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావాలన్న సంకల్పాన్ని ఏ మేరకు ప్రజల మద్దతు ఉంటుందనే అంశంపై ఆయన అంతర్గత సర్వేలు నిర్వహిస్తున్నారు. ముందుగా రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటారు. ఆ తర్వాత ఉద్యోగ సంఘాలు, రైతు సంఘాలు, విభజన సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, ప్రత్యామ్నాయ రాజకీయ వేదికలకు నేతృత్వం వహిస్తున్న రాజకీయవేత్తలతో వరుసగా సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

ఢిల్లీ వేదికగా ఫెడరల్ కార్యాలయం

ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే వచ్చే ఏడాది మరోసారి ఢిల్లీలో మకాంవేసి వివిధ జాతీయ పార్టీల అధినేతలు, మాజీ మంత్రులు, తలపండిన రాజకీయవేత్తలతో సమాలోచనలు జరపాలనుకుంటున్నారు. ఆ సమయంలోనే దేశ రాజధాని వేదికగా ఫెడరల్ జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించాలనుకుంటున్నారు. వ్యవస్థీకృత మార్పులతో భారత రాజ్యాంగాన్ని ప్రక్షాళన చేసి నవభారత నిర్మాణాన్ని ఆవిష్కరించేందుకు పదవీ విరమణ పొందిన న్యాయమూర్తుల, సైనికాధిపతులు, వాయు, వైమానిక దళంలో అత్యున్నత స్థాయిలో పనిచేసిన వారిని సంప్రదించి తనకున్న సరికొత్త ముందుచూపు ఆలోచనను పంచుకుంటారు.

వ్యవసాయ రంగంలో మార్పు దిశగా..

దేశజనాభాలో అత్యధికులు రైతు సామాజికవర్గానికి చెందిన వారు ఉండడంతో ఏ విధమైన మార్పులు చేస్తే వ్యవసాయ రంగం లాభాల బాటన పయనిస్తుందనే అంశంపై అన్ని రాష్ట్రాల నుంచి రైతు సంఘాల ప్రతినిధులను పిలిపించి సమీక్షిస్తారు. అదే సమయంలో మీడియా సంస్థలు, ప్రముఖ జర్నలిస్టులు, పారిశ్రామికవేత్తలు, కార్మికసంఘాల ప్రతినిధులతోనూ సమాలోచనలు జరిపి బలమైన వేదికకు పునాదులు వేస్తారు.

త్వరలో దేశవ్యాప్తంగా సభలు, సమాలోచనలు

ఈ సమావేశాలు దేశంలోని ప్రధాన నగరాలన్నింటిలోనూ నిర్వహించి రాజధాని ఢిల్లీలో మూడో కూటమికి మద్దతు ఇస్తున్న వారందరినీ కలుపుకుని భారీ బహిరంగ సభను నిర్వహించి సత్తాను చాటాలని సీఎం కేసీఆర్ వ్యూహాన్ని రచిస్తున్నారు. హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు తదితర మెట్రో పాలిటన్ నగరాల్లోనూ మూడో కూటమి బహిరంగ సభలు నిర్వహించి దేశాన్ని సమాయత్తపరుస్తారు.

మేధావి వర్గాలను ఏకతాటిపైకి...

దేశవ్యాప్తంగా ఉన్న మేధావి వర్గాలను సంప్రదించడానికి, వారందరినీ సమన్వయపరచడానికి ఒక్కో ప్రముఖ వ్యక్తితో స్వయంగా ఆయనే మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. దేశం బాగుపడాలని, దేశ ప్రజలు సుఖశాంతులతో ఉండాలన్న ఆలోచనకు తనకున్న ముందుచూపు, వ్యవస్థ ప్రక్షాళన ఆవశ్యకతను వారికి వివరించి సిద్ధం చేస్తారు. అనంతరం వేలాది మంది సమన్వయంతో ఢిల్లీలో థర్డ్‌ఫ్రంట్ కార్యాలయాన్ని ప్రారంభించి జెండా, అజెండాను ప్రకటిస్తారు.

-రాజేష్ జైన్

పలికెడిది గడ్కరీ.. పలికించెడిది.. ఆరెస్సెస్!!



కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ అడుగులు ఎటువైపు? వ్యూహం ఏమిటి? ఇదీ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ముఖ్యంగా బీజేపీ శ్రేణుల్లో నడుస్తున్న చర్చ. ఇటీవల వేర్వేరు సందర్భాల్లో గడ్కరీ చేసిన నర్మగర్భ వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. నితిన్ ఉద్దేశం ఏమైవుంటుంది? దీనికి వెనుకా.. ముందు పరిణామాలేంటి? అనే కోణంలో విశ్లేషించేందుకు రాజకీయ పండితులు కుస్తీపడుతున్నారు. డిసెంబర్ 23న పుణె వేదికగా జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటములు, పరాజయాలను సొంతం చేసుకునే ధోరణి నాయకత్వానికి ఉండాలి. ఓటమికి బాధ్యత వహించాల్సిన సమయం వస్తే తప్ప, ఆర్గనైజేషన్ పట్ల సదరు నాయకుడి నిబద్ధత ఏపాటిదో తెలిసిరాదు. విజయానికి తండ్రులు చాలామందే ఉంటారు. కానీ, పరాజయం ఎప్పుడూ అనాథే. ఓటమైనా, గెలుపైనా రెండింటినీ సమానంగా స్వీకరించాలి.. బాధ్యతగా తీసుకోవాలి అంటూ పరోక్షంగా హైకమాండ్‌పైకి మాటల తూటాలను సంధించారు. మరొక సందర్భంలో ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో ఇంటెలిజెన్స్ బ్యూరో ఎన్‌ఫోర్స్‌మెంట్ సమావేశంలోనూ మళ్లీ ఇదేవిధమైన కామెంట్ చేశారు. మధ్యభారతంలోని మూడు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన రెండు వారాల్లోపు ఇలాంటి విమర్శలు మోడీ-షా జోడీకి ఇబ్బంది కలిగించేదే. దీనికంటే ముందు విజయ్ మాల్యా అంశాన్ని ప్రస్తావిస్తూ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ప్రభుత్వం అతడిని దొంగగా పేర్కొనడాన్ని తప్పుబట్టారు. 40 ఏళ్లుగా ఒక వ్యక్తి క్రమం తప్పకుండా చెల్లింపులు చేశాడు. వడ్డీలు చెల్లించాడు.. 40 ఏళ్ల తర్వాత విమానరంగంలోకి వెళ్లాడు. పరిస్థితి ఉల్టా అయింది. కష్టాల్లో కూరుకుపోయాడు. ఒక దఫా రుణం చెల్లించలేకపోయాడు. అంతమాత్రాన అతను అమాంతం దొంగై పోతాడా? ఇలాంటి ఆలోచనా ధోరణి సరైనది కాదంటూ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పేశాడు. పార్టీలో అన్ని అధికార తంతులను తమ చేతుల్లోకి తీసుకున్నామని ప్రధానమంత్రి మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా భావిస్తూ వచ్చారు. కానీ, గడ్కరీ కామెంట్లు చూశాక, తమ అంచనా తప్పని తెలుసుకుని ఉంటారు. నేరుగా ఎదురుదాడి చేస్తున్న వైనం మింగుడు పడకుండొచ్చు. మొత్తంగా ఈ వ్యవహారాన్ని బీజేపీ మౌనంగా దాటవేస్తుంటే, మరొకవైపు ప్రతిపక్షాలు ఒకింత ఆసక్తిగా, మరింత నిశితంగా గమనిస్తున్నాయి.

ఓటమికి బాధ్యత వహించరా?

హైకమాండ్‌ను ధిక్కరించడం లేదా ఎదిరించడం గత కొన్నేళ్లలో బీజేపీలో అరుదైన పరిణామం. బీజేపీలో ఏ నాయకుడు లేదా ప్రజాప్రతినిధి ఇలాంటి సాహసం చేయలేదు. విస్తృత అంతర్గత ప్రజాస్వామ్య సంస్కృతి కలిగిన పార్టీలో, మోడీ-షా ద్వయం తన బృందం నుంచి విమర్శలు ఎదుర్కొన్న సందర్భాలు ఒకటీ.. అరా మాత్రమే. తన వ్యాఖ్యలను ఓ వర్గం మీడియా ఉద్దేశపూర్వకంగానే వక్రీకరించిందంటూ వివరణ ఇచ్చే ప్రయత్నం గడ్కరీ చేశారు. హైకమాండ్‌కు తనకు మధ్య అంతరాన్ని పెంచేందుకే ఈ విధంగా వ్యవహరించిందని వివరణ ఇచ్చుకున్నారు. సరిగ్గా రెండు రోజుల తర్వాత మళ్లీ అవే వ్యాఖ్యలు చేశారు. ముక్కుసూటిగా మాట్లాడారు. నేనే గనుక పార్టీ అధ్యక్షుడినైతే, నా ఎంపీలు, ఎమ్మెల్యేలు సరిగా పనిచేయకుంటే, ఎవరు బాధ్యత వహించాలి? నేనే కదా.. అంటూ నేరుగా షా వైపు శరం ఎక్కుపెట్టారు. వారం రోజుల వ్యవధిలో నాయకత్వంపై రెండోసారి అతను చేసిన కామెంట్స్ కొంత చర్చకు తావిచ్చాయి. గత నాలుగేళ్ల కాలంలో బీజేపీ సాధించిన ఎన్నికల విజయాలు మోడీ నాయకత్వం, అమిత్‌షా వ్యూహాల ఘనతగానే పరిగణింపబడింది. దీన్ని ఇరువురు నాయకులు సంతోషంగా ఆస్వాదించారు. బీజేపీ గెలిచిన సందర్భాల్లో ఎప్పుడూ కూడా అమిత్‌షా మీడియా సమావేశానికి ముఖం చాటేయలేదు. కానీ డిసెంబర్ 11న మాత్రం మీడియాకు కనిపించకుండా, వినిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లారు. మూడు రోజులు మీడియా కంటపడలేదు. ఎప్పుడైతే రాఫెల్ డీల్ పిటిషన్‌పై సుప్రీం ప్రభుత్వానికి అనుకూల తీర్పు ఇచ్చిందో, అప్పుడు ఆయన మీడియా ముందుకు వచ్చారు.

దాడికిదే సమయం..

ఒకప్పుడు బీజేపీ అన్నివైపుల సమతూకంగా ఉండేది. పార్టీలోని అనేకులు సమాన ప్రాధాన్యత కలిగివుండేవారు. కాంగ్రెస్ సంస్కృతికి భిన్నంగా ఉండే అంశాల్లో ఇదొకటి. 50 ఏళ్లుగా దేశ రాజకీయాలను శాసించిన కాంగ్రెస్‌లో గాంధీ కుటుంబం మాటే శాసనం. బీజేపీలో ఈ పరిస్థితి ఉండేది కాదు. అందరికీ భావస్వేచ్ఛ ఉండేది. నేతల మధ్య పరస్పర ఆలోచనల బదలాయింపు జరిగేది. కానీ, మోడీ-షా శకం మొదలయ్యాక కాషాయపార్టీ మూల సిద్ధాంతంలో మార్పులొచ్చాయి. సీనియర్లకు ప్రాధాన్యం తగ్గింది. వారిలో చాలామంది మార్గదర్శక్ మండల్‌కే పరిమితం అయ్యారు. ఒక్కమాటలో చెప్పాలంటే పార్టీలో సీనియర్లది వృద్ధాశ్రమంలో ఉన్న అనుభూతి. మోడీ-షా అభిప్రాయాలే చెల్లుబాటవుతున్నాయి.. వాళ్లిద్దరే పార్టీ అంశాలను పరస్పరం చర్చించుకుంటారు. మిగతా వాళ్లతో పనివుండదు. ఇది ఒకరకంగా భిన్న అభిప్రాయాలకు, ఆలోచనలకు చెక్ పెట్టడం వంటిదే. బీజేపీ మాజీ అధ్యక్షుడిగా మోడీకి ఏమాత్రం తగ్గని స్థాయి గడ్కరీది. మరి అలాంటప్పుడు పిల్లి మెడలో గంట కట్టాల్సి వస్తే గడ్కరీకంటే సమర్థులెవరున్నారు? అన్న సమాధానమే వినిపిస్తోంది. ఒకసారి బీజేపీ జాతీయ కార్యవర్గం నుంచి బయటకు పంపించాలని మోడీ భావించినప్పుడు, ప్రధానికి బద్ధవిరోధి అయిన సంజయ్ జోషి తనకు మద్దతుగా నిలిచాడని ఒకానొక సందర్భంలో గడ్కరీ గుర్తుచేసుకున్నారు. 2014 నుంచి వారిద్దరు ఒకరికొకరు ఎదురొడ్డి నిలుస్తూనే వచ్చారు. సెప్టెంబర్‌లో చికాగోలో నిర్వహించిన ప్రపంచ హిందూ సభకు వెళ్లాలని గడ్కరీ నిర్ణయించుకున్నారు. అయితే, ఇందుకు ప్రధానమంత్రి ఆక్షేపించారని, పర్యటనను రద్దు చేసుకునేలా ఒత్తిడి తీసుకొచ్చారన్న అప్పట్లో ప్రచారం జరిగింది. సరిగ్గా నెలరోజుల తర్వాత, ఓ టీవీ ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలకు తెరలేపారు. అమలు సాధ్యం కాదని తెలిసినా, అధికారంలోకి రావడం కోసం పెద్దపెద్ద హామీలు ఇచ్చారంటూ నేరుగా మోడీని టార్గెట్ చేసిన సంగతి తెలిసిందే.

సంఘ్ గొంతుక ఏమంటోంది? హైకమాండ్‌పై గడ్కరీ ఎదురు దాడి వెనుక సంఘ్ పరివార్ ఉందన్న ప్రచారం ఎంతమాత్రం ఆశ్చర్యం కలిగించదు. ఎందుకంటే ఆరెస్సెస్ పట్ల అతనికున్న విధేయత, ఆయన పట్ల ఆరెస్సెస్‌కున్న విశ్వాసం అలాంటిది. గడ్కరీ వ్యాఖ్యలను సంఘ్ నేతలు కానీ, క్రియాశీల కార్యకర్తలు గానీ తప్పుబట్టడం లేదు. పైపెచ్చు నిజమే కదా.. నాయకుడు అనేవాడు గెలుపు మాదిరిగానే, ఓటమికీ బాధ్యత తీసుకోవాలి అని ప్రశ్నిస్తున్నారు. మూడు రాష్ట్రాల ఓటమితో బీజేపీ కేడర్ నిస్తేజానికి లోనైందని సదరు నేత చెప్పారు. ఇతర నాయకులకు నిర్ణయాధికారం ఇచ్చేందుకు ఇదే సరైన సమయం. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలని సంఘ్ ఎప్పుడూ కోరుకుంటుంది. సీనియర్ల నుంచి సహాయం, సలహాలు తీసుకునేందుకు నాయకత్వం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

అసహన సెగలు.. ఒక్క ఓటమి వంద తప్పులను ఎత్తిచూపుతోంది. ఢిల్లీ రాజకీయ దర్బార్‌లో మరోసారి పాత అంశమే కొత్త చర్చకు దారితీసేలా చేసింది. 2019 ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ మార్కును చేరుకోలేకుంటే బీజేపీ పరిస్థితి ఏమిటి? ఆరెస్సెస్ ఇంటి పత్రిక ఆర్గనైజర్ అంచనా వేసినట్లు ఒకవేళ హంగే వస్తే? ఈసారి ఎన్నికల్లో 50-100 సీట్లు తక్కువ వచ్చే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే, మోడీ స్థానంలో ప్రధాని అభ్యర్థిగా గడ్కరీ ముందుకు రావడం ఖాయం. ఎన్డీయేలోని మిగతా పార్టీలన్నిటికీ ఇతను ఆమోదయోగ్యుడు. మోడీ- షా పట్ల మిత్రపక్షాల్లో ఆగ్రహం గూడుకట్టుకుని ఉంది. హంగ్ సందర్భంలో తమకు నచ్చిన వ్యక్తినే ప్రధానిగా ఉంచాలని వీళ్లంతా బీజేపీని, సంఘ్‌ని ఒత్తిడిచేసే అవకాశం ఉంది. తమచుట్టూ మోడీ-షా నిర్మించుకున్న అద్దాల మేడపైకి గడ్కరీ మాత్రమే ఇప్పుడు గులకరాయి విసిరాడు. రాన్రాను మరికొంతమంది తమ చేతుల్లోని రాళ్లను అటువైపు విసిరినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని రాజకీయ పండితులు, భాజపా ముఖ్యులు కొందరు బాహాటంగా చెబుతుండటం కొసమెరుపు.

-పూనాటి

ప్రయాగ్‌రాజ్‌కు కేంద్రం ఆమోదం



న్యూఢిల్లీ: అలహాబాద్ పేరును ప్రయాగ్ రాజ్‌గా మారుస్తూ ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రం ఆమోదించింది. మకర సంక్రాంతి వేళ ఈనెల 15 నుంచి ప్రయాగ్ రాజ్‌లో కుంభమేళ జరగనుంది. ఇటీవల ఫైజాబాద్ జిల్లా పేరును అయోధ్యగా మార్చిగా.. పశ్చిమ బెంగాల్ పేరును బంగ్లాగా ఆ రాష్ట్ర ప్రభుత్వం మారుస్తూ తీసుకున్న నిర్ణయానికి ఇంకా కేంద్రం ఆమోద ముద్రపడలేదు.గత ఏడాది కాలంలో 25 నగరాలు, గ్రామాల పేర్లను మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆయా ప్రాంతాల చారిత్రక అంశాలు, ప్రాధాన్యతలను బట్టి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన తర్వాతే పేర్లు మార్చినట్లు కేంద్ర హోంశాఖ తెలియజేసింది. దేశంలోని ఏ ప్రాంతం పేరునైనా మార్చే ముందే ఆ ప్రతిపాదనలపై ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు లేకుంటేనే మార్పు జరుగుతుంది. పేర్ల మార్పుపై అభ్యంతరాల కోసం కేంద్ర హోంశాఖ 10 రోజుల గడువును కూడా ఇస్తోంది.

కిక్కిచ్చిన కొత్త ఏడాది

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కిన మందుబాబులు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు అంబరాన్నంటేలా జరుగుతున్నాయి. ఈ సమయంలో కొంతమంది మందుబాబులు చిందూ అనంతరం ఇళ్లకు చేరే వేళ డ్రంక్ డ్రైవ్‌లతో పోలీసులకు దొరికిపోయారు. వారికెక్కిన ఆ కిక్కు ఇట్టే దించేశారు పోలీసులు. దేశ రాజధానిలో మందుబాబులపై కేసులు నమోదు చేశారు. సుమారు 15,000 మంది పోలీసులు న్యూ ఇయర్ వేడుకలకు పటిష్ఠమైన భద్రత దృష్ట్యా విధులకు హాజరయ్యారు. న్యూ ఇయర్ వేడుకల్లో ఎక్కడా అపశృతి చోటుచేసుకోకుండా జాగ్రత్తపడ్డారు. జనాలు పార్టీ హబ్స్ నుంచి సురక్షితంగా ఇల్లు చేరేలా ప్లాన్ చేశారు. చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి, రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్యలో డ్రంక్ డ్రైవ్ నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ ముందు దొరికిపోయిన 1,205 మంది మందుబాబులపై కేసులు నమోదు చేశారు. వారిలో ఎక్కువగా యువకులే ఉండడం గమనార్హం.ఇక ముంబైలోనూ మందుబాబులకు చెక్ పెట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లే చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 509 మంది ముందుబాబులు పోలీసులకు చిక్కారు. ఇప్పటికే ముంబైలో ట్రాఫిక్ నియమాలు కఠినంగా అమలుచేస్తున్న విషయం విదితమే. అంతేకాకుండా, దేశంలోని మెట్రో నగరాల్లో ఈ వేడుకల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చర్యలు చేపట్టారు.

మళ్లీ పారికర్ విధుల్లోకి


నాలుగు నెలల తర్వాత సచివాలయానికి



పనాజీ: గోవా ముఖ్యమంత్రి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. అయితే, నాలుగు నెలల తర్వాత మంగళవారంనాడు సచివాలయానికి తొలిసారిగా పారికర్ వచ్చారు. ఈ సందర్భంగా సెక్రటేరియట్ అధికారులు, కేబినెట్ మంత్రులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అయితే, సీఎం పారికర్ సచివాలయానికి వస్తున్నారని తెలియగానే వందల సంఖ్యలో భాజపా శ్రేణులు అక్కడకు వచ్చారు. సెక్రటేరియట్ చేరుకున్న పారికర్‌కు గోవా అసెంబ్లీ స్పీకర్ ప్రమోద్ సవంత్, మంత్రులు, బీజేపీ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అనంతరం తన చాంబర్‌కు చేరుకున్న పారికర్, అధికారులు, మంత్రులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పారికర్ సచివాలయానికి ముక్కుకు ట్యూబ్‌తోనే వచ్చారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై

హెచ్‌ఆర్‌డీకి నోటీసు



ఢిల్లీ: 2013-17 మధ్య కాలంలో 49 మంది జవహర్ నవోదయ విద్యాలయాల(జేఎన్‌వీ) విద్యార్థులు ఆత్మహత్య చేసుకొన్నట్లు ఓ నివేదిక తెలపడంతో స్పందించిన జాతీయ మానవ హక్కుల సంస్థ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మంగళవారం కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖకు నోటీసు జారీ చేసింది. ఆత్మహత్యల విషయంలో ఆరు వారాల్లోగా వివరణ ఇవ్వాలని కోరింది. 2013-17 మధ్య కాలంలో ఆత్మహత్య చేసుకున్న 49మందిలో సగంమందికి పైగా దళిత, గిరిజన విద్యార్థులు ఉన్నారని, వీరిలో ఎక్కువగా అబ్బాయిలు ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఏడుగురు తప్ప మిగిలిన వారందరూ ఫ్యానుకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయంపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఎన్‌హెచ్ ఆర్‌సీ క్యాంపస్‌లలో శిక్షణ పొందిన కౌన్సిలర్లు అందు బాటులో ఉన్నారా లేదా అనే సమాచారాన్ని కోరింది. శిక్షణ పొందిన కౌన్సిలర్లు అందుబాటులో ఉంటే విద్యార్థులు చదువు పరంగా లేదా వ్యక్తిగతంగా డిప్రెషన్‌కి గురి అవడమో జరిగితే వారికి ఖచ్చితమైన సమయంలో తగిన సూచనలు, సలహాలు ఇచ్చి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా నిలువరించవచ్చని ఎన్‌హెచ్‌ఆర్‌సీ తెలిపింది.

మహా కూటమి వైఫల్యం

2018లో ఉజ్వల ప్రగతి... 2019లో మళ్లీ మేమే...



(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. దేవీలాల్ నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక సార్లు రైతు రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించినా నిజమైన రైతు బాగుపడిన దాఖలాలు లేవని మోడీ వ్యాఖ్యానించారు. రైతులకు ఎలా మేలు చేయాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వ పనిచేస్తుందన్న మోడీ..లోపం ఎక్కడుందో పరిశీలించి.. విత్తనం నుంచి మార్కెట్ వరకు సంస్కరణలు చేపట్టామన్నారు. కృషి సించాయ్ యోజన ద్వారా రైతులకు మేలు జరిగిందని.. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా రైతుల ఉత్పత్తులకు మంచి ధరలు వస్తున్నాయన్నారు.

నాపై ద్వేషంతోనే మహాకూటమి

తనపై ద్వేషంతోనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మహాకూటమికి బీజం వేశారని ప్రధాని మోడీ ఆరోపించారు. బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి మహాకూటమిగా ఏర్పడటంపై మోడీ స్పందిస్తూ..మోడీని గద్దెదింపడమే లక్ష్యంగా మహాకూటమి ఏర్పాటైందన్నారు. మంగళవారం ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని అనేక అంశాలపై స్పందించారు. అసలు మహా కూటమి అన్న మాటకు అర్థమే లేదన్నమోడీ..ఇలాంటి రాజకీయాలను జనం తిప్పికొడారని రుజువైందన్నారు. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన వాళ్లంతా తాము మహాకూటమిలో ఉన్నామంటున్నారని..మహాకూటమిలోని పార్టీలని కాంగ్రెస్ పార్టీయే మింగేస్తుందని చురకలంటించారు. ఒక వ్యక్తి లక్ష్యంగా పార్టీలన్నీ ఏకం కావడాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ఇలాంటి రాజకీయాలను జనం తిప్పికొడతారని చెప్పుకొచ్చారు.

నోట్ల రద్దు మేలు ముమ్ముందు తెలుస్తుంది..

పాతపెద్దనోట్ల రద్దు ఫలితాలు ముమ్ముందు తెలుస్తాయని ప్రధాని మోడీ తెలిపారు. నోట్ల రద్దు అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదన్న మోడీ.. నోట్ల రద్దు నవంబర్ 8, 2016 న ప్రకటించినప్పటికీ.. అంతకు ముందు ఏడాది కాలంగా ఆ అంశంపై చర్చలు జరిపినట్లు వివరించారు. నల్లధనం ఉన్నవారందరినీ అంతకు ముందు ఏడాది నుంచి హెచ్చరించామన్న మోడీ.. నోట్ల రద్దుకు ముందే నల్లధనానికి పన్ను చెల్లించి ఉపశమనం పొందామని చెప్పామన్నారు. చాలామంది మోడీ కూడా ఇతర ప్రధానుల వలె మాటలు చెబుతారని అనుకున్నారని..నోట్ల రద్దు ప్రకటన చేసే సరికే ఒక్కసారిగా అంతా షాక్‌కు గురయ్యారని చెప్పుకొచ్చారు.

తెలంగాణలో కూటమికి తొలిదెబ్బ

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు ఘోర పరాజయాన్ని చవిచూశారని ప్రధాని మోడీ విమర్శించారు. తెలంగాణలోని మహాకూటమికి తొలిదెబ్బ తగిలిందన్న మోడీ.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో కూటమి సత్తా లేలిపోయిందని వ్యాఖ్యానించారు. తెలంగాణపై ద్వేషంతోనే చంద్రబాబు రాజకీయాలు చేయాలనుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్య పక్షాలను గుర్తించదని తెలిసినా బాబు ఆ పార్టీతో చేతులు కలపడాన్ని ప్రజలు సహించలేకపోయారన్నారు. సిద్ధాంతాలను పక్కనబెట్టి చంద్రబాబు కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపడంతోనే మహాకూటమికి తొలిదెబ్బ తగిలిందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ బలంగానే ఉందన్న మోడీ.. సిద్ధాంతాలతో కలిసొచ్చే పార్టీలతో ఎన్నికలకు వెళ్తామన్నారు.తెలంగాణ సీఎం కేసీఆర్ కొత్త కూటమి ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారన్న విషయం తన దృష్టికి రాలేదని ప్రధాని మోడీ అన్నారు. ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు గురించి తనకు తెలియదన్నారు.

కాశ్మీర్,అసోం, త్రిపురలో పట్టిన గతే పడుతుంది..

అసోం, త్రిపుర, కాశ్మీర్‌లలో మహాకూటమికి ఘోర పరాభవం ఎదురైనట్లే తెలంగాణలోనూ మహాకూటమిని ప్రజలు చిత్తుగా ఓడించారని ప్రధాని మోడీ విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు ప్రజలు వర్సెస్ మహాకూటమి మధ్య జరగబోతున్నాయి. దేశ ప్రజలు బీజేపీతోనే ఉన్నారు. తెలంగాణలో మహాకూటమి సంగతి ఏమైంది? అసలు మహాకూటమిపై చర్చించాల్సిన అవసరమే లేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల విషయానికొస్తే, తెలంగాణ, మిజోరంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్న అంచనాలు ఎవరికీ లేవు. 15 ఏళ్లు అధికారంలో ఉన్న తర్వాత అలాంటి ఓటములు సహజమే ఛత్తీస్‌గఢ్‌లో ఘోరపరాజయమే, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో వచ్చింది హంగ్ అసెంబ్లీ. కాబట్టి, మూడు రాష్ట్రాల్లో ఓడినంత మాత్రాన మా ఆత్మవిశ్వాసం ఏమీ దెబ్బతినదు.అసోం, త్రిపుర, హర్యానాలో చారిత్రక విజయాలు సాధించాం. దేశంలో మహాద్భుత విషయాలు చాలా జరుగుతున్నాయి.. వాటి ముందు ఎన్నికలు చాలా చిన్నవిషయం. సార్వత్రిక ఎన్నికలను అమెరికా తరహా పోరాటంగా భావించొచ్చా? మోడీ వర్సెస్ రాహుల్‌గా పేర్కొనవచ్చా? అన్న ప్రశ్నకు బదులిస్తూ, ప్రజల ఆకాంక్షల అంశమే ప్రధానం. వారి ఆశలను నెరవేర్చిన పార్టీకి, 70 ఏళ్లుగా ఆకాంక్షలను అణచిపెట్టిన పార్టీకి మధ్య ఎన్నికలుగా భావిస్తున్నానని చెప్పారు.

జీఎస్టీతో సామాన్యులకు మేలు

దేశంలోని అన్ని రాష్ట్రాలను సంప్రదించిన తర్వాత జీఎస్టీని అమలు చేశామని ప్రధాని మోడీ తెలిపారు.పారదర్శక విధానాలను పెంపొందించేందుకు జీఎస్టీని అమలు చేశారమని.. నూతన పన్ను విధానం వల్ల సామాన్యులకు పన్ను భారం తగ్గించగలిగామన్నారు. చిన్న వ్యాపారులకు కొంత ఇబ్బంది కలిగినా.. పన్నుల చెల్లింపులో సరళమైన విధనాలు అమలులోకి రావడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. పన్నుల విధానాన్ని అన్ని రాష్ట్రాల సభ్యులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయిస్తుందని.. ప్రజలపై భారం తగ్గించేందుకు ఎప్పటికప్పుడు జీఎస్టీ స్లాబుల్లో మార్పులు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు మేలు చేయాలన్నసంకల్పంతోనే జీఎస్టీలో మార్పులు.. చేర్పులు చేస్తున్నామన్నారు. సామాన్యుడి సంక్షేమమే తమ ప్రభుత్వానికి ముఖ్యమని మోడీ చెప్పుకొచ్చారు.

వ్యక్తిగత కారణాలతోనే ఊర్జిత్ నిష్క్రమణ

ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేశారని చెప్పారు. గత ఆరేడు నెలలుగా ఆయన తనను రిలీవ్ చేయాలని కోరుతున్నారని, చివరికి లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేసుకున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఊర్జిత్ రాజీనామా వ్యవహారంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన తన విధులను సమర్థంగా నిర్వహించారని ప్రశంసించారు.


ట్రిపుల్ తలాక్‌పై నిషేధం ఎందుకంటే..

సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ట్రిపుల్ తలాక్ ఆర్డినెన్స్‌ను తమ ప్రభుత్వం తీసుకువచ్చిందని, రాజ్యాంగ పరిధిలో ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని బీజేపీ మేనిఫెస్టోలో పొందుపరిచామని ప్రధాని పేర్కొన్నారు. ట్రిపుల్ తలాక్‌ను పెద్దసంఖ్యలో ముస్లిం దేశాలు నిషేధించాయని చెప్పారు. పాకిస్తాన్‌లో సైతం ట్రిపుల్ తలాక్‌ను నిషేధించారన్నారు. ఇది ఎలాంటి మతానికి, విశ్వాసానికి సంబంధించిన అంశం కాదని, కేవలం లింగ సమానత్వం, సామాజిక న్యాయంతో ముడిపడిన వ్యవహారమని చెప్పారు.ముస్లింలపై దేశంలో ఎలాంటి విద్వేషం లేదు. ట్రిపుల్ తలాఖ్ అనేది ఇస్లాంలో ఎక్కడా లేదు. కేవలం మన దేశంలోనే ఉంది. సామాజిక న్యాయం కోస మ ట్రిపుల్ తలాఖ్ నిషేధ చట్టం తెచ్చాం. అందరికీ తోడుగా, అందరికీ వికాసం నినా దంతో బీజేపీ ముందుకు వెళ్తున్నది. ఎవరిలో అయినా అభద్రతాభావం ఉంటే, తొలగించాల్సిన బాధ్యత అందరిది. పార్టీ అధికారంలో ఉంటే ఒక వర్గం ఇబ్బంది పడుతుందని ప్రచారం చేయడం సరికాదు. గొప్ప పనులు చేస్తున్నప్పుడు విమర్శలు, ఎదురు దెబ్బలు సహజమని అభిప్రాయపడ్డారు.

శబరిమలపై విస్తృత చర్చ..

దేశంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలన్నది భారత్ అభిమతం..దేశంలో కొన్ని దేవాలయాలకు ప్రత్యేక సంప్రదాయాలున్నా యని శబరిమల ఉదంతాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని పేర్కొన్నారు. కొన్ని ఆలయాల్లో పురుషులకు ప్రవేశం లేదని గుర్తుచేశారు. శబరిమల విషయంలో సుప్రీం కోర్టులో మహిళా న్యాయమూర్తి కొన్ని వ్యాఖ్యలు చేశారని చెబుతూ, ఆయా అభిప్రాయాలను వ్యక్తం చేసే వారికి రాజకీయ కోణాలతో ముడిపెట్టరాదన్నారు. ఓ మహిళగా ఆమె చేసిన సూచనలపైనా చర్చ జరగాలన్నారు.

న్యాయప్రక్రియ తర్వాతే ఆర్డినెన్స్..



సుప్రీం కోర్టులో కాంగ్రెస్ న్యాయవాదులు ప్రతిబంధకాలు సృష్టిస్తున్నారు. అందువల్లే అయోధ్య రామమందిరం న్యాయప్రక్రియ నత్తనడక నడుస్తోంది. న్యాయప్రక్రియ పూర్తయ్యాకే, ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తాం. అయోధ్య సమస్యను రాజ్యాంగ బద్ధంగానే పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో బీజేపీ చెప్పింది. మందిరం నిర్మాణం ప్రధాన హామీల్లో ఒకటి. న్యాయప్రక్రియ తుదిదశకు చేరింది. జనవరి 4న సుప్రీం మరోసారి విచారించనుంది. ట్రిపుల్ తలాఖ్ విషయంలోనూ ఆర్డినెన్స్‌ను ముందుగా ఏమీ తీసుకురాలేదు. సుప్రీం తీర్పు తర్వాతే ముందడుగు వేశాం. తొలుత ఆర్డినెన్స్ చేశాం, తర్వాత పార్లమెంటు ముందుకు బిల్లు తీసుకొచ్చాం. ఇప్పటికీ కాంగ్రెస్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం. సుప్రీంలో అయోధ్య అంశాన్ని అడ్డుకోవద్దు.

ప్రజలు వర్సెస్ మహాకూటమి



వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రజలకు, బేజేపీ వ్యతిరేకులకు మధ్య జరిగే పోరాటంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివర్ణించారు. దేశాన్ని నాలుగు తరాల పాటు ఏలిన కాంగ్రెస్ పార్టీ పలు కుంభకోణాల్లో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. ఆర్థిక అవకతవకలతో బెయిల్ మీద ఆ పార్టీ అగ్రనేతలున్నారని ఎద్దేవా చేశారు.ఆయుష్మాన్ భారత్ లాంటి కార్యక్రమం ప్రారంభించి, 100 రోజులు కాకముందే, ఐదారు లక్షల మందికి లబ్ధి కలిగింది. 100 సార్లు తటపటాయించే కన్నా ఒక్కసారి గట్టి నిర్ణయం తీసుకోవడం ఉత్తమం. గెలుపు ఓటముల గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. మూడు రాష్ట్రాల్లో ఓడినంత మాత్రాన ఆత్మవిశ్వాసం దెబ్బతినదు. పెద్దనోట్ల రద్దులాంటి నిర్ణయాలతో స్పష్టమైన, స్వచ్ఛమైన విధానం తీసుకొచ్చాం. కొత్తగా రైలు పట్టాలేస్తున్నప్పుడు కొంతకాలం ఇబ్బంది ఉంటుంది. మాల్యా, చోక్సీ, నీరవ్ విషయంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నాం. ఆ ప్రక్రియ కొనసాగుతోంది. భారత్‌లో హిందూ, ముస్లిం ఐక్యతను చూసి ప్రపంచం నేర్చుకోవాలి. పరమతసహనం, ఏకత భారతీయుల మూలసూత్రం. మన సమాజం ఇప్పటికీ ఆ మూలసూత్రాలపైనే ఆధారపడివుంది. ఈ విషయాన్ని గాంధీ, పూలే, వినోభావే ఎప్పుడో చెప్పారు.



మెరుపుదాడులు సాహస నిర్ణయం

పాక్ భూభాగంలో ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేసేందుకు నిర్వహించిన మెరుపు దాడులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశాను. రాజకీయం కంటే సైనికుల ప్రాణాలకే ప్రాధాన్యం ఇచ్చాం. అందుకే దాడుల తేదీలను రెండుసార్లు మార్చాల్సి వచ్చింది. దాడులు విజయవంతమైనా, విఫలమైనా దాని గురించి ఆలోచించకుండా సూర్యోదయం అయ్యే సమయానికి తిరిగి రావాలని సైన్యానికి సూచించడం జరిగింది. ఆపరేషన్‌ను అతితక్కువ సమయంలో పూర్తిచేయాలని, దాన్ని ఎక్కువసేపు కొనసాగించొద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. యురి ఘటనలో సహచర సైనికులు 20మంది మరణించడంతో సైనికులు వీరఆవేశంలో ఉన్నారు. అందుకే సర్జికల్ ప్రణాళికను సిద్ధంచేశాం. సుశిక్షితులైన మెరికల్లాంటి కమెండోలను ఎంపిక చేశాం. వారికి అవసరమైన అధునాతన పరికరాలు, ఆయుధాలను సమకూర్చాం. సైనికులు ఎల్‌వోసీ దాటి వెళ్లిన క్షణం నుంచి నాలో టెన్షన్ ఎక్కువైంది. ఆ రోజు ఉదయం గంటపాటు సమాచారం అందలేదు. నాలో ఉత్కంఠ, ఆందోళన ఎక్కువైంది. ఆ క్షణాలు నా జీవితంలో చాల కష్టమైనవి. కొద్దిసేపటి తర్వాత రెండు మూడు యూనిట్ల బలగాలు సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాయి. కానీ మన సరిహద్దుల్లోకి చేరుకోలేదు. ఆందోళన అక్కర్లేదని సమాచారం వచ్చింది. చివరి సైనికుడు తిరిగొచ్చే వరకు జాగ్రత్తగా ఉండాలని చెప్పాను అని మోడీ గుర్తుచేసుకున్నారు. సర్జికల్ దాడులు చేసింది ప్రభుత్వమో, ప్రతిపక్షమో కాదు. ఇది సైనిక ఆపరేషన్. విపక్షాలు సందేహాలు పాకిస్తాన్ వైఖరికి అద్దం పట్టేలా ఉన్నాయి. ఒక్క దాడితో పాకిస్తాన్ ధోరణి మారుతుందని ఆశించడం పెద్ద తప్పిదం. ఇందుకు వారికి చాలా సమయం పడుతుంది. వారికి బుద్ధి చెప్పేందుకు మరిన్ని చర్యలకు వెనుకాడబోం అని మోడీ చెప్పారు.

ఉమెన్‌వాల్ ర్యాలీ విజయవంతం

- చెట్టుకుండు వద్ద స్వల్ప ఉద్రిక్తత
- మహిళలపై రాళ్లు రువ్విన బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తలు



తిరువనంతపురం: కేరళలో వనితా మతిల్ పేరుతో లక్షలమంది మహిళలు మంగళవారం భారీ మానవహారం నిర్వహించారు. స్త్రీ- పురుష సమానత్వం, సామాజిక సంస్కరణలపై తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకొనేందుకు సీఎం పిన్నరయి విజయన్ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం ఉత్తరాన కాసర్‌గూడ్ నుంచి దక్షిణాన తిరువనంతపురం వరకు సముద్ర తీరం వెంబడి రహదారులపై 620 కిలోమీటర్ల మేర మహిళలు ఈ ఉమెన్ వాల్ ర్యాలీ నిర్వహించారు. బాలికలు కూడా ఈ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ఉమెన్ వాల్ ర్యాలీ దృష్ట్యా పాఠశాలలకు ఒకపూట సెలవు ఇవ్వడం, యూనివర్శిటీ పరీక్షలు వాయిదా వేయడంతో ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థినులు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ భారీ ర్యాలీలో 50 లక్షల మంది మహిళలు పాల్గొన్నట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 15 నిమిషాలపాటు ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఉవె ఎన్ వాల్ ర్యాలీలో కాసర్‌గూడ్‌లో మొదటిగా మంత్రి కేకే శైలజ ఈ ర్యాలీలో పాల్గొనగా, తిరువనంతపురంలోని వెల్లయంబాలం వద్ద చివరిగా రాజ్యసభ సభ్యురాలు బృందాకారత్ నిలబడ్డారు. ఈ ర్యాలీలో పలువురు సినీ నటులు, కలెక్టర్లు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. మరోవైపు కాసర్‌గూడ్ దగ్గర్లోని చెట్టుకుండు వద్ద బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తలు రోడ్డుని బ్లాక్ చేసి మహిళలపైకి రాళ్లు విసేరయడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

హెచ్ఐవీ రక్తమార్పిడి కేసులో

శవపరీక్ష రికార్డు చేయండి: హైకోర్టు

మధురై: హెచ్ఐవీ సోకిన విషయం తెలియక గర్భిణికి రక్తదానం చేసి అనంతరం పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకున్న 19ఏళ్ల యువకుడు మృత దేహానికి చేసే శవపరీక్షను వీడియో రికార్డు చేయాలని మద్రాస్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ బీ.పుగలేండీ సోమవారం ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రి (జీఆర్‌హెచ్) డీన్‌కు ఈ మేరకు ఆదేశించారు. మృతుని తల్లి వినతి మేరకు న్యాయమూర్తి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. జీఆర్‌హెచ్‌లో నిర్వహించే శవపరీక్షను పొరుగు జిల్లాలకు చెందిన ఇద్దరు మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో నిర్వహించాలని న్యాయమూర్తి తమ ఆదేశాల్లోపేర్కొన్నారు. ఇదో ప్రత్యేకకేసుగా పరిగణిస్తు న్నామని న్యాయమూర్తి తెలిపారు. కాగా బాధితుడు తనకు హెచ్ఐవీ సోకిందని తెలియక నవంబర్ 30న రక్తదానం చేాడు.

మా సహనాన్ని పరీక్షించొద్దు

- ట్రంప్ వైఖరి మార్చుకో
- అమెరికా అధ్యక్షుడికి కిమ్‌జాంగ్ హెచ్చరిక

సియెల్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా తమ సహనాన్ని పరీక్షించాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నూతన సంవత్సరంలో అమెరికాతో సత్సంబంధాల కోసమే తాము ప్రయత్నిస్తున్నామన్న కిమ్.. ఆంక్షలు, ఒత్తిళ్ల పేరుతో సహనాన్ని పరీక్షిస్తే గట్టిగానే సమాధానమిస్తామని స్పష్టం చేశారు. అణు సదస్సు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జరిపిన చర్చలు ఈ ఏడాది మరింతగా మెరుగుపరుచుకోవాలని కాంక్షిస్తున్నామన్న కిమ్.. ట్రంప్ ఇచ్చిన హామీలను నిలుపుకోకపోతే వైఖరి మార్చుకోకతప్పదని పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. 2019 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రసంగించిన కిమ్.. అంతర్జాతీయ సమాజం బాగు కోసం అమెరికాతో కలిసిపనిచేస్తామన్నారు.

సైనిక విన్యాసాలు మానుకోండి

దక్షిణ కొరియాతో కలిసి సంయుక్త సైన్య విన్యాసాలను అమెరికా మానుకోవడంతో పాటు.. వ్యూహాత్మక సైనిక స్థావరాలను కూడా తొలగించాలన్నారు. ఉత్తర- దక్షిణ కొరియా మధ్య సత్సంబంధాలు పెంపొందాలంటే అమెరికా రెండు దేశాలతో భేదభావాలు లేకుండా నడుచుకోవాలని సూచించారు. ఉత్తర కొరియా- అమెరికా మధ్య మళ్లీ చీలికలు వచ్చాయని కొంతమంది నిపుణులు విశ్లేషిస్తున్న నేపథ్యంలో కిమ్ స్పందిస్తూ.. గత సదస్సులోని అంశాలను అమెరికా నిజాయితీగా అమలు చేస్తే ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమౌతాయని కిమ్ వ్యాఖ్యానించారు. గణతంత్ర ప్రభుత్వాన్ని స్థిరంగా నడుపుతున్న తాము గతేడాది జూన్ 12న జరిగిన ట్రంప్- కిమ్ భేటీలోని ఒప్పందాలకు కట్టుబడే డీ న్యూక్లైజేషన్‌కు ఒప్పుకున్నామన్నారు. ఒప్పందాలకు అనుగుణంగానే దేశీయంగా, అంతర్జాతీయంగా ఎలాంటి అణు పరీక్షలు నిర్వహించడం గానీ.. వినియోగించడం గానీ చేయడం లేదన్నారు.



పాక్ జైళ్లలో 537 మంది భారతీయులు

పాకిస్థాన్ ఖైదీల జాబితాను అందజేసిన భారత్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మంగళవారం పాక్ జైళ్లలో మగ్గుతున్న 537 మంది భారత ఖైదీల జాబితాను ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా భారత్‌కు అందజేసింది. ప్రస్తుతం 483మంది భారత జాలర్లు శిక్ష అనుభవిస్తున్నట్టు ఆ దేశ విదేశాంగ కార్యాలయం వెల్లడించింది. వీరితోపాటు మరో 54మంది భారత్ పౌరులు పాక్ జైళ్లలో మగ్గుతున్నారు. పాకిస్థాన్ జలాల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించారని ఆరోపిస్తూ పాక్ అధికారులు భారత జాలర్లను అరెస్టు చేశారు. అరేబియా సముద్రంలో అంతర్జాతీయ సరిహద్దుపై సరైన అవగాహన లేకపోవటం వల్ల ఇరుదేశాల జాలర్లను తరుచుగా భారత్, పాక్ అధికారులు వారిని అదుపులోకి తీసుకుంటారు. ఇరుదేశాల ద్వైపాక్షిక ఒప్పందం నిబంధనల మేరకు పాక్ జైళ్లలో ఉన్న భారతీయఖైదీల వివరాలను పాకిస్థాన్ తెలియజేసింది. పాక్ విదేశాంగ కార్యాలయం మంగళవారం ఇస్లామాబాద్‌లోని భారత దౌత్యాధికారులకు ఖైదీల జాబితాను అందించింది. దీని ప్రకారం పాక్ జైళ్లలో మొత్తం 537మంది జాలర్లు, పౌరులు శిక్ష అనుభవిస్తున్నారు. 2008 మే 21న భారత్, పాక్ మధ్య కాన్సులర్ యాక్సెస్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఇరుదేశాలు తమ కస్టడీలో ఉన్న ఖైదీల జాబితాను ఏడాదిలో రెండుసార్లు జనవరి 1, జులై 1న పరస్పరం అందించుకోవాలి. ఇందులో భాగంగా మంగళవారం పాక్ తమ దేశంలో ఉన్న భారతఖైదీల వివరాలను అందించింది.

ఖైదీల జాబితాను మార్చుకున్న భారత్, పాక్

ఇండియా, పాకిస్థాన్ ఇరుదేశాలు తమ దేశంలోని జైళ్లలో మగ్గుతున్న ఇరుదేశాల జాలర్లు, పౌరుల జాబితాను మంగళవారం పరస్పరం అందజేసుకున్నాయి. పాక్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంఈఏ) భారత్‌లోని జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న పాక్ ఖైదీల జాబితాను భారత్ దౌత్యకార్యాలయం అందించిందని తెలిపింది. భారత్ జాబితా ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన 249మంది పాక్ దేశస్థులు, 98మంది జాలర్లు ఇండియాలో శిక్ష అనుభవిస్తున్నారని పాక్ ఎంఈఏ తెలిపింది. కాగా 2008లో ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం తమ అధీనంలోఉన్న ఖైదీల వివరాలును ఏడాదికి రెండుసార్లు భారత్, పాక్ పరస్పరం మార్చుకుంటాయి. కాగా ఖైదీల జాబితా మార్పిడి సందర్భంగా పాకిస్థాన్ విదేశాంగశాఖ అధికారులు మాట్లాడుతూ భారతదేశానికి చెందిన 369మంది జాలర్లు, 17మంది సాధారణ ఖైదీలను విడుదల చేసి భారత్‌కు పంపేందుకు చర్యలు వేగవంతం చేశామని తెలిపారు. మరోవైపు భారత్ కూడా 80మంది పాకిస్థాన్ ఖైదీలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది.



పూంచ్‌లో పాకిస్థాన్ సైన్యం కాల్పులు

జమ్ము: జమ్ముకాశ్మీర్లోని పూంచ్ జిల్లాలో నియంత్రణరేఖ వెంబడి పాకిస్థాన్ సైనిక దళాలు మంగళవారం కాల్పులు జరిపాయని రక్షణశాఖ అధికారులు తెలిపారు. నియంత్రణ రేఖలోని ఖారీ కర్మారా, గుల్పూర్ ప్రాంతాల్లో పాక్‌సైన్యం కాల్పులు జరిపిందని అధికారులు వివరించారు. కాగా ఈ కాల్పుల్లో భారత్ జవాన్లు ఎవరూ గాయపడలేదని తెలిపారు. కాగా 2003 భారత్, పాకిస్థాన్ ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తరువాత పాకిస్థాన్ తరుచుగా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కాల్పులకు తెగబడుతోంది. 2017 నుంచి అక్టోబర్ 2018 వరకు పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి 1600 సార్లు పాక్ సైన్యం దాడులకు దిగింది.

ఘనంగా టీఎంసీ 21వ వ్యవస్థాపక దినోత్సవం


కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మంగళవారం 21వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా టీఎంసీ చీఫ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. జనవరి 1, 1998లో ఎన్నో ఆటంకాల నడుమ టీఎంసీ ప్రయాణం ప్రారంభమైందన్నారు. అయితే ఇప్పుడు ప్రజాపోరాటం తాము స్థిరపడ్డామన్నారు. దీనికి సహకరించిన మా, మాటి, మనుష్‌కు ధన్యవాదాలని మమతా అన్నారు. టీఎంసీ కార్యకర్తలు 365రోజులు ప్రజలకోసం పనిచేస్తున్నారని వారికి సెల్యూట్ చేస్తున్నాను అని సీఎం మమతా బెనర్జీ అన్నారు.



జీఎస్టీ వసూళ్లు డీలా!

- డిసెంబర్‌లో రూ. 94,726 కోట్లు
- నవంబర్‌లో 97,637 కోట్లు
- సేల్స్ రిటర్న్స్ ఫైలింగ్ పెరిగింది
- రాబోయే నెలల్లోను ఇదే వరస!





న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను లేదా జీఎస్టి వసూళ్లు డిసెంబర్ 2018లో కాస్తా తగ్గి రూ.94,726 కోట్లకు దిగివచ్చాయి. అదే నవంబర్ నెలలో రూ.97,637 కోట్లని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. అయితే డిసెంబర్‌లో సేల్స్ రిటర్న్స్ లేదా జీఎస్‌టిఆర్-3బీ ఫైలింగ్ గణనీయంగా పెరిగి 72.44 లక్షలకు చేరగా.. అదే నవంబర్ నెలలో 69.6 లక్షల ఫైలింగ్‌లు మాత్రమే జరిగాయి.

ఆర్థికమంత్రిత్వశాఖ విడుదల చేసిన ప్రకటనల ప్రకారం డిసెంబర్ నెలలో వసూలు జీఎస్టి మొత్తం రూ.94,726 కోట్లు కాగా... వాటిలో సెంట్రల్ జీఎస్టి (సీజీఎస్‌టి) వసూళ్లు రూ.16,442 కోట్లు, రాష్ట్ర జీఎస్టి (ఎస్‌జీఎస్‌టి) రూ.22,459 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టి (ఐజీఎస్‌టి) రూ.47,936 కోట్లు, సెస్‌లుల రూ.7,888 కోట్లుగా తేలిందని పేర్కొంది. అయితే ఐజీఎస్‌టిలో కేంద్రప్రభుత్వం రూ.18,409 కోట్లు సీజీఎస్‌టికింద రూ.14,793 కోట్లు ఎస్‌జీఎస్‌టి కింద పంపకాలు జరిపింది.

ఇదిలా ఉండగా మొత్తం రెవెన్యూ .. కేంద్రప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలు ఆర్జించిన తర్వాత ... డిసెంబర్ నెలలో సీజీఎస్‌టి కింది రూ.43,851 కోట్లు, ఎస్‌జీఎస్‌టి కింది రూ.46,252 కోట్లు పంపకాలు జరిగాయని ఆర్థికమంత్రిత్వశాఖ ప్రకటనలో పేర్కొంది. డిసెంబర్ నెల రెవెన్యూను బట్టి చూస్తే.. నవంబర్‌లో కొనుగోలు అమ్మకాల లావాదేవీలు ఎలా జరిగాయో ఇట్టే తెలిసిపోతుంది.

ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలలు (ఏప్రిల్ నుంచి డిసెంబర్) వరకు పరిగణనలోకి తీసుకొంటే ప్రభుత్వం జీఎస్టి కింద రూ.8.71 లక్షల కోట్లు వసూలు చేసింది. కాగా 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్లో జీఎస్టి వసూళ్లురూ.13.48 లక్షల కోట్లుగా అంచనా వేశాయి. దీని ప్రకారం లెక్కిస్తే ప్రతినెలా ప్రభుత్వానికి నెలకు రూ.1.12 లక్ష కోట్లు జీఎస్టి వసూళ్లు రావాల్సి ఉంటుంది. అయితే జులై 2017 నుంచి మార్చి 2018 వరకు చూస్తే జీఎస్టి వసూళ్లు సరాసరి నెలకు రూ.89,885 కోట్లుగా తేలింది.

రాబోయే నెలల్లో మరింత తగ్గే అవకాశం

ఇదిలా ఉండగా రాబోయే నెలల్లో ప్రభుత్వానికి జీఎస్టీ ద్వారా వచ్చే రెవెన్యూ మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే జనవరి 1, 2019 నుంచి జీఎస్టీ కౌన్సిల్ మొత్తం 23 వస్తువులపై సుంకాలు తగ్గించింది. ఇక జీఎస్టిలో 28 శ్లాబ్ కింది కేవలం 28 వస్తువులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పన్ను రేట్లను తగ్గించినందు వల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.5,500 కోట్ల వరకు రెవెన్యూ తగ్గుతుంది. ఇక ఈ ఆర్థిక సంవత్సర ముగియడానికి మిగిలింది కేవలం మూడు నెలలు మాత్రమే. ఈ లెక్కన చూస్తే ప్రభుత్వానికి మరో రూ.1,375 కోట్ల ఆదాయం తగ్గుతుంది.

జీఎస్టి స్థిరపడుతోంది: మొత్తానికి చూస్తే ఈ ఏడాది జీఎస్టి రెవెన్యూ స్థిరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జీఎస్టీలో పన్ను రేట్లు తగ్గించడం వల్ల ఇప్పటికిప్పుడే రెవెన్యూ పెరిగే అవకాశాలు చాలా తక్కువని డెలాయిట్ ఇండియా భాగస్వామి ఎంఎస్ మనీ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే పీడబ్ల్యుసీ నేషనల్ ఇండైరెక్ట్ టాక్స్ లీడర్ ప్రతిక్ జైన్ తాజా పరిణమాలపై స్పందిస్తూ.. రాబోయే రెండు నెలల పాటు జీఎస్టి వసూళ్లు ఈ స్థాయిలోనే ఉంటా యన్నారు. అయితే ప్రభుత్వం వసూళ్లు పెంచుకో వడానికి కొన్ని కేసులను విచారించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి జీఎస్టి వసూళ్లు మరింత పెరిగే అవకా శాలుంటాయని.. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త జీఎస్టిలో కొత్త ఫ్రేమ్‌వర్కును అమల్లోకి తేనుంది. దీంతో వ్యాపారస్తులు క్లెయిమ్ చేసే ఇన్‌పుట్ క్రెడిట్‌పై ప్రభు త్వానికి మరింత పట్టు వస్తుంది కాబట్టి రెవెన్యూ పెరిగే అవకాశాలుంటాయని ప్రతీక్ జైన్ భావిస్తున్నారు. ఈవై టాక్స్ పార్టనర్ అభిషేక్ జైన్ .. జీఎస్టి రెవెన్యూ వసూళ్ల తగ్గుదల గురించి ప్రస్తావిస్తూ.. గత రెండు నెలలతో పోల్చుకుంటే రెవెన్యూ వసూళ్లు చాలా నిరు త్సాహకరంగా ఉన్నాయన్నారు. పరిస్థితి ఇలానే ఉంటే ప్రభుత్వం 28 శాతం కిందికి వచ్చే కొన్ని వస్తువులు ఉదాహరణకు సిమెంట్, ఆటో విడిభాగాలపై రేట్లను తగ్గించే ఆలోచనను విరమించుకునే అవకాశా లను కొ ట్టి పారే యలేమని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జీఎస్టి వసూళ్లు.. ఏప్రిల్‌లో రూ.1.03 లక్షల కోట్లు, మేలో రూ.94,016 కోట్లు, జూన్‌లో రూ.95, 610 కోట్లు, జులైలో రూ.96,483 కోట్లు, ఆగస్టులో రూ.93,960 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.94,442 కోట్లు, అక్టోబర్‌లో రూ.1,00,710 కోట్లు కాగా నవంబర్‌లో రూ.97,637 కొట్ల జీఎస్టి వసూళ్లు ప్రభుత్వ ఖజానాలో జమఅయ్యాయి.

కార్ల అమ్మకాలు నెమ్మదించాయి



న్యూఢిల్లీ : కార్ల అమ్మకాలు డిసెంబర్‌లో తగ్గముఖం పట్టాయి. మంగళవారంనాడు ఆటో కంపెనీలు విడుదల చేసిన గణాంకాలను బట్టి చూస్తే కొన్ని కంపెనీల కార్ల అమ్మకాలు స్వల్పంగా పెరగడమో లేదా తగ్గడమో జరిగాయి. ద్రవ్యకొరత కారణంగానే అమ్మకాలు తగ్గాయని కంపెనీలు వివరణ ఇస్తున్నాయి. ఇక వివరాల్లోకి వెళితే మారుతి సుజుకి ఇండియా, హ్యుందాయ్ మోటార్ ఇండియా, హోండాకార్స్ ఇండియా, టాటామోటార్స్ అమ్మకాలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయితే... దీనికి వ్యతిరేకంగా మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. మారుతి డిసెంబర్ అమ్మకాలు 1.8 శాతం పెరిగి 121,479 యూనిట్లకు చేరితే, క్రితం ఏడాది ఇదే నెలలో 119,286 యూనిట్లు విక్రయించింది. దీనికి వ్యతిరేకంగా హ్యుందాయ్ అమ్మకాల్లో 4.6 శాతం వృద్ధితో 42,093 యూనిట్లు విక్రయిస్తే.. క్రితం ఏడాది ఇదే నెలలో 40,158 యూనిట్లు విక్రయించింది. హోండాకార్స్ అమ్మకాలు 4 శాతం వృద్ధితో 13,139 యూనిట్లు విక్రయిస్తే.. క్రితం ఏడాది దేశీయ మార్కెట్లో 12,642 యూనిట్లు విక్రయించింది. టాటామోటార్స్ అమ్మకాల్లో ఒక శాతం పెరిగి 14,260 యూనిట్లు విక్రయించింది. క్రితం ఏడాది ఇదే నెలలో 14,180 యూనిట్లు విక్రయించింది. ఇక ఎంఅండ్ఎం విషయానికి వస్తే డిసెంబర్ అమ్మకాల్లో 3 శాతం క్షీణించి 15,091 యూనిట్లు విక్రయిస్తే.. ఏడాది క్రితం 15,543 యూనిట్లు విక్రయించింది. అమ్మకాలు తగ్గడానికి ప్రధాన కారణం ద్రవ్యలభ్యత కొరత అమ్మకాలపై కనిపించిందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు గత నెలలో 14 శాతం క్షీణించి 56,026 యూనిట్లకు పరిమితం కాగా.. ఏడాది క్రితం 65,367 యూని ట్లు విక్రయించింది.

ఈ ఏడాది ఆకర్షణీయమైన షేర్లు

హైదరాబాద్ : మంగళవారం నుంచి కొత్త సంవత్సరం 2019లో అడుగుపెట్టాం. ఈ ఏడాది ఇన్వెస్టర్లు ఫోర్టుపోలియోలో ఉంచుకోవాల్సిన షేర్ల గురించి విశ్లేషకులు కొన్ని సూచనాలు చేశారు. వాటిని ఒకసారి పరిశీలిద్దాం. ఈ ఏడాది ప్రథమార్థంలో మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలను కొట్టిపారేయలేం. ఎందుకంటే ఈ ఏడాది వేసవిలో లోకసభ ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతో పాటు అమెరికా - చైనాల వాణిజ్య యుద్ధం గ్లోబల్ మార్కెట్లపై ప్రభావం చూపబోతుంది. ముడిచమురు ధరలు, రూపాయి తదితర అంశాలు కూడా దేశీయ మార్కెట్లపై అంతో ఇంతో తప్పకుండా ప్రభావం చూపుతాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే కొత్త సంవత్సరంలో ఇన్వెస్టర్లకు ఎంపిక కొన్ని చేసిన షేర్లు నిపుణులు చూసిస్తున్నారు. వాటిలో మారికో, ఐసీఐసీఐ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్‌పై ఒక్క లుక్కేయమని దాదాపు అందరూ బ్రోకరేజీ సంస్థలు సూచిస్తున్నాయి. మిగిలిన షేర్ల పోర్టుపోలియో ఇలా ఉంది.

అపోలోటైర్స్ - టార్గెట్ ధర రూ.300

టైర్ల కంపెనీల్లో ఇతర కంపెనీలతో పోల్చుకుంటే అత్యంత ఆకర్షణీయంగా అపోలోటైర్స్ కనిపిస్తోంది. ద్విచక్ర వాహనాల టైర్ల రంగంలో పోటీ విపరీతంగా ఉన్నా అపోలోకు హంగేరీలో అతి చౌకరకం ప్లాంట్ ఉంది. ఇది అపోలోకు బాగా కలిసొచ్చే అంశం. దీంతో పాటు ముడిచమురు ధరలు తగ్గడం, రబ్బరు ధరలు స్థిరంగా ఉండటం వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆపరేటింగా మార్జిన్ 160 బేసిస్ పాయింట్లు పెరిగి 12.7 శాతానికి చేరుతుందని బ్రోకర్లు చెబుతున్నారు.

ఐసీఐసీఐ లోంబార్డ్ టార్గెట్ ధర రూ.1,075

ఐసీఐసీఐ లొంబార్డ్ ప్రస్తుతం మార్కెట్లో పీఎస్‌యు కంపెనీల నుంచి పెద్దమొత్తంలో వాటాదక్కించుకుంటోంది. వచ్చే మూడు సంవత్సరాల్లో దీని ఎర్నింగ్‌ఫర్ షేర్ (ఈపీఎస్) రెట్టింపు అయ్యే అవకాశాలున్నాయి.

లార్సన్ అండ్ టర్బో టార్గెట్ రూ.1,650

ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ప్రభుత్వం పెద్దపీట వేయడంతో పాటు కంపెనీకి మిడ్‌సైజ్ ఆర్డర్లు బాగా పెరిగిపోయాయి. ఆర్డర్లు కూడా వేగవంతంగా పూర్తి చేస్తోంది. కంపెనీ వినియోగంలో లేని ఆస్తులను విక్రయించి వాటిని మూలధనం కింది మార్చుకుంటోంది. కాబట్టి ఈ షేరు ఈ ఏడాది మరింత ఆకర్షణీయంగా ఉండవచ్చునని సూచిస్తున్నారు.

అపోలో హాస్పటిట్స్ టార్గెట్ ధర రూ.1,440

కంపెనీ ఈ ఏడాది సరాసరి ఒక్కో పడకపై రెవెన్యూ పెంచుకోవాలని సూచిస్తోంది. దీంతో కంపెనీల లాభాల మార్జిన్ పెరగుతుంది. దీంతో పాటు ఫార్మా వ్యాపారం 2018-20 వరకు ఏడాదికి 18 శాతం వృద్ధితో రూ.4,525 కోట్లకు చేరుతుందని అంచనా.సోమాని సెరామిక్స్ టార్గెట్ ధర రూ.410: సోమాని ప్రస్తుతం అన్నీ సంక్షోభాల నుంచి గట్టెక్కింది. ట్రక్కుల సమ్మె, కేరళ వరదల ప్రభావం ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కంపెనీపై ప్రభావం చూపించింది. ప్రస్తుతం అన్నీ సవ్యంగా కొనసాగుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రెవెన్యూ డబుల్ డిజిట్ సాధిస్తుందని విశ్లేషకుల అంచనా.

మారికో టార్గెట్ ధర రూ.465

మారికో గత 18 నెలల నుంచి కొత్త కొత్త ప్రొడక్టులను మార్కెట్లో విడుదల చేసింది. వాటిలో కొన్ని ప్రొడక్టులకు విజయం సాధించాయి. కొత్త ప్రొడక్టుల ఊపుతో కంపెనీ రెవెన్యూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి 15 శాతం పెరుగుతుందని బ్రోకర్ల అంచనా.

ఒబెరాయ్ రియల్టీ టార్గెట్ ధర రూ.574

రియల్ ఎస్టేట్ కంపెనీల్లో ఒబెరాయ్ రియల్టీ బ్యాలెన్సీ షీట్ బలంగా ఉంది. అప్పులు కూడా తక్కువ ఉన్నాయి. చేతిలో అతి పెద్ద ప్రాజెక్టులు ఉన్నాయి. దీని ద్వారా కంపెనీ పెద్దెత్తున తమ పుస్తకాల్లో నగదు సృష్టించవచ్చునని చెబుతున్నాయి.

ఐసీఐసీఐ బ్యాంకు టార్గెట్ ధర రూ.430

ప్రైవేట్ బ్యాంకు నాయకత్వ సంక్షోభాల నుంచి గట్టెక్కింది. బ్యాంకుకు కొత్త నాయకుడు వచ్చాడు. బ్యాంకు వద్ద తగినంత మూలధనం ఉంది. అలాగే ఎన్‌పీఏలు కూడా బాగా అదుపులోకి వచ్చాయి. బ్యాంకు మరింత లాభాలు ఆర్జించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు.

ఇండస్‌ఇండ్ బ్యాంకు టార్గెట్ రూ.1,984

ప్రైవేట్ బ్యాంకుల్లో ఇండస్‌ఇండ్ మంచి ప్రదర్శన చూపిస్తోంది. వ్యాపారం బాగా వృద్ధిచెందుతోంది. రుణాల డిమాండ్ జోరందుకోవడంతో లాభాల మార్జిన్ కూడా పెరుగుతుందని చెబుతున్నారు.

బ్రిటానియా ఇండస్ట్రీస్ టార్గెట్ రూ.3,630

వినూత్నమైన ప్రొడక్టులతో పాటు డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కు బలంగా ఉండటంతో నిర్వహణా సామర్థ్యం కూడా మెరుగ్గా ఉండటంతో 2018-20 వరకు లాభాల మార్జిన్ డబుల్ డిజిట్‌కు చేరుతుందని అంచనా. అంతర్జాతీయ వ్యాపారాలు కలసి రావడంతో ఈ షేరు అదనపు ఆకర్షణీయంగా ఉంటుందంటున్నారు.

వోల్టాస్ టార్గెట్ ధర రూ.672

కన్స్యూమర్ డ్యూరబుల్ రంగంలో వచ్చే మూడు నుంచి ఐదు సంవత్సరాల పాటు జోరందుకునే అవకాశాలున్నాయి. కంపెనీ లోపాలు ఎక్కడున్నాయో గుర్తించి పరిష్కరించుకునే పనిలో పడింది. దీంతో పాటు కంపెనీ ఆర్డర్ పుస్తకం మరింత పెరిగింది.

పెట్రోల్ కంటే విమాన ఇంధనం చౌక!

- పెట్రోల్ లీటరు రూ. 68.65
- విమానాల ఇంధనం లీటరు రూ. 58.06



న్యూఢిల్లీ : పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన దేశీయ విమానయాన సంస్థలకు అతి పెద్ద ఊరట! విమానాలకు వినియోగించే ఇంధనం ధరలను ప్రభుత్వం ఏకంగా 14.7 శాతం తగ్గించింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గడంతో విమానాలకు వినియోగించే ఇంధనం (ఎటీఎఫ్) ధరను కిలోలీటరుకు రూ.9,990 లేదా 14.7 శాతం తగ్గించి రూ.58,060.97కు సవరించినట్లు ప్రభుత్వరంగానికి చెందిన చమురు కంపెనీలు తాజా నోటిఫికేషన్‌లో పేర్కొన్నాయి. ఎటీఎఫ్ ధరలను తగ్గించడం వరుసగా ఇది రెండోసారి. అయితే ఈ స్థాయిలో గతంలో ఎన్నడూ తగ్గించిన దాఖలాల్లేవు. చివరగా డిసెంబర్ 1న కిలోలీరుకు రూ.8,327.83 లేదా 10.9 శాతం తగ్గించింది. వరుసగా రెండుసార్లు ఎటీఎఫ్ ధరలను తగ్గించడంతో ఏడాది కనిష్ఠానికి ధరలు దిగివచ్చాయి. దీంతో ఇప్పటికే నగదుతో కటకటలాడుతున్న ఎయిర్‌లైన్స్‌కు ఎక్కడ లేని ఊరట లభిస్తుంది.

పెట్రోల్, డిజెల్ కంటే ఎటీఎఫ్ ధర తక్కువ : ప్రస్తుతం దేశంలోని పలు నగరాలతో పోల్చుకుంటే పెట్రోల్, డిజెల్ కంటే ముంబైలో నాన్‌పీడీఎస్ కిరోసిన్ కంటే విమానాలకు వినియోగించే ఇంధనం చౌక అయ్యింది. ఇక లీటరు పెట్రోల్ మోటార్‌సైకిల్ లేదా కారుకు కొనుగోలు చేయాలంటే ఢిల్లీలో లీటరు రూ.68.65 చెల్లించాలి. అదే ఎటీఎఫ్ కిలోలీటరు రూ.58,060.97 అనుకుంటే లీటరు రూ.58.06పైసలుగా తేలుతుంది. అదే డీజెల్ విషయానికి వస్తే ప్రస్తుతం పలు నగరాల్లో రూ.62.66కి అందుబాటులో ఉంటోంది. అదే కిరోసిన్ విషయానికి వస్తే పీడీఎప్ వ్యవస్థ ద్వారా కాకుండా బయట కొనుగోలు చేస్తే.. కాస్తా ఎక్కువ ఉంటుంది. ఢిల్లీలో నాన్ పీడీఎప్ ద్వారా లభించే కిరోసిన్ లీటరు రూ.56.59కి విక్రయిస్తున్నారు. దేశంలోనే అతి పెద్ద రద్దీ విమానాశ్రయం ముంబై ఎయిర్‌పోర్టులుగా చెప్పుకోవచ్చు. ముంబైలో ఎటీఎఫ్ కిలోలీటరు రూ.58,017.33 అంటే లీటరు రూ.58.01కి ప్రస్తుతం లభిస్తుంది. అదే పెట్రోల్ ఇదే ముంబైలో లీటరు రూ.74.30, డిజెల్ రూ.65.56, నాన్ పీడీఎస్ కిరోసిన్ ముంబైలో లీటరు రూ.59.53కు విక్రయిస్తున్నారు. అయితే దేశంలో వివిధ నగరా ల్లో వివిధ రకాల పన్నులు విధిసు న్నందు వల్ల ఒక్కో నగరంలో ఒక్కోరేటుకు పెట్రోల్, డిజెల్ విక్రయిస్తుంటారు. ప్రస్తుతం అంత ర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గముఖం పట్టడంతో చమురు మార్కెటింగ్ కంపెనీలు కూడా ప్రతి రోజు ధరల ను తగ్గిస్తున్నాయి. తాజాగా మంగ ళవారం పెట్రోల్‌పై 19 పైసలు, డిజెల్‌పై 20 పైస లు తగ్గించింది. దీంతో ఢిల్లీలో పెట్రోల్ లీటరు రూ.68.65, డిజెల్ రూ.62.66కు లభిస్తోంది. ప్రభుత్వరంగానికి చెందిన చమురు కంపెనీలు ప్రతి నెలా ఒకటవ తేదీన అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరల సరాసరి రేట్లను పరిగణనలోకి తీసుకొని దీంతో పాటు డాలర్‌తో రూపాయి మారకం విలువను అంతకు ముందు నెలను పరిగణనలోకి తీసుకుని ధర నిర్ణయిస్తాయి. కాగా పెట్రోల్, డిజెల్ ధరలను రోజువారి సవరిస్తుంటాయి.

సఫా ప్రెసిడెంట్‌గా పీవీఎస్ జగన్‌మోహన్‌రావు

- వైస్ ప్రెసిడెంట్‌గా జియా ఉల్ ముస్తాఫా



హైదరాబాద్ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సీఎంఏ డాక్టర్ పీవీఎస్ జగన్‌మోహనరావును సౌత్ ఏషియన్ ఫెడరేషన్ ఆఫ్ అకౌంటెంట్స్ (సఫా)కు 2019 సంవత్సరానికి ప్రెసిడెంట్‌గా నియమించబడ్డారు. ఉపాధ్యక్షుడిగా పాకిస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ ఆఫ్ పాకిస్తాన్ ప్రెసిడెంట్ జియా ఉల్ ముస్తాఫాను వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేశారు. వీరిద్దరు జనవరి 1,2019 నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉండగా 2018 సంవత్సరానికి సఫాకు జగన్ మోహన్‌రావు వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఇదిలా ఉండగా డాక్టర్ రావుకు ఫైనాన్స్, సెక్రటెరియల్, లీగల్, జనరల్ మేనేజ్‌మెంట్ రంగాల్లో 30 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది. అదీ కాకుండా ఆయన దేశంలోని పలు సంస్థలు ఉదాహరణకు నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, కార్వీ కన్సల్టెంట్ లిమిటెడ్‌లలో ఇండిపెండెంట్ డైరెక్టర్‌తో పాటు ఆడిట్ కమిటి ఛైర్మన్ హోదాల్లో పనిచేశారు.

బోణీ అదిరింది!

- 186 పాయింట్లు అప్
- బ్యాంకింగ్ షేర్ల హవా
- దాస్ వ్యాఖ్యతో మార్కెట్లకు కిక్కు
- కొత్త సంవత్సరం సందర్భంగా గ్లోబల్ మార్కెట్లకు సెలవు



ముంబై : కొత్త సంవత్సరం 2019 మంగళవారం నాటి మొదటి ట్రేడింగ్ బోణి అదిరింది. ఇన్వెస్టర్లను సంతృప్తి పరిచింది. సెన్సెక్స్ 186 పాయింట్ల వరకు లాభపడింది. రిజర్వుబ్యాంకు గవర్నర్ శక్తికాంతదాస్ మొండిబకాయిల నుంచి బ్యాంకింగ్ రంగం క్రమంగా కోలుకుంటోందని సోమవారం నాడు వ్యాఖ్యానించడం మార్కెట్లపై బాగా పనిచేసింది. ఇన్వెస్టర్లు బ్యాంకు షేర్లను పెద్దెత్తున కొనుగోలు చేశారు. మార్కెట్ ముగిసే నాటికి బీఎస్ఈ 186.24 పాయింట్లు లాభపడి 36,254.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 47.55 పాయింట్లతో 10,910.10 వద్ద స్థిరపడింది.

ఇక మంగళవారం నాటి ట్రేడింగ్ సరళిని గమనిస్తే.. మార్కెట్ ప్రారంభం నుంచి సెన్సెక్స్‌తో పాటు నిఫ్టీ నెగెటివ్‌గానే ట్రేడ్ అయ్యాయి. అయితే మార్కెట్ చివరి గంటలో ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో బ్యాంకు, ఐటీ రంగానికి చెందిన షేర్లు కొనుగోలు చేయడంతో మార్కెట్ గట్టెక్కింది. బ్యాంకు, టెలికం, ఐటి, ఆటో, ఫార్మా షేర్లకు డిమాండ్ పెరిగింది. బీఎస్ఈ చార్ట్‌లో అత్యధికంగా లాభపడింది మాత్రం భారతిఎయిర్‌టెల్ 2.76, హెచ్‌డీఎఫ్‌సీ 2.01 శాతం, ఎస్ బ్యాంకు 1.38 శాతం వరకు లాబపడ్డాయి. వీటితో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ,యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, ఇన్ఫోసిస్, హీరోమోటోకార్ప్, టాటామోటార్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, బజాజ్‌ఆటో, మారుతి, కోల్ ఇండియా, లార్సన్ అండ్ టర్బో, రిల్ షేర్లు 1.3 శాతం వరకు లాభపడ్డాయి. నష్టాలను మూటగట్టుకున్న షేర్ల విషయానికి వస్తే మహీంద్రా అండ్ మహీంద్రా, టాటాస్టీల్, ఓఎన్‌జీసీ, హెచ్‌యుఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, కొటక్ మహీంద్రా బ్యాంకు, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, వేదాంత, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 3.75 శాతం వరకు నష్టపోయాయి.

మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ప్రకటన... బ్యాంకింగ్ రంగం మొండిబకాయిల నుంచి క్రమంగా గాడిన పడుతోందన్న ప్రకటన మార్కెట్లకు టానిక్‌లా పనిచేసిందని.. దీంతో ఇన్వెస్టర్లు బ్యాంకు షేర్లు కొనుగోలు చేయడానికి ఆసక్తికనబర్చారని చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సం మార్చి చివరి నాటికి బ్యాంకుల్లో ఎన్‌పీఏ లేదా మొండిబకాయిలు 11.5 శాతం నుంచి సెప్టెంబర్ చివరి నాటికి 10.8 శాతానికి దిగివచ్చాయని ఆర్‌బీఐ సోమవారం నాడు విడుదల చేసిన ఆర్థిక స్థిరత్వ నివేదికలో పేర్కొంది.

మొత్తానికి 2018న సంవత్సరం సెన్సెక్స్, నిఫ్టీలు రెండు స్వల్పలాభాలతో వీడ్కోలు పలికాయి. వరుసగా మూడో సంవత్సరం స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయని చెప్పవచ్చు. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనకూలమైన సంకేతాలు రావడంతో పాటు డాలర్ మారకంతో రూపాయి పుంజుకోవడం కూడా మార్కెట్లకు బాగా కలిసొచ్చింది. గతేడాది ఏడాది సెన్సెక్స్ మొత్తానికి 2,011 పాయింట్లు లేదా 5.9 శాతం, నిఫ్టీ 332 పాయింట్లు లేదా 3.2 శాతం లాభపడ్డాయి. కొత్త సంవత్సరం ట్రేడింగ్ విషయానికి వస్తే బుల్స్ తిరిగి రంగ ప్రవేశం చేశాయని చెప్పవచ్చు. నిఫ్టీ తిరిగి 10,900 మార్కును దాటిపోయింది. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రాకపోయినా.. మార్కెట్లు లాభాలతో ముగియడం విశేషం. డిసెంబర్ నెల ఆటో అమ్మకాల్లో మిశ్రమ స్పందన కనిపించింది. వచ్చే వారం నుంచి కార్పొరేట్ ఫలితాలు వెలువడనున్నాయి. స్వల్పకాలికానికి లిక్విడిటి సెంటిమెంట్ మార్కెట్లను శాసిస్తుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ఏడాది కూడా మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలను కొట్టిపారేయలేమని, ఎందుకంటే అగ్రరాజ్యాల మధ్య వాణిజ్య యుద్ధాలు.. గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ మందగించడంతో ముడిచమురు ధరలతో పాటు కరెన్సీ కూడా ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలను కొట్టిపారేయలేమని చెబుతున్నారు. దీంతో పాటు ఈ ఏడాది వేసవిలో సాధారణ ఎన్నికలు మార్కెట్లను శాసిస్తాయి. ఇదిలా ఉండగా సోమవారం నాడు విదేశీ సంస్థాగతమదుపరులు రూ.326.87 కోట్ల షేర్లను విక్రయిస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.321.98 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు. ఇక గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ప్రపచంలోని మెజారిటి మార్కెట్లు కొత్త సంవత్సరం సందర్భంగా సెలవులో ఉన్నాయి. కాబట్టి ట్రేడింగ్ జరగలేదు.

రూపాయి నవ్వింది

- కొత్త సంవత్సరంలో ఏకంగా 34 పైసలు బలపడింది



ముంబై : నయాసాల్ .. కొత్త సంవత్సరం 2019 మొదటి ట్రేడింగ్ సెషన్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి తన సత్తా చాటింది. సోమవారం కూడా రూపాయి లాభపడింది. కాగా మంగళవారం తిరిగే సరికి డాలర్ మారకంతో రూపాయి మరో 34 పైసలు బలపడి 69.43 వద్ద ముగిసింది. ఎగుమతిదారులు తమ వద్ద ఉన్న డాలర్లను విక్రయించడంతో పాటు ఈక్విటి మార్కెట్లు లాభాలతో దూసుకుపోవడంతో సెంటిమెంట్ ప్రకారం రూపాయిపై ప్రభావం చూపించింది. కాగా కరెన్సీ గత మూడు ట్రేడింగ్ సెషన్‌లలో ఏకంగా 92 పైసలు వరకు బలపడింది. ఇక్కడి ఫారెక్స్ ట్రేడర్ల అంచనా ప్రకారం ఎగుమతిదార్లు, బ్యాంకర్లు తమ వద్ద ఉన్న డాలర్లను విక్రయించడంతో రూపాయి బలపడిందని చెబుతున్నారు. ఇక మంగళవారం నాటి ట్రేడింగ్ సరళిని గమనిస్తే.. రూపాయి ప్రారంభంలోనే 69.93వద్ద మొదలై తర్వాత మరింత కోలుకొని 69.43 మార్కుకు చేరింది. బ్యాంకర్లు, ఎగువతిదార్లు డాలర్లు విక్రయించడంతో చివరకు 34 పైసలు బలపడి 69.43 వద్ద ముగిసింది. కాగా సోమవారం నాడు మరో 18 పైసలు బలపడి 69.77 వద్ద ముగిసింది. ఇదిలా ఉండగా 2018లో రూపాయి ఏకంగా 9.23 శాతం క్షీణించింది. ఏడాది ప్రాతిపదికన చూస్తే 2018లో రూపాయి భారీగా 509 పైసలు లేదా 9.23 శాతం క్షీణించింది. డిసెంబర్ 2017లో రూపాయి 63.87 వద్ద ముగిసింది. కరెన్సీ డీలర్ల అంచనా ప్రకారం ఈ ఏడాది రూపాయి స్థిరంగా ఉండే అవకాశాలున్నాయని చెబుతున్నారు. దేశీయ ఈక్విటి మార్కెట్ లాభాలతో ముగియడంతో సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం రూపాయిపై చూపిస్తోందని విశ్లేషిస్తున్నారు.

ఒక్కరాత్రే...రూ. 90 కోట్లు
తాగేశారు !

• విందు వినోదాల్లో తేలియాడిన రియల్టర్లు, రాజకీయ నేతలు
• ఎక్సైజ్‌కు భారీ ఆదాయం



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో నూతన ఏడాది ఆగమనం వేళ మందు బాబులు భారీస్థాయిలో విందు వినోదాల్లో మునిగితేలారు. ఏడాది చివరి రోజైన డిసెంబర్ 31 తేదీ ఒక్క రోజే రూ.90కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజు అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు రోజుల్లో జరిగిన అమ్మకాలను దృష్టిలో ఉంచుకొని సుమారుగా రూ.100 కోట్ల మద్యం అమ్మకాలు జరిగి ఉండొచ్చని భావిస్తున్నట్లు చెబుతున్నారు. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలకు అనుమతి ఇవ్వడం, రానున్న ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్న నేతలు యువతను మంచి చేసుకునేందుకు భారీగా విందు పార్టీలు ఏర్పాటు చేయడంతో 'ఆబ్కారీ శాఖ'కు భారీ అమ్మకాలు తెచ్చిపెట్టాయి. గతంలో జరిగిన అమ్మకాలను దృష్టిలో ఉంచుకొని తాము ఆశించిన దానికంటే కూడా అధికంగానే అమ్మకాలు సాగాయంటూ అధికారులు ఆనందంగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 820 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా, 4380 మద్యం షాపులు ఉన్నాయి. రాష్ట్రంలోని బార్ అండ్ రెస్టారెంట్లు, షాపుల నిర్వాహకులు డిసెంబర్ 29 నుంచి మూడు రోజులపాటు రూ.288 కోట్ల విలువైన నాలుగు లక్షల, 87వేల, 888 కేసుల మద్యం, మూడు లక్షల 62వేల 147 కేసుల బీర్లు బేవరేజెస్ కార్పోరేషన్ డిపోల నుంచి కొనుగోలు చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో సాధారణ రోజుల్లో రోజువారీ మద్యం అమ్మకాలు సగటున రూ.50 కోట్ల మేర జరుగుతుంటాయి. ప్రత్యేక పర్వదినాల సమయంలో అదనంగా మరో రూ.10 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. నూతన సంవత్సర వంటి వేడుకల సమయంలో ఇది రూ.25 నుంచి 30 కోట్ల మధ్య ఉంటుందనేది అధికారుల సమాచారం. అయితే ఈ ఏడాది ఇందుకు అదనంగా మరో రూ.10 నుంచి రూ.15 కోట్ల వరకు పెరిగి ఉండొచ్చని, ఇందుకు ఎన్నికల ఏడాది కావడమే కారణమని అధికారులు అంటున్నారు. తమకు అందిన ప్రాథమికసమాచారం ప్రకారం రూ.90 నుంచి రూ.95 కోట్ల మధ్య ఒక్క డిసెంబర్ 31నే జరిగినట్లు పేర్కొంటున్నారు. గతంతో పోల్చితే రాజధాని పరిసర ప్రాంతాలైన గుంటూరు, కృష్ణాజిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. హైదరాబాద్ నుంచి అన్ని కార్యాలయాలు తరలి రావడం, ఉద్యోగులు కూడా రాష్ట్రం బాట పట్టడంతో నివాస గృహాల కొరత ఏర్పడింది. దీంతో రియల్ రంగం పుంజుకొని స్థిరాస్థి వ్యాపారాలు ఆశాజనంగా ఉన్నాయి. చిన్నపాటి రియల్ ఎస్టేట్ సంస్థలు కూడా విస్తృతమైన మార్కెటింగ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకొని వ్యాపార విస్తరణ నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే మార్కెటింగ్ సిబ్బంది, ఖాతాదారులను ఆకర్షించేందుకు నూతన సంవత్సర ఆగమన వేళను పురస్కరించుకొని భారీ ఎత్తున విందు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెపుతున్నారు. మరో ఐదు నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో పోటీకి సిద్ధమవుతున్న నేతలు కూడా పెద్ద ఎత్తున పార్టీలు ఏర్పాటు చేశారు. కళ్యాణ మండపాలు, ఇతరత్రా హాల్స్‌ను అద్దెకు తీసుకొని విందు కార్యక్రమాలు నిర్వహించారు. కొందరు నేతలైతే మామిడి తోటలు, ఫామ్‌హౌస్‌లలో భారీ ఎత్తున పార్టీలు ఏర్పాటు చేశారు. ఒకరికి మించి మరొకరు పోటీలు పడి పార్టీలు ఏర్పాటు చేయడంతో మద్యపాన ప్రియులు కూడా ఖుషీగా ఎంజాయ్ చేశారు. మద్యం అమ్మకం వేళలను అర్ధరాత్రి వరకు పొడిగించడం కూడా కలిసొచ్చిందని చెపుతున్నారు.

దేశ రాజధానితో
నవ్యాంధ్ర అనుసంధానం

• పలు కొత్త రైళ్లకు శ్రీకారం
• ఏపీకి దక్షిణమధ్య రైల్వే ప్రాధాన్యం



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో రైలు ప్రయాణం ద్వారా తాము కోరుకున్న ప్రదేశాలకు వెళ్ళే వినియోగదారులకు గత నాలుగు సంవత్సరాల కాలంలో దక్షిణ మధ్య రైల్వే పలు ప్రయోజనాలను కల్పించిందని ఉన్నత స్థాయి అధికారులు ప్రకటించారు. కొత్త రైళ్ళను ప్రవేశపెట్టడంలో, రైళ్ళ పొడిగింపు విషయంలో, కొత్త స్టాపులకు అనుమతులను మంజూరు చేయడంలో దక్షిణమధ్య రైల్వే ఆంధ్రప్రదేశ్‌కు అత్యంత ప్రాధాన్యత నిచ్చిందని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అధికారులు పేర్కొన్నారు. 2014-18 సంవత్సరాల మధ్య కాలంలో తెలుగు రాష్ట్రాల పరిధిలో తిరిగే రైళ్ళ సంఖ్యను పెంచడంతోపాటు నవ్యాంధ్రను దేశ రాజధాని ఢిల్లీతో అనుసంధానం చేయడానికి కూడా కొన్ని రైళ్ళను ప్రవేశపెట్టినట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా విశాఖపట్నం- కొత్త ఢిల్లీ- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టామని, -22415/22416 ఎక్స్‌ప్రెస్‌లు నవ్యాంధ్రను అనుసంధానిస్తూ రైల్వే వినియోగదారులకు ప్రయాణానికి సంబంధించి ఎంతో వెసులుబాటు కలుగుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కొత్తరాజధాని అమరావతి సచివాలయ ఉద్యోగుల సౌకర్యం కోసం 12795/12796 ఎక్స్‌ప్రెస్‌లను ప్రవేశపెట్టి సికింద్రాబాద్-విజయవాడ, విజయవాడ-సికింద్రాబాద్ మధ్య కేవలం 5.30 గంటల్లోనే గమ్యం చేరుకునే విధంగా ఇంటర్ సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ లను నడపడంతో ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపరిధిలో దూరంగా ఉన్న ధర్మవరం, తిరుపతి లాంటి స్టేషన్లతో అనుసంధానమయ్యేలా కొత్త రైలు నెంబర్17215/17216ను ప్రవేశపెట్టామని, విజయవాడ-ధర్మవరం మధ్య ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్, రైల్ నెంబర్ 22708/22707 తిరుపతి-విశాఖపట్నం-తిరుపతి ట్రైవీక్లీ డబుల్ డెక్కర్ బండిని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జమ్మూకాశ్మీర్‌లోని కాట్రా సమీపంలో ఉన్న వైష్ణవీ మాత దేవాలయంతో అనుసంధానించే కొత్త రైలు నెంబర్ 22705/22706 తిరుపతి-జమ్ము-తిరుపతి హమ్‌సఫర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను నడుపుతునట్లు తెలిపారు. రాయచూర్,కర్నూలు టౌన్‌కు విజయవాడ ద్వారా కాకినాడ ప్రాంతాన్ని అనుసంధానించడానికి ప్రత్యేక రైలు నెంబర్ 07245/07246 కాకినాడ-రాయచూర్ ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్, రైలు నెంబర్ 07238/07237 కాకినాడ- కర్నూలు టౌన్ బై వీక్లీ స్పెషల్‌ను నడుపుతునట్లు తెలిపారు. ఈ రెండు ఎక్స్‌ప్రెస్‌లు రాయలసీమ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని అమరావతితో కలుపుతాయని వారు తెలిపారు. 2015లో జరిగిన గోదావరి పుష్కరాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు భక్తుల సౌకర్యార్థం 407 ప్రత్యేక రైళ్ళను నడపడంతో పాటు అప్పటికే నడుస్తున్న పలు రైళ్ళకు 1300 అదనపు భోగీలను జతచేసి ప్రయాణికులకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

ఆ మరుసటి సంవత్సరం జరిగిన(2016) కృష్ణా పుష్కరాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు 458 ప్రత్యేక రైళ్ళను నడపడంతో పాటు పలు రైళ్ళకు 3000 అదనపు భోగీలను కూడా జతచేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల (2018 డిసెంబర్)లో అంతర్జాతీయ మహ్మదీయ మేళా 'ఇత్జ్‌మా' సందర్భంగా కర్నూలు టౌన్‌కు 15 ప్రత్యేక రైళ్ళను నడిపామని, మొత్తం మీద గత నాలుగు సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్ అనుసంధానం అయ్యేలా 11 కొత్త రైళ్ళను దక్షణ మధ్య రైల్వే ప్రవేశపెట్టిందని ఆ ప్రకటనలో వివరించారు.

స్త్రీనిధి పథకం సూపర్ సక్సెస్

• దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో రుణం
• మంత్రి పరిటాల సునీత



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రం లోని మహిళల సర్వతోముఖాభివృద్ధి కి పెద్దపీట వేస్తూ టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీనిధి పథకం మహిళలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత మంగళవారం తెలియజేశారు. మహిళల ఆర్థిక స్వాలంభనే లక్ష్యంగా దశాబ్దాల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూతను అందిస్తూ స్త్రీ నిధి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందన్నారు. ఈ నిధి ద్వారా ఆర్థిక సాయం కోసం ధరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో భీమాతో కూడిన రుణాలను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నామని, ఇదే ఒరవడిని నూతన సంవత్సరంలో కూడా కొనసాగిస్తున్నామని తెలిపారు. దళారులకు, మధ్యవర్తులకు ఎటువంటి ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు రుణాలను అందించడం జరుగుతోందన్నారు. స్త్రీ నిధి పథకం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత వైఎస్ ప్రభుత్వ హయాంలో 5.69 లక్షల మంది డ్వాక్రా మహిళలకు కేవలం రూ.975 కోట్ల రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. కానీ కేవలం 13 జిల్లాలతో కూడిన నవ్యాంధ్రలో చంద్రబాబు ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో 16.77 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.4,313 కోట్ల వడ్డీలేని రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే గత పాలకులు రూ.57.99 కోట్లు వడ్డీ రాయితీ ఇవ్వగా, టీడీపీ ప్రభుత్వం రూ.238.49 కోట్లను వడ్డీ రాయితీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మహిళా సాధికారతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న టీడీపీ ప్రభుత్వం పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు.

ఉద్యోగుల విభజనలో
చొరవ తీసుకుంటా: గవర్నర్

గవర్నర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి రాష్ట్రాల ఉద్యోగుల విభజన అంశాన్ని పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని గవర్నర్ నరసింహన్ చెప్పారు. దీనిపై త్వరలో ఒక సమావేశాన్ని నిర్వహించి సమస్యను కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. హైకోర్టు విభజనతో ఉభయ రాష్ట్రాలకు సంబంధించిన అన్ని శాఖలు విడిపోయినందున ఉద్యోగుల విభజన అంశాన్ని ఎప్పుడు పరిష్కరిస్తారని గవర్నర్‌ను ఒక విలేకరి ప్రశ్నించగా, పై విధంగా స్పందించారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాజ్‌భవన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఉభయ రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలు, శాంతి, సౌభ్రాతృత్వంతో ఐక్యమత్యంగా మసులుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు. అన్ని వర్గాలకు ఈ ఏడాది మంచి జరగాలని, అందరం కలిసి పని చేయాలని కోరారు. గవర్నెన్స్‌లో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో తమ బాధ్యత నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.

గవర్నర్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పుర ప్రముఖులు, సీనియర్ అధికారుల నుంచి సామాన్య ప్రజల వరకు రాజ్‌భవన్‌కు బారులుదీరారు. గవర్నర్ దంపతులకు పట్టు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, బహుమతులు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గవర్నర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఉదయం నుంచే ప్రముఖులు రాజ్‌భవన్‌కు తరలివచ్చారు. హోంమంత్రి మహమూద్ అలీ, బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గవర్నర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని కేడర్ ఉపాధ్యాయులకు
సర్వీసు నిబంధనలు

మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హామీ



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ ఏపీ) రాష్ట్ర శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం తన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి ఉమా మాట్లాడుతూ సర్వీసు నిబంధనలు అన్ని కేడర్ ఉపాధ్యాయులకు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పిఆర్టీయు సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ డి.శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటర్‌నేషనల్ లయన్స్‌క్లబ్ మల్లిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ మూల్పూరి ఉపేంద్ర, పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ రెడ్డి, కృష్ణాజిల్లా కన్వీనర్ ఎ.శ్రీనివాసరావు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పిఆర్టీయు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోడీ హయాంలో పాలన అస్తవ్యస్థం

ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలి: మాజీ మంత్రి కొణతాల

అనకాపల్లి, ప్రభన్యూస్ : ప్రధాని నరేంద్రమోడీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ కావడంతో పాటు పాలన అస్తవ్యస్థంగా తయారైందని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. మంగళవారం గవరపాలెం కొణతాల ఘాట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ పాలనలో ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందన్నారు. విద్య, వైద్యం, ఆదాయ వనరులు, వ్యవసాయ రంగంలో ఈ మూడు జిల్లాలు వెనుకబడ్డాయని, వీటి అభివృద్ధికి కేంద్రం విడుదల చేసిన రూ. 350కోట్లను కూడా వెనక్కి తీసుకోవడం ఈ ప్రాంత ప్రజలపై ఆయనకు ఏపాటి అభిమానం ఉందో స్పష్టమవుతుందన్నారు. రాష్ట్రంలో తీవ్రకరువు వల్ల 50శాతం పంటలకు నీరులేక ఎండిపోయాయని, మిగిలిన 50శాతం పెథాయ్ తుపాన్‌లో నష్టపోయారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. తాను ఏ పార్టీలో చేరేది అతి త్వరలోనే వెల్లడిస్తానని, ఏ పార్టీలో చేరినా ఉత్తరాంధ్ర చర్చావేదిక ద్వారా ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టిసారించే పార్టీ వైపే మొగ్గు చూపుతానని అన్నారు. ఈ సమావేశంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మలసాల కిషోర్, చీడికాడ జెడ్పీటీసీ పి.సత్యవతి, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జమీల్, పీవీజేఆర్ కుమార్ తదితరులు ఉన్నారు.

పర్యాటకానికి అంతర్జాతీయ ప్రాచుర్యం



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకం అభివృద్ధికి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఇస్తున్న ప్రాధాన్యత దృష్ట్యా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రాచుర్యం పొందుతున్నట్లు ఏపీటీడీసీ ఛైర్మన్ ఆచార్య జయరామిరెడ్డి అన్నారు. విజయవాడలోని ఏపీటీడీసీ, భవానీద్వీపం పర్యాటక సంస్థల్లో వేర్వేరుగా నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జయరామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా పర్యాటక రంగం ప్రాధాన్యతా రంగంగా గుర్తింపు పొందుతోందన్నారు. సీఎం ఆలోచలనకు అనుగుణంగా పర్యాటక కార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా, ఏపీటీడీసీ ఎండీ హిమాన్షు శుక్లా తమదైన శైలిలో ప్రతి ఒక్కరినీ కార్యోన్ముఖులను చేస్తున్నట్లు కొనియాడారు. పర్యాటకంలో ఆహార రంగానిదే ప్రధాన పాత్ర అన్నారు. పర్యాటక శాఖకు 20శాతం మేర ఆదాయం సమకూరుతోందని చెపుతూ దీనిని దృష్టిలో ఉంచుకొని ఏపీలో ఆహార పండుగలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపిటీడీసి ఎండీ హిమాను శుక్లా చెప్పారు. ఉద్యోగుల వాస్తవ అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కలిపించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సానుకూల దృక్పధంతో కార్యదర్శి మీనా కూడా ఏపీటీడీసీ, ఏపీటీఎలకు సహకారం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆచార్య జయరామిరెడ్డి, శుక్లా ఆవిష్కరించారు. ఎపిటిఏ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన కాఫీ యంత్రాన్ని ఆచార్య జయరామిరెడ్డి ప్రారంభించారు. వేడుకలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఇవో కృతికా శుక్లా ప్రత్యేక అతిథిగా హాజరుకాగా, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, తిరుమల ప్రసాద్, ఇడి టివిఎస్‌జీ కుమార్, జనరల్ మేనేజర్లు విశ్వనాధం, హరనాథ్, శ్రీదేవి, సుదర్శన్, చీఫ్ ఇంజనీర్ మూర్తి, డాక్టర్ సాంబశివరాజు, మార్కెటింగ్ డైరెక్టర్ మోటూరి శ్రీనివాసరావు, భవానీ ఐలండ్ టూరిజం కార్పోరేషన్ ఇడి ఉమామహేశ్వరావు, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ మల్లిఖార్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ శివరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి బాధితులతో కలెక్టరేట్ల వద్ద ధర్నా

వైకాపా నేతల వెల్లడి



అమరావతి, ఆంధ్రప్రభ : అగ్రిగోల్డ్ యాజమాన్యం మోసంతో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ అగ్రి బాధితులతో ఈనెల 3న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వైసీపీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ నేతలు డైమండ్ బాబు, సుబ్బారెడ్డిలు తెలియజేశారు. మంగళవారం గుంటూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అగ్రి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అగ్రి మోసానికి దాదాపు 19.50 లక్షల మంది రాష్ట్రానికి చెందిన బాధితులు ఉన్నారని, ప్రభుత్వ సహకారం కొరవడంతో ఇప్పటి వరకు 265 మంది బాధితులు బలవర్మరణానికి పాల్పడ్డారని ఆరోపించారు. జనవరి 5వ తేదీ లోగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన టీడీపీ పాలకులు అందుకు మునుపే అగ్రిగోల్డ్ అధిపతులను అరెస్టులు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు బ్రహ్మారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీడి కార్మికులను ఆదుకుంటాం

ఉద్దానం ప్రాంతంలో జగన్ ప్రజాసంకల్పయాత్ర




వజ్రపుకొత్తూరు,పలాస,మందస, ప్రభ న్యూస్‌బ్యూరో: తిత్లీ తుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన జీడి రైతులను, జీడి పరిశ్రమను ఆదుకుంటామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి హామీ ఇచ్చారు. జిల్లాలో 31వ రోజు ప్రజాసంకల్పయాత్రలో భాగంగా జగన్మోహనరెడ్డి పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాలలో పాదయాత్ర నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలంలోని దెప్పూరు గ్రామ శివారులో సోమవారం రాత్రి బసచేసిన శిబిరం నుంచి మంగళవారం ఉదయంజగన్ పాదయాత్ర ప్రారంభించారు. జగన్ పాదయాత్ర ప్రారంభించిన సమయానికి పెద్దఎత్తున జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడకు తరలివచ్చి జగన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అక్కడే జగన్ భారీకేకును కట్‌చేసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీరాంనగర్ కాలనీ లోకి జగన్ చేరుకోగానే అక్కడ స్థానికులు తిత్లీ పరిహారం తమకు అందడంలేదని, పరిహారంగా ఇచ్చిన చెక్కులు చెల్లడంలేదని తమ ఖాతాలలోకి ఒక్క రూపాయి కూడా జమకావడంలేదని బాధితులు తెలిపారు. పాదయాత్రలో జగన్‌తో ప్రజాసంఘాల నాయకులు కలిసి తిత్లీ తుపాన్ సహాయకచర్యలపై మాట్లాడారు. నిజంగా నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోలేదని, పరిహారం పేరుతో పరిహాసం చేస్తోందని జగన్‌కు తెలిపారు. మహేంద్రనది ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నీటిని జంతిబంద వరకూ తరలిస్తే ఉద్దానం ప్రాంతంలో నీటిసమస్య పరిష్కారం అవుతుందని, దానికి తోడు కిడ్నీ వ్యాధులను కూడా నియంత్రించవచ్చని ప్రజాసంఘాల నాయకులు జగన్‌కు తెలిపారు. యాదవ కులసంఘం ప్రతినిధులు జగన్‌ను కలిసి తమకు తెలంగాణాలో అమలుచేసే పథకాలను మన రాష్ట్రంలో కూడా అమలుచేసే విధంగా చూడాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. బహడపల్లిలో జీడిపిక్కల పల్సింగ్ కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులను జగన్మోహనరెడ్డి కలిసి వారి సమస్యలను జగన్ ముందు వల్లెవేశారు. అధునాతన యంత్రాలు తమకు సబ్సిడీపై ఇప్పిస్తే కూలీలకు కూడా మేలు జరుగుతుందని వారు జగన్‌కు తెలిపారు మధ్యాహ్నం భోజన విరామం తరువాత నారాయణపురం గ్రామంలో ప్రతిష్ఠించిన మాజీ ఎంఎల్ఎ జుత్తు జగన్నాయకులు విగ్రహాన్ని జగన్మోహనరెడ్డి ఆవిష్కరించారు.

సీపీఎస్‌ను పద్దు చేయాలని కోరుతూ ఈసందర్భంగా జగన్‌కు పలు ఉద్యోగసంఘాల ప్రతినిధులు వినతిపత్రాన్ని అందచేసారు. ఉద్దానం కిడ్నీ బాధితులను ఆదుకునేందుకుగాను ఈప్రాంతంలోనే ఒక పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక నాయకులు జగన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. వైకాపాఅధికారంలోకి వస్తే కిడ్నీ వ్యాధిగ్రస్థులకు నెలకు 10 వేల రూపాయిల పింఛన్ ఇప్పిస్తామని జగన్ వారికి తెలిపారు. జగన్ వెంట పాదయాత్రలో పార్టీ నాయకులు సీదిరి అప్పలరాజు,దువ్వాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా పాలనకు చరమగీతం

ఏపీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలతో బీజేపీ దుష్పరిపాలనకు చరమగీతం పాడుతామని, రాహుల్ ప్రధాని కావడం తథ్యమని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా వస్తుందని, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. ఏపీసీసీ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో కొత్త సంవత్సర వేడుకలు మంగళవారం జరిగాయి. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, ఏపీసీసీ నాయకులు బాబూరావు, డాక్టర్ జి గంగాధర్, వి గుర్నాధం, మీసాల రాజేశ్వరరావు, ఎంజె రత్నకుమార్ తదితరుల సమక్షంలో తులసిరెడ్డి కేకు కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కాగానే రైతులకు రెండు లక్షలకు రుణ మాఫీ ఖాయమని అలానే ఏపీకి ప్రత్యేకహోదాపై ఆయన తొలి సంతకం చేస్తారని అన్నారు. 2004 నాటి రాజకీయ పరిస్థితి 2019లో పునరావృతం అవుతుందని, అప్పట్లో 'భారత్ వెలిగిపోతోంది' అన్న నినాదంతో ఎన్డీయే ఎన్నికలకు వెళ్లగా 'ఆమ్‌ఆద్మీ' నినాదంతో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ఆ ఎన్నికల్లో పోరాడి ఎన్డీయేను ఓడించి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు.

విజయవాడ డివిజన్‌లో ముమ్మరంగా

రైల్వే డబ్లింగ్, విద్యుదీకరణ పనులు

- మొత్తం 221 కిలోమీటర్ల మేర పనులు
- రూ.1428.70 కోట్ల వ్యయంతో అంచనాలు
- మొత్తం 5 దశల్లో రైలు మార్గాల పనులు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో వేగంగా పురోగమనంలో ఉన్న విజయవాడ - గుడివాడ - భీమవరం - నర్సాపురం, గుడివాడ - మచిలీపట్నం, భీమవరం - నిడదవోలు రైల్వే మార్గాల విద్యుదీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మార్గాలను 2020-21లోగా పూర్తిగా విద్యుదీకరణ చేయాలనే లక్ష్యంతో రైల్వే అధికారులు ముందుకు పోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కోస్తాతీర దేశంలోనే ధాన్యాగారంగా ప్రఖ్యాతి గాంచిన సంగతి విదితమే. ఆ తీర ప్రాంతంలో విజయవాడ నగరం ఆర్థిక రాజధానిగా కూడా ఉంది. విజయవాడ, తీర ప్రాంతంలో రైల్వే వ్యవస్థను విస్తరించడం వల్ల ఆ ప్రాంత సామాజిక, ఆర్థిక రంగాలు అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ మార్గాల్లో శరవేగంగా విద్యుదీకరణ, డబ్లింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ - గుడివాడ, భీమవరం - నర్సాపూర్, గుడివాడ - మచిలీపట్నం, భీమవరం - నిడదవోలు మధ్య విద్యుదీకరణ లేని సింగిల్ రైల్వే మార్గంపై రైళ్లు నడుస్తున్నాయి. ఈ సింగిల్ మార్గం అధిక జనాభా గల ఆ ప్రాంత ప్రజల అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చలేకపోతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని సుదూర తీర ప్రాంతంలో రైల్వే వ్యవస్థను విస్తరించేదిశలో భారతీయ రైల్వే విజయవాడ - గుడివాడ, భీమవరం - నర్సాపూర్, గుడివాడ - మచిలీపట్నం, భీమవరం - నిడదవోలు సెక్షన్‌లో డబ్లింగ్‌తో పాటు విద్యుదీకరణ కూడా చేపట్టాలనే లక్ష్యంతో 221 కిలో మీటర్ల నిడివితో రూ. 1428.70 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులను 2011-12 ఆర్థిక సంవత్సరంలోనే మంజూరు చేయడం జరిగింది. ఇందులో 50 శాతం వాటా వ్యయం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. రివికాస్ నిగమ్ లిమిటెడ్ సంస్థ ఈ ప్రాజెక్టును నిర్వహిస్తుంది. గత నాలుగేళ్ల నుంచి వచ్చే 2019 వరకు ఈ ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు రూ. 623.06 కోట్లు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన నిధులు రూ. 226.65 కోట్లు. ఈ విధంగా ఈ ప్రాజెక్టునకు ఇంతవరకు కేటాయించిన నిధులు రూ. 849.71 కోట్లు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి నిర్ణయించిన లక్ష్యం 2020 - 21గా ఉంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ. 200 కోట్లు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు 28.66 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు పూర్తయ్యాయి. 5 దశల్లో 369 వంతెనల నిర్మాణాలు జరుగుతాయి. మరో 54 వంతెనల నిర్మాణాల పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. మొదటి దశలో ఒక పెద్ద వంతెన నిర్మాణం పూర్తయింది. మరో నాలుగు దశల్లో 4 పెద్ద వంతెనలను నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. రెండవ దశలో నాలుగు పెద్ద వంతెనలు నిర్మించడం జరిగింది. మరో రెండు వంతెన పనులు కొనసాగుతున్నాయి. నాల్గవ దశలో ఒక పెద్ద వంతెనను నిర్మించడం పూర్తయింది. ఐదవ దశలో 3వ వంతెన నిర్మాణం పురోగతిలో ఉంది. మండవల్లి - కైకలూరు మధ్య 7.00 కిలోమీటర్లు, మోటూరు - మండవల్లి మధ్య 12.00 కిలో మీటర్లు, కైకలూరు - ఆకివీడు మధ్య 6.00 కిలో మీటర్లు, పెడన - మచిలీపట్నం మధ్య 4.50 కిలోమీటర్లు, మొత్తం 29.50 కిలోమీటర్ల మేర డబ్లింగ్ పనులు పూర్తి చేయడం జరిగింది. మోటూరు - కైకలూరు సెక్షన్‌లో 19 కిలో మీటర్ల దూరాన్ని 2018 - 19లోనే పూర్తి చేయాలనేది లక్ష్యంగా ఉంది. ప్రాజెక్టును మొత్తం 5 దశల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. విజయవాడ - మోటూరు (51 కిలో మీటర్లు), మోటూరు - భీమవరం టౌన్ (53. 5 కిలో మీటర్లు), భీమవరం టౌన్ - నిడదవోలు (49.75 కిలో మీటర్లు), గుడివాడ - మచిలీపట్నం (36.74 కిలోమీటర్లు), భీమవరం - నర్సాపూర్ మధ్య 29.48 కిలోమీటర్ల మేర పనులు ఈ ఐయిదు దశల్లో చేపట్టాలని లక్ష్యంగా ఎంచుకున్నారు. కాగా మోటూరు - భీమవరం టౌన్ మధ్య రెండో దశ పనులు పురోగమనంలో ఉన్నాయి. ఈ మార్గంలో రెండవ దశ పనులు 2013లో ప్రారంభించారు. మిగిలిన దశల్లోని పనులు 2016లో ఆరంభించారు. ఈ రెండో దశలోనే 4 పెద్ద వంతెనలు పూర్తయ్యాయి. మరో రెండు పెద్ద వంతెనల పనులు వేగంగా జరుగుతున్నాయి. మండవల్లి, కైకూరు, ఆకివీడు స్టేషన్లకు కొత్త భవనాలు నిర్మించడం జరిగింది. మోటూరు స్టేషన్ భవన నిర్మాణం ముగింపు దశలో ఉంది. మండవల్లిలో ప్లాట్‌ఫారం పనులు, వాటి పైకప్పు, పాదచారుల వంతెన నిర్మాణాలు పూర్తయ్యాయి. మోటూరు వద్ద వివిధ పనులు పురోగతిలో ఉన్నాయి. కైకూరు, ఆకివీడు స్టేషన్లలో ప్రస్తుతం సరిపడినన్ని సౌకర్యాలు ఉన్నాయంటున్నారు. యార్డు ఆధునీకరణ, సర్క్యూట్ ఏర్పాట్లు, ఇంటర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. లెవెల్ క్రాసింగ్ గేట్ల నిర్మాణం, ప్యాకింగ్, వెల్డింగ్, ఇతర చిన్న చిన్న పనులను జనవరి 2019లోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

దీనితో మోటూరు - మండవల్లి, కైకూరు - ఆకివీడు (38 కిలోమీటర్లు) మార్గాన్ని రానున్న ఫిబ్రవరి కల్లా పూర్తి చేసి, సిఆర్ఎస్ పరిశీలన కోసం నివేదించనున్నారు. మార్చి 2019లోగా ఈ మార్గం ప్రారంభమవుతుందని సంబంధిత అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకటి, మూడు, నాలుగు, 5వ దశలకు సంబంధించి మట్టి చదును చేసే పనులు, కలకట్ట పనులు, చిన్న వంతెన, పెద్ద వంతెన, ఓవర్ హెడ్ పరికరాల పనులు జరుగుతున్నాయి. విజయవాడ - మోటూరు మార్గాన్ని అక్టోబర్ 2019లోగా పూర్తి చేసే లక్ష్యంతో ముందుకుపోతున్నారు. గుడివాడ - మచిలీపట్నం (4వ దశ), భీమవరం టౌన్ - నర్సాపూర్ (5వ దశ), భీమవరం టౌన్ - నిడదవోలు (6వ దశ) పనులు 2020 లోగా పూర్తి చేయాలని లక్ష్యంతో రైల్వే అధికారులు శ్రమిస్తున్నారు.



అన్ని చోట్లా ఉష్ణోగ్రతల పతనం

- మరో 5 రోజులు చలిగాలుల తీవ్రత

అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగురాష్ట్రాల్లో చలి పులి పంజా విసురుతోంది. రెండు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకి పడిపోతున్నాయి. ఉత్తర ఈశాన్య భారత దేశం నుంచి వీస్తున్న అతి శీతల గాలులతో పలు ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వస్తున్న చలిగాలులు ఈ నెల 6 వరకు వీచే అవకాశం ఉందని స్కైమేట్ వెల్లడించింది. అనేక ఏజెన్సీ ప్రాంతాల్లో మంచు కురుస్తోంది. తీవ్రమైన చలిగాలులతో ప్రజలు వణికిపోతున్నారు. పెథాయ్ తుపాను తర్వాత నుంచి చల్లని గాలులు ప్రజలను వణికిస్తున్నాయి. రాత్రి సమయాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. విశాఖ ఏజెన్సీని చలి వణికిస్తోంది. లంబసింగిలో అత్యల్పంగా జీరో డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదవుతోంది. చింతపల్లిలో 2.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత, పాడేరులో నాలుగు డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయింది. ఏజన్సీ ప్రాంతాల్లో మూడు డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వృద్ధులు, పసిపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలిగాలుల ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ, ఢిల్లీతో పాటు గుజరాత్, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల ప్రజలు చలికి వణుకుతున్నారు. ఏజెన్సీ, పర్యాటక ప్రాంతాల్లో మంచుకురుస్తోందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

ఎన్టీఆర్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయం ఎన్‌టీఆర్ భవన్‌లో మంగళవారం నూతన సంవత్సరం సందర్భంగా ఆ పార్టీ నేతలు కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శులు బండ్రు శోభారాణి, జి.బుచ్చిలింగం, కార్యదర్శి కందిమళ్ల రాఘునాథరావు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు మ్యాడం రామేశ్వరరావు, పెద్దొజు రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం



అమరావతి, ఆంధ్రప్రభ: విభజనతో ఏర్పడిన నవ్యాంధ్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ముడిపడి ఉందని టీడీపీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ జాతీయ కన్వీనర్ వీవీవీ చౌదరి స్పష్టం చేశారు. మంగళవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించిన అనంతరం కార్యకర్తల నడుమ కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం రాజధాని కూడా లేకుండా ఏర్పడిన నవ్యాంధ్రను ముఖ్యమంత్రి చంద్రబాబు తన రాజకీయ అనుభవం, పరిపాలనదక్షతతో అభివృద్ధిపథంలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ సహాయ నిరాకరణ చేస్తున్నా మొక్కవోని ధైర్యంతో అభివృద్ధి, సంక్షేమాలే లక్ష్యాలుగా నిరంతరం శ్రమిస్తూ అనేక రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఏపీని తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబు సొంతమని కొనియాడారు. నూతన సంవత్సరంలో కూడా కార్యకర్తలు, నేతలు రెట్టించిన ఉత్సాహంతో శ్రమించడం ద్వారా క్షేత్రస్థాయిలో టీడీపీ బలోపేతానికి సంపూర్ణ సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేతలు ఏవీ వి.రమణ, గురజాల మాల్యాద్రి, దారపనేని నరేంద్ర, జయరామిరెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, గోళ్ల ప్రభాకర్, కుమార్ చౌదరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో మరిన్ని తెల్ల కార్డులు

- ఆదాయ పరిమితి సడలింపు యోచన
- వచ్చే జన్మభూమిలో కీలక నిర్ణయం

అమరావతి, ఆంధ్రప్రభ : రానున్న సంవత్సరంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెల్లరేషన్‌కార్డులను జారీ చేసేందుకు అర్హత, ఆదాయ పరిమితిని పెంచే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. త్వరలోనే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీచేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 1.5 కోట్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. రానున్న జన్మభూమిలో రేషన్‌కార్డుల కోసం ధరఖాస్తు చేసుకునే వారిలో అర్హులైన వారందరికి కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు సూత్రప్రాయంగా ఆదేశాలు జారీ చేసింది. కాగా తెల్లరేషన్‌కార్డు పొందేందుకు ప్రతిబంధకంగా ఉన్న ఆదాయ పరిమితిని సడలించాలని ప్రభుత్వం యోచిస్తుంది. రాష్ట్రంలో తెల్లరేషన్‌కార్డు జారీకి వార్షిక ఆదాయం రూ. 60 వేలు, పట్టణ ప్రాంతాలలో 75 వేల రూపాయాల లోపు ఉండా లనే నిబంధన ఉంది. దాదాపు రెండు దశాబ్ధాలుగా ప్రభుత్వాలు వార్షిక ఆదాయ పరిమితిని పెంచలేదు. ఇదే సమయంలో ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వలన పేదల ఆదాయం కొంత మేరకు పెరిగింది. రాష్ట్ర తలసరి ఆదాయం కూడా రూ.1.42 లక్షలకు చేరుకుంది. ఆదాయం పెరగటం వలన చాలామంది



తెల్లకార్డులను పొందేందుకు అవకాశం లేకుండా పోతుంది. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం చౌకధరలను నిత్యావసర సరుకుల పంపిణీతోపాటు అనేక రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తోంది.

మరింత మందికి తెల్లరేషన్‌కార్డులు జారీకి అర్హత కల్పించేందుకు వీలుగా వార్షిక ఆదాయ పరిమితిని పెంచే అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డు జారీకి గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 1.2 లక్షల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల రూపాయలకు పెంచే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కావొచ్చని భావిస్తున్నారు. రానున్న జన్మభూమి - మాఊరు సందర్భంగా ప్రభుత్వం ఈ విషయంపై కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. తెల్లరేషన్‌కార్డు జారీ ద్వారా ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూల ధోరణి కలిగి తద్వారా రానున్న ఎన్నికలలో అధికారపార్టీకి లబ్ధిచేకూరుతుందని యోచిస్తున్నారు.

ఇక కౌలు రైతులకు పండగే!

- ఒక్క ఏడాదిలో నాలుగేళ్ల రుణసాయం
- రూ.4,661 కోట్ల అందజేత

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఆర్థికంగా నలిగిపోతున్న కౌలురైతులకు ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకుంది. ఈ ఏడాది కౌలురైతులకు ఖరీఫ్, రబీ సీజన్ల క్రింద ఇప్పటివరకు వివిధ బ్యాంకులు రూ. 4621 కోట్ల పంట రుణాలు ఇచ్చాయి. గత నాలుగు సంవత్సరాల్లో కౌలు రైతులకు రూ. 4662 కోట్ల పంట రుణాలు ఇవ్వగా ఈ ఒక్క ఏడాదిలో ఇప్పటివరకు దాదాపు అంతే మొత్తం ఇవ్వటం విశేషం. కౌలు రైతులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 7500 కోట్ల రుణాలు ఇవ్వాలని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన సాగు అనుకూలత లేక ఖరీఫ్‌లో రైతులు పూర్తిస్థాయిలో పంటలు వేయలేకపోయారు. అలాగే రబీ సీజన్ ముగింపు దశకు వస్తున్నా సుమారు 44శాతం మాత్రమే పంటలు పడ్డాయి. దీంతో బ్యాంకర్లు పంట రుణాల లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఖరీఫ్‌లో 97శాతం లక్ష్యం సాధించగా, రబీలో ఇప్పటివరకు బ్యాంకర్లు 46శాతం మాత్రమే రుణాలిచ్చారు. పంటల సాగులో ఏటా కౌలురైతుల సంఖ్య పెరుగుతున్నందున వీరికి కూడా వ్యవసాయానికి పెట్టుబడి రుణాలివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాంకర్ల కమిటీని ఆదేశించారు. దీంతో సాధారణ రైతులతోపాటు కౌలురైతులకు బ్యాంకర్లు రుణాలిచ్చారు. వంశధార, గోదావరి, కృష్ణా, పెన్నా డెల్టాలలో దళువా వరిసాగు పూర్తయ్యేనాటికి కౌలురైతుల రుణ లక్ష్యాన్ని సాధించాలని బ్యాంకర్ల కమిటీ భావిస్తుంది. ఈ ఏడాది కృష్ణాజిల్లాలో అత్యధిక సంఖ్యలో కౌలు రైతులకు పంట రుణాలు లభించాయి. రుణ మొత్తంలో పశ్చిమ గోదావరి జిల్లా కౌలు రైతులకే అధికంగా దక్కింది. తరువాత స్థానంలో తూర్పు గోదావరి జిల్లా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంవత్సరం ఎల్ఈసీ, సిఓసి కార్డు లున్న కౌలు రైతులు, రైతుమిత్ర, జాయింట్ లయబిలిటి గ్రూపు లకు చెందిన 10, 46, 420 మందికి రూ. 4621.8 కోట్లు పంపిణీ చేశారు. అందులో పశ్చిమ గోదావరి జిల్లాలో 2లక్షల 87 వేల 995 మందికి రూ. 1550.4 కోట్లు ఇవ్వగా, కృష్ణాజిల్లాలో 3,41,151 మందికి రూ. 1360.2 కోట్లు ఇచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 2,49,012 మందికి రూ. 856.8 కోట్లు ఇచ్చారు. అనంతపురం జిల్లాలో అతితక్కువగా 408 మందికి రూ. 4.3 కోట్లు పంపిణీ చేశారు. మొత్తం మీద పరిశీలిస్తే కౌలురైతులకు గడచిన నాలుగేళ్ల రుణసహాయం ప్రభుత్వం చొరవతో ఈ ఒక్క ఏడాదే నాలుగేళ్లంత లభించటం గమనార్హం.



సమగ్ర శిక్షా అభియాన్ క్యాలెండర్ ఆవిష్కరణ

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి

అమరావతి, ఆంధ్రప్రభ: సమగ్రశిక్షా అభియాన్ మండల వనరుల కేంద్రంలో ఎం.ఐ.ఎస్. కో ఆర్డినేటర్లు అందిస్తున్న సేవలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి కొనియాడారు. సమగ్ర శిక్షా అభియాన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సచివాలయంలో ఆమె ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాల్లో ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ అమలు చేయటంతోపాటు, మండల వనరుల భత్యం మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఆమె కో ఆర్డినేటర్లకు హామీ ఇచ్చారు. డిజిటల్ తరగతులు, ఈ హాజరు, చైల్డ్ ఇన్ఫో విషయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారని కో ఆర్డినేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు కోళ్ల ఎరకయ్యనాయుడు, కార్యదర్శి గోపాలకృష్ణయ్య, ట్రెజరర్ హరిబాబు, భవానీ శంకర్, జమున, దివ్య పాల్గొన్నారు. కోఆర్డినేటర్ల సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయంలో పలువురు ఉన్నత అధికారులను కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



తల్లి ఒడికి చేరిన బాలుడు



- కిడ్నాప్ కథ సుఖాంతం

తిరుపతి, ప్రభన్యూస్: తల్లి ఒడి నుంచి వేరుకాబడి అదృశ్యమైన చిన్నారి బాలుడు ఎట్టకేలకు నూతన ఏడాది రోజున తన తల్లి ఒడికి చేరుకున్నాడు. తిరుమలలో గత నెల 27న బాలుని ఓ ఆగంతకుడు కిడ్నాప్ చేసిన విషయం విధితమే. ఈ కేసును పోలీసులు ఎట్టకేలకు చేధించి ఆ బాలుని తల్లిదండ్రులకు చేర్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను తిరుపతి అర్బన్ ఎస్పీ అన్బురాజన్ మంగళవారం మీడియాకు వివరించారు. ఎస్పీ వివరాల మేరకు.. మహారాష్ట్ర లాతూర్ జిల్లాకు చెందిన ప్రశాంత్ జీ యాదవ్(46), అతని భార్యస్నేహ, అతని కుమారుడు వీరేష్ (18 నెలలు)తో కలిసి శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం గత నెల 27న తిరుమల చేరుకున్నారు. ఆ రోజు రాత్రి మండపం వద్దకు వెళ్లి వారి లగేజి బ్యాగ్‌లను పక్కనపెట్టుకుని తన కుమారుడు వీరేష్‌ను ఇరువురి మధ్యలో పడుకోబెట్టుకుని నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం సుమారు 7.45 గంటలకు లేచి చూడగా వీరేష్ కనపడలేదు. దీంతో వారు వెంటనే తిరుమల టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే స్పందించి తిరుమల తిరుపతిలోగల సుమారు 33 సీసీ కెమెరాలను పరిశీలించగా ఒక అనుమానాస్పద వ్యక్తి సదరు పిల్లవాడు వీరేష్‌ను అపహరించి తీసుకుని వెళ్లినట్లు గుర్తించారు. కిడ్నాపర్ ఊహా చిత్రం, కిడ్నాప్ అయిన బాలుడి చిత్రాలు విస్తృతంగా ప్రచారం చేసి సరిహద్దు రాష్ట్రాలు, జిల్లాలలో అప్రమత్తం చేశారు.

కాగా గత నెల 30వ తేదీన కిడ్నాపర్, కిడ్నాప్ చేసిన బాలుడితో మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మహుర్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రేణుకాదేవి ఆలయం వద్ద అనుమానాస్పద రీతిలో సంచరిస్తుండగా, మహుల్ పోలీసులు అనుమానితున్ని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అనుమానితుడు తాను కిడ్నాప్ చేసినట్లు అంగీకరించాడు. ఈ కేసు చేధించడంలో విశేష కృషి కనబరచిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి అర్బన్ ఎస్పీ అన్బురాజన్ రివార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో విశేష ప్రచారం కల్పించి ఈ కేసును చేధించుటకు కృషి చేసిన పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

రాహుల్ రుణమాఫీ ప్రకటనతో

మోడీ ఉలికిపాటు

- పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి



మడకశిర, ప్రభ న్యూస్: రాహుల్‌గాంధీ రైతుల సమస్యల్ని తెలుసుకున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా రైతు రుణమాఫీ చేస్తానని ప్రకటించడంతో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఉలికిపడుతున్నారని, దీంతో రుణమాఫీ దిశగా బిజెపి ఆలోచిస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అనంతపురంజిల్లా మడకశిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరంలో అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోరే కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోను, రాష్ట్రంలోను రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం గత నాలుగున్నర సంవత్సరాలుగా ఎడాపెడా డీజల్, పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచేసిందన్నారు. 2019 ఎన్నికలలో ప్రజలు, కాంగ్రెస్ మమేకమై ఎన్నికలలో ప్రభంజనం సృష్టిస్తామని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, అక్రం, నాగేంద్ర, మంజునాథ్, దొడ్డయ్య, శ్రీనివాస్ రెడ్డి, నరసింహమూర్తి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి

- మంత్రి శిద్దా రాఘవరావు శుభాకాంక్షలు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆ దేవదేవుని ఆశీస్సులుండాలని, అంతే కాక ప్రజలకు పరమాత్మ ఆయురారోగ్యాలివ్వాలని, నూతన సంవత్సరంలో తెలుగు ప్రజలందరూ సుఖసంతోషాలతో అలరారాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు ఆకాంక్షించారు. మంత్రి రాఘవరావు మంగళవారం ఒంగోలులోని తన నివాసంలో 2019 నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రజల మధ్య ఘనంగా నిర్వహించారు. వీరందరి సమక్షంలో మంత్రి తన కుటుంబ సభ్యులతో కలసి కేక్ కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నారని, తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు మరింత మద్దతునందించాలని రాఘవరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శిద్దా సతీమణి లక్ష్మీ పద్మావతితో పాటు శాసన మండలి సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్, జిల్లా కలెక్టర్ వి.వినయ్‌చంద్, జాయింట్ కలెక్టర్లతో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మరో 2.5 టీఎంసీల నీరివ్వండి

- సీఎంకు సీపీఐ కార్యదర్శి రామకృష్ణ లేఖ



అమరావతి, ఆంధ్రప్రభ: గత ఏడాదికి మించిన రీతిలో తీవ్ర దుర్భిక్షపరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అనంతపురం జిల్లాలోని పెన్నా ఆహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడికాలువ కింద చెరువులన్నింటినీ నింపేందుకు 2.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఒక లేఖ వ్రాశారు. రాష్ట్రంలోని 347 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం అనంతపురం జిల్లాలోని అన్ని మండలాలను కరవు మండలాలుగా ప్రకటించిందని రామకృష్ణ గుర్తు చేశారు. గత సంవత్సరం కూడా 2.5 టీఎంసీల నీటిని విడుదల చేసి పిఎబిఆర్ కుడి కాలువ కింద అన్ని చెరువులను నింపార్నారు, తక్షణమే మరో 2.5 టీఎంసీల నీటిని విడుదల చేసి ఈ రిజర్వాయర్ కుడి కాలువ కింద ఉన్న చెరువులన్నింటినీ నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు.

హామీలు అమలు చేసే మంచి మనసుండాలి

కనీసం 2019వ సంవత్సరంలోనైన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీలను అమలు చేసే సహృదయం కేంద్రంలోని ఏన్డీఏ ప్రభుత్వానికి కలగాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ అకాంక్షించారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ మంగళవారం నాడు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలందరూ శాంతి, సౌభ్రాతృ త్వాలతో, లౌకికతత్వాలతో, స్వేఛ్ఛ, సమానత్వలతో అనందంగా మెలగాలని రామకృష్ణ అభిలషించారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం


- ఆర్టీసీ చైర్మన్ వర్లరామయ్య



అమరావతి, ఆంధ్రప్రభ: కార్మికుల సంక్షేమం కోసమే ఆర్టీసీ అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందని భవిష్యత్తులో వారికి పూర్తి అండదండలు అందిస్తామని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య స్పష్టంచేశారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం ఆయన విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఆర్టీసీ హౌస్‌లో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వి సురేంద్రబాబుతో కలిసి కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ సురేంద్రబాబు దార్శనికతతో ఆర్టీసీ సంస్థ గత సంవత్సరం గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. కార్మిక నేతలు, కార్మికులు సమన్వయంతో ఒకటిగా కలిసి పనిచేసినందున ఈ ఘనత సాధించగలిగామని, యాజమాన్యంతో స్నేహంగా ఉంటేనే కార్మికుల శ్రేయస్సు సాధ్యపడుతుందని వ్యాఖ్యానించారు. అనంతరం సంస్థ ఎండీ సురేంద్రబాబు మాట్లాడుతూ 2018లో కార్మికుల సంక్షేమం కోసం అనేక మార్పులు తీసుకొచ్చామని, సిబ్బంది అంతా కష్టపడి పనిచేయడం వల్లనే నష్టాలను తగ్గించగలిగామన్నారు. కార్మికులు సంతోషంగా ఉంటేనే సంస్థ అభివృద్ధిలోకి వస్తుందని, ఐక్యమత్యంతో కార్మికులందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఈ ఏడాది ఆర్టీసీ లాభాల బాట పట్టే ఆస్కారం ఉందన్నారు. కార్మిక నేతలందరూ యాజమాన్యంతో సత్సంబంధాలు కలిగి ఆర్టీసీ సంస్థ అభివృద్ధికోసం, కార్మికుల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కొత్తసంవత్సరంలో సంస్థ సిబ్బంది సంతోషంగా, ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఆర్టీసీ హౌస్ సిబ్బంది, కార్మిక నేతలు పాల్గొని చైర్మన్, వైస్ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు కుప్పంకు ముఖ్యమంత్రి

జన్మభూమి కార్యక్రమాలలో పాల్గొననున్న చంద్రబాబునాయుడు



తిరుపతి, ప్రభన్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేటి నుంచి ప్రారంభం కానున్న జన్మభూమి కార్యక్రమం లో పాల్గొనే నిమిత్తం సీఎం సొంత నియోజకవర్గమైన కుప్పం నియోజ కవర్గానికి బుధవారం రానున్నారు. ముఖ్యమంత్రి కుప్పంకు బుధ వారం ఉదయం 10.30 గంటలకు చేరుకోను న్నారు. అటు తర్వాత జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని ఎన్టీఆర్ స్టేడి యంలో జరిగే జన్మభూ మి సమా వేశంలో ప్రసంగిస్తారు. కుప్పంలో ముఖ్యమంత్రి జన్మభూమి కార్యక్రమ పర్యటన ఏర్పాట్లు విజయవంతమయ్యేందుకు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న గత రెండు రోజులుగా కుప్పంలోనే మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సీఎం నేడు 75 వేల మంది లబ్ధిదారులకు సంబంధించి రూ. 512 కోట్ల ఆస్తులను పంపిణీ చేయను న్నట్లు తెలిపారు. అదేవిధంగా సీఎం బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం రాత్రికి కుప్పంలోనే బసచేసి 3వ తేదిన జరిగే పలు కార్యక్రమాలకు సంబంధించి సీఎం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

సచివాలయంలో సందడి!

సీఎస్ సమక్షంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంగ్ల సంవత్సరాది జవరి 1ని పురస్కరించుకుని నూతన సంవత్సర వేడుకలను సచివాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడం తోపాటు వారి ఉన్నతాధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనీల్ చంద్ర పునేతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పలువురు ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు సీఎస్‌ను కలిసి శుబాకాంక్షలు తెలియజేశా రు. అలాగే రాష్ట్రకార్మికశాఖా మంత్రి పితాని సత్యనారాయణ సీఎస్‌ను కలిసి నూతన సంవత్సర శుబాకాంక్షలు తెలియజేశా రు. ఆయనతోపాటు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మన్మోహన్ సింగ్, అనంతరామ్, పూనం మాలకొండయ్య, ముఖ్యకార్యదర్శులు ఎస్ఎస్ రావత్, గోపాల కృష్ణ ద్వివేది, రవిచంద్ర, విజయానంద్, కరికల వలవన్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్, కార్యదర్శి రాజశేఖర్, విజిలెన్స్ కమిష నర్ గౌతమ్ సవాంగ్, ఫైర్ సర్వీసెస్ డీజీ సత్యనారాయణ, సీఎస్ ఓఎస్డీ వెంకట కృష్ణ, ఆకార్యలయ సిబ్బంది సీఎస్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధం గా ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడు అశోక్ బాబు, సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు మురళీకృష్ణ, ఉద్యోగ సంఘాల సభ్యులు, స్టేట్ బ్యాంక్ డీజీఎం అరుణ్ కుమార్‌సాహూ తోపాటు పలువురు సీఎస్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సచివాలయా నికి విచ్చేసిన మంత్రులు నక్కా ఆనందబాబు, పితాని సత్య నారాయణలను పలు అధికారులు, ఉద్యోగులు కలిసి శుభా కాంక్షలు తెలిపారు. కాగా, ప్రతిఏటా నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయానికి విచ్చేసి ఉద్యోగులు, సందర్శకుల నుండి శుభాకాంక్షలు అందుకుని వారితో ఫోటోలు తీసుకోవడం ఆనవాయితీగా ఉండేది. అయితే ఈ ఏడాది ముఖ్యమంత్రి సచివాలయంలో సాయంత్రం నాలుగు గంటలకు చివరి శ్వేత పత్రం విడుదల చేయనున్నట్లు తొలుత ప్రకటించినా అర్థాంతరంగా ఆ కార్యక్ర మాన్ని ప్రజా వేదికకు మార్చారు. దీంతో సీఎంను కలిసేందు కు వచ్చిన సందర్శకులు, అదేవిధంగా అధికారులు నిరుత్సా హానికి గురయ్యారు. సంవత్సరం మొదటి రోజు సీఎం చంద్రబాబునాయుడు సచివాలయానికి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

యువత కేరింతల నడుమ
ఆకట్టుకున్న జల్లికట్టు

చంద్రగిరి మండల పరిధిలో ప్రారంభమైన జల్లికట్టు



తిరుపతి రూరల్, ప్రభన్యూస్ : చంద్రగిరి మండల పరిధిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే జల్లికట్టు ఈ ఏడాది ముందుగానే ప్రారంభమైంది. మండలంలోని రంగంపేట గ్రామంలో సంక్రాంతి అనంతరం ఈ జల్లికట్టును అత్యంత వైభవంగా నిర్వ హించడం ఆనవాయితీ. దీన్ని తిలకించడానికి మన రాష్ట్రం నుంచే గాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి అనేకమంది ప్రజలు వస్తుంటారు. అయితే ఈ ఏడాది నూతన సంవత్సరం సందర్భంగా రంగంపే ట జల్లికట్టును తలపించే విధంగా శానంబట్ల గ్రామం లో జల్లికట్టును నిర్వహించారు.

ఉదయం నుంచే మండలంలోని ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ సంఖ్యలో ఈ జల్లికట్టును తిలకించ డానికి శానంబట్ల గ్రామానికి చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు అడవుల్లో వున్న ఆవులను గ్రామంలోకి తరలించి వాటిని అత్యంత సుందరంగా అలంకరించి కొమ్ములకు నగదును కట్టి అనంతరం ఆ ఆవులను జనం మధ్య వదిలారు. పశువులను నిలువరించ డానికి పెద్ద సంఖ్యలో యువత పోటీపడ్డారు. గ్రామ వీధుల్లో ఇరువైపులా క్యూ కట్టిన యువత కేరింతలతో పశువులను అదుపుచేసే ప్రయత్నాలు నిర్వహించారు. ఈ క్రమంలో కొంతమంది యువకులు గాయాల పాలయ్యారు. అయినా పశువులకు కట్టిన నగదు దక్కించుకోవాలనే ఉత్సాహంతో పశువులను నిలువ రించి పోటీలో గెలిచామనే ఆనందంతో ఉరకలేశారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్విరామంగా ఈ జల్లికట్టును నిర్వ హించారు. గ్రామంలో ఎటువైపు చూసినా వేలాదిగా జనం గుమికూడారు. అయితే జల్లికట్టును నియం త్రించాల్సిన పోలీసులు చేతులెత్తేశారు. క్రమంగా గ్రామీణ ప్రాంతాలకు ఈ జల్లికట్టు విస్తరిస్తు న్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం గానీ, పోలీసులు గాని ఈ విషయమై ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేయ కపోవడం గమనార్హం.

నిషేధిత జాబితా భూములకు విముక్తి



- ఆంక్షల తొలగింపునకు మంత్రి కేఈ ఆదేశాలు
- అసైన్డ్ భూముల విక్రయాలకు వెసులుబాటు
- 1.11 లక్షల మంది రైతులు, పేదలకు లబ్ధి

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో 1954 నుండి రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను తొలగిస్తూ రెవెన్యూశాఖ తీసుకున్న నిర్ణయంతో 1,11,571 మంది నిరుపేదలకు లబ్ధి చేకూరునుంది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూ-దేవాదాయ) కేఈ.కృష్ణమూర్తి సంబంధిత దస్త్రాన్ని తక్షణమే సిద్ధం చెయ్యాలని ఆ శాఖ ఉన్నతా ధికారులను ఆదేశించారు. 2018 నవంబరు నెలలో ఇందుకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన కేఈ తాజాగా నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలోని నిరుపేదలు, రైతులకు నిషేధిత భూము లపై ఉన్న ఆంక్షలను తొలగించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు నవంబరు నెలలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలోనూ ఇదే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రెవెన్యూశాఖ తాజాగా తీసుకున్న నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అసైన్డ్ చేయబడిన ఇళ్ల స్థలాలను విక్రయించుకోవడానికి కూడా మరింత వెసులుబాటు కలుగనుంది. సామాన్య ప్రజలు రెవెన్యూ కార్యాల యాల చుట్టూ తిరుగుతున్నందున ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పలు సంస్కర ణలకు శ్రీకారం చుట్టింది. 1954 నాటికి ముందున్న అసైన్డ్ భూములను తక్షణమే రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితానుండి తొలగించాలన్న డిప్యూటీ సీఎం కేఈ ఆదేశాలతో షరతులు లేని ఇళ్లపట్టాలు మంజూరుకు మార్గం సరళమైంది.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రైతులు, నిరుపేదల చేతుల్లో ఉన్న భూములు 22-ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో ఆయా భూములకు సంబంధించిన క్రయవిక్రయాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతూ ఉండేవని, ఇదే అదునుగా భావించిన పలువురు రెవెన్యూశాఖ సిబ్బంది, అధికారులు ముడుపులు తీసుకొని వారికి ఫైళ్లపై చర్యలు తీసుకోవడం జరిగిందన్న విమర్శలు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు వద్ద 1954కు ముందు అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డుల మేరకు తక్షణమే కటాఫ్ తేదీకి ముందు ఉన్న భూములను రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితా నుండి తొలగించి, వాటి పూర్తి వివరాలను తక్షణమే ఆయా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాకు పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

ఇందుకోసం ప్రత్యేకంగా సామాన్యులు ఏఒక్క రూ తమ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించేందుకు ఎలాంటి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని కే.ఈ.కృష్ణమూర్తి స్పష్టం చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అసైన్డ చేయబడిన ఇళ్ల స్థలాలను పిఓటీ యాక్టు ప్రకారం విక్రయించుకొనే అవకాశం లేకపోవడంతో వీరికి ఇప్పుడు వెసులు బాటు కల్పిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీని ద్వారా రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు మరింత లబ్ధి చేకూరనుంది.

వ్యాపారవేత్తలుగా రాజధాని రైతులు

• శిక్షణ అనంతరం ఫీల్డ్ విజిట్ ప్రోగ్రాం • ఏపీసీఆర్డీయే కమిషనర్ శ్రీధర్



అమరావతి ఆంధ్రప్రభ : అమరావతి రాజధాని రైతులను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఏపీసీఆర్డీయే, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆధ్వర్యంలో తొలిబ్యాచ్‌లో 50 మంది రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని సీఆర్డీయే కమిషనర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళవారం సీఆర్డీయే కార్యాలయంలో ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన వారందరికీ, రాజధాని రైతులు, ప్రజలకు ముందుగా కమిష నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శిక్షణ కార్యక్రమం చాలా సులువైన విధానంలో అందరికీ అర్థమయ్యే విధంగా తెలుగులో అన్ని విషయాలు సవివరంగా తెలియచేయ నున్నట్లు కమిషనర్ చెప్పారు. శిక్షణకు వచ్చిన రైతుల్లో లాయర్, మాజీ బ్యాంకర్, టీచర్‌తోపాటు సాధారణ రైతులు పాల్గొనడం ఆహ్వానిం చదగిన పరిణామమ న్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్‌పై ఆయా అంశాల వారీగా ప్రాథమిక శిక్షణ ఏర్పాటు చేశామని, అన్ని అంశాలపై సంపూర్ణ అవగా హన కల్పించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు, వ్యూహాలు, నిపుణుల ద్వారా తెలియచేయ నున్నట్లు తెలిపారు. డిటెయిల్డ్ టెక్నికల్ ఇష్యూలతో మరో విడత శిక్షణకు ప్రణాళిక రూపొందించామని కమిషనర్ వివరించారు. లీగల్, టాక్సేషన్, పర్మిషన్లు, రెరా, ఫైర్ అప్రూవల్ తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, శిక్షణలో భాగంగా రైతులను విజయవాడ పరిసరాల్లోని సంస్థలతో పాటు హైదరాబాద్, పుణె ప్రాంతాల సందర్శనకు ఫీల్డ్ విజిట్ కార్యక్రమం ఏర్పాటు చేశామని, శిక్షణ పూర్తయిన వారికి నాక్ సర్టిఫికెట్ ఇస్తామన్నారు. అమరావతి రైతుల సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం మూడు ఎకరాలు కేటాయించిందని, రాజధాని నగరంలో వచ్చే జూన్‌లో ఐదు స్కూళ్లు ప్రారంభమవుతాయని కమిషనర్ ప్రకటించారు. చిన్మయ, డీఏవి, స్కాటిష్ ఐ, రెండు కేంద్రీయ విద్యాలయాలు ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. నాక్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ నాగరాజు శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన అంశాలను, రెరా ఛైర్మన్ రామ్‌నాథ్ రియల్ ఎస్టేట్ స్కోప్, పొటెన్షియాలిటీ జాగ్రత్తలు తెలియచేశారు. శిక్షణ ప్రారంభం సందర్భంగా రైతుల పరిచయ కార్యక్రమం జరగ్గా శిక్షణలో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రాపర్టీ అభివృద్ధి, ప్రపంచవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ తీరు, అమరావతిలో రియల్ ఎస్టేట్ కేస్ స్టడీ అంశాలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి రైతుల ప్రశ్నలకు, సందేహాలకు నిపుణులు సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఏపీసీఆర్డీయే గ్రూప్ డైరెక్టర్ ఎం శ్రీనివాసబాబా, ఎంపీడీఓ బి శ్రీనివాసరావు తదితరులు కూడా పాల్గొన్నారు.

రాజధాని కార్మికులకు సీఆర్డీయే శుభాకాంక్షలు

ఏపీసీఆర్డీయే కమిషనర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అమరావతిలో కార్మికుల సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. సెక్రటేరియట్ అండ్ హెచ్ఓడి టవర్ల వద్ద మంగళవారంనాడు జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న కమిషనర్ అక్కడ కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాం క్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో నిర్మాణ పనులను ప్రణాళిక ప్రకారం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఎంతో కష్టానికి ఓర్చి నిర్మాణ పనుల్లో పాల్గొం టున్న కార్మికుల ను ఈ సందర్భంగా కమిషనర్ అభినందిం చారు. ఆ తర్వాత ఎల్ అండ్ టి చేపట్టిన టవర్3 రాఫ్ట్ ఫౌండేషన్ కాంక్రీట్ పనులను పరిశీలించాక ఎన్సీసీ చేపట్టిన జీఏడీ టవర్ రాఫ్ట్ ఫౌండేషన్‌కు సంబంధించిన రాడ్లను అమర్చే పనులను పరిశీలించిన కమిష నర్ అక్కడ అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. సీఆర్డీయే సీఈ ఎమ్వీ రావు, ఎస్ఈ జానీబాషా తదితర అధికారులు కూడా ఈ పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సందర్శకుల రాకతో రాజధాని కళకళ

- 17 బస్సుల్లో 8000 మంది రాక
- ఉద్దండరాయునిపాలెం వద్ద కంట్రోల్ రూమ్, భోజన వసతి

అమరావతి, ఆంధ్రప్రభ : అమరావతి రాజధాని నగరం లో వివిధ నిర్మాణాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలు తిలకించేందుకు గాను ఏర్పాటు చేసిన అమరావతి సందర్శన యాత్ర కొత్త సంవత్సరం రోజైన మంగళవారం నాడు ఉత్సాహంగా కొనసాగింది. మొత్తం 800 మంది సందర్శకులు 17 బస్సుల్లో తరలి వచ్చారు. రాజధానిలోని పలు నిర్మాణాలను తిలకించేందుకు గాను విజయనగరం జిల్లా గరుగుబిల్లి, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం, యాదమరి, ప్రకాశం జిల్లా తాళ్లూరు, అద్దంకి, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి అర్బన్, రూరల్, శ్రీకాకుళం జిల్లా రాజాం, విశాఖ జిల్లా ఎస్ రాయవరం, కృష్ణా జిల్లా నూజివీడు, గుంటూరు జిల్లా ఫిరంగిపురం, మేడికొండూరు, కర్నూలు జిల్లా నంద్యాల, అనంతపురం జిల్లా హిందూపురం, లేపాక్షి, కడప జిల్లా ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల నుంచి వచ్చిన 800 మందికి పైగా సందర్శకులకు ఏపీసీఆర్డీఏ అధికారులు స్వాగతం పలికారు. అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్ త్రీడీ మోడల్‌ను ప్రజలకు వివరంగా తెలిపారు. అమరావతి నగర నిర్మాణ విశేషాలు, విశిష్టతలను కూడా తెలియజేశారు. సందర్శకులు ఆ తర్వాత సీడ్‌యాక్సిస్ రోడ్డును సందర్శించి విశేషాలు తెలుసుకున్నాక మందడంలో పేదలకు నిర్మించిన గృహాలను పరిశీలించారు. రాయపూడి దగ్గర నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఏఐఎస్ అధికారుల నివాస పనులను తర్వాత పార్కు రోడ్‌లో నిర్మాణంలో ఉన్న బంగ్లాలు, హెచ్ఓడీ అండ్ సెక్రటేరియట్, ఉద్యోగుల ఛాంబర్లను, అసెంబ్లీని పరిశీలించారు. తుది మెరుగులు దిద్దుకుంటున్న జ్యూడీషియల్ కాంప్లెక్స్ దగ్గర సందర్శకులు ఫొటో



సెషన్‌లో పాల్గొన్నారు. ఎన్జీఓ, గెజిటెడ్, గ్రూప్ డి నివాసాల పనులను పరిశీలించాక ఐకానిక్ భవనాలైన అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణ ప్రదేశాలను వీక్షించారు. వెలగపూడి సెక్రటేరియట్‌ను, వివిధ రోడ్ల నిర్మాణ పనులను చూశారు. ప్రత్యేక బస్సుల్లో తరలి వచ్చిన ప్రజల కోసం ఉద్దండరాయునిపాలెం వద్ద సీఆర్డీఏ ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్‌ని ఏర్పాటు చేసింది. సందర్శకులు భోజనాలు చేసేందుకు అక్కడే ఏర్పాట్లు చేసి అక్కడ వైద్య శిబిరాన్ని కూడా నిర్వహించారు. సందర్శకులకు రాజధాని విశేషాలు తెలియచేసేందుకు సిబ్బందిని అధికారులు ఏర్పాటు చేశారు. సీఆర్డీఏ కమిషనర్ శ్రీధర్, అదనపు కమిషనర్ సగిలి షణ్మోహన్ సందర్శకులకు సౌకర్యాల పర్యవేక్షణతో పాటు అన్ని విశేషాలు తెలియజేసేలా సిబ్బందికి తగిన విధంగా సూచనలు చేశారు.

కొత్త సంవత్సర వేడుకల్లో క్రీడాలోకం

ఉత్సాహంగా పాల్గొన్న ప్రముఖ క్రీడాకారులు

క్రీడాప్రభ







చూస్తుండగానే 2019 వచ్చేసింది. గెలుపు ఓటములు క్రీడల్లో మామూలే... కొత్త ఏడాది తమకు నూతన ఉత్సాహాన్నిచ్చిమరిన్ని విజయాలను అందించాలని ఆశిస్తూ.. 2019ని స్వాగతిస్తూ.. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ క్రీడాకారులు కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు. 2018కి కృతజ్ఞతలు తెలుపుతూ.. ప్రపంచ వ్యాప్తంగా స్పోర్ట్స్ స్టార్లు తమదైనా పంథాలో కొత్త ఏడాదికి స్వాగతం పలికారు. కొంతమంది క్రీడాకారులు తమ కుటుంబాలతో కలిసి నూతన ఏడాది వేడుకల్లో పాలుపంచుకోగా, కొంతమంది ఆటగాళ్లు ఆ మధుర క్షణాలను ఫొటోలను, వీడియోలను తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేసి ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న క్రీడలను పరిశీలిస్తే.. భారత్, ఆస్ట్రేలియాలు పరస్పరం తలపడుతూ.. జనవరి 3న ప్రారంభం కానున్న నాలుగో టెస్ట్‌కు సిద్ధమవుతుండగా, టెన్నిస్ క్రీడాకారులు మరోవైపు ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్‌కు సమాయత్తమవుతున్నారు. పాత ఏడాదిలో ప్రారంభమైన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్, ఫుట్‌బాల్‌సీజన్ కొత్త ఏడాదిలో కొనసాగుతోంది.

ప్రపంచ వ్యాప్తంగా అంబరాన్నంటిన 2019 సంవత్సరాది సంరంభంలో క్రీడాకారులు పాలుపంచుకున్నారు. క్రికెట్ స్టార్స్ విరాట్ కోహ్లీ, శిఖర్ ధావన్, ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో, టెన్నిస్ క్రీడాకారుడు రోజర్ ఫెదరర్ నూతన ఉత్సాహంతో కొత్త ఏడాదిని స్వాగతించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత జట్టు గురువారం నుంచి సిడ్నీలో ఆడనున్న నాలుగో టెస్ట్‌కు సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో కెప్టెన్ విరాట్ కోహ్లీ అక్కడే తన భార్య అనుష్క శర్మతో కొత్త సంవత్సర వేడుకల్లో పాలుపంచుకున్నాడు. టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్ తన అభిమానులకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ.. ఒక వీడియోను పోస్ట్ చేయగా, భారత బ్యాడ్మింటన్ స్టార్, ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్న సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ జంట 2019 సంవత్సరం ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న ఫొటోలను సామిజిక వెబ్‌సైట్లో పోస్ట్ చేశారు. సిడ్నీలో భారత క్రికెట్ జట్టు సభ్యులు కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. విరాట్ కోహ్లీ నేతృత్వంలో ఈ వేడుకలను భారత ఆటగాళ్లు ఉత్సాహంతో జరుపుకున్నారు. భారత జట్టు 2018 ఆస్ట్రేలియా జట్టుపై చిరస్మరణీయమైన విజయాలతో ముగించింది. శిఖర్ ధావన్ 2018 బెస్ట్ మూమెంట్స్‌ను వీడియోలను పోస్ట్ చేశాడు. రోజర్ ఫెదరర్, మారియా షరపోవా కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ.. తమ అభిమానులకు శుభాకాంక్షలు తెలుపుతున్న వీడియోలను పోస్ట్ చేయగా, నొవాక్ జకోవిచ్ కూడా అందరికి శుభాకాంక్షలు తెలుపుతున్న వీడియోలను పోస్ట్‌చేశాడు.

నృత్యాలతో పీబీఎల్ జట్లు స్వాగతం

భారత్ ఆతిథ్య మిస్తున్న ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ సీజన్ 4 టోర్నీలో పాల్గొంటున్న జట్ల ఆటగాళ్లు జనవరి 31 రాత్రంతా డ్యాన్సులు చేస్తూ.. కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. కొత్తగా పెళ్లైన సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ దంపతులు కలిసి 2019 సంవత్సరాన్ని స్వాగతించారు. సింధు పీబీఎల్ జట్టు ఆటగాళ్లతో కలిసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది.

♦ అందరికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు, అద్భుతమైన ఏడాది మీ అందరికోసం ఎదురుచూస్తోంది. దేవుడి కృప మీ అందరిమీద ఉండుగాక - కోహ్లీ-అనుష్క దంపతులు .

♦ 2018లో కొన్ని మధుల స్మృతులను ఇచ్చింది. 2019 మరింత ఉత్సాహంగా, తేజోమయంగా ఉండాలని కోరుతూ.. మీ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు- శిఖర్ ధావన్

♦ 2018లో నాకు ప్రోత్సాహాన్నించిన మీ అందరికి నా ధన్యవాదాలు. మీరు ఎక్కడెక్కడో కొత్త సంవత్సర వేడుకులు జరుపుకుంటున్నారు. మీ అందరితో ఇదే విధంగా కొనసాగుతూ జీవితాంతం ఇటువంటి అనుభవాలను పొందాలనుకుంటున్నాను.- నొవాక్ జకోవిచ్

♦ నూతనోత్సాహంతో కొత్త సంవత్సంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మీ అందరికి నా శుభాకాంక్షలు- రోజర్ ఫెదరర్

♦ స్పెయిన్‌కు చెందిన కరోలినా మారిన్ పీబీఎల్‌లో పుణె 7 ఏసెస్ తరపున ఆడుతోంది. కొత్త ఏడాదికి తన సహచర జట్టు క్రీడాకారులతో కలిసి కొత్త ఏడాదికి స్వాగతం పలికింది. 2019కి స్వాగతం.. ఈ ఏడాదంతా ఇదే ఉత్సాహంతో సాగాలని కోరుకుంటున్నాను. - కరోలినా మారిన్

♦ రెండు సార్లు ఒలింపిక్ పతకాలను గెలిచిన రెజ్లర్ సుశీల్ కుమార్ 2019కి ఉత్సాహంగా స్వాగతం పలికాడు. అభివమానులకు శుభాకాంక్షలు తెలిపాడు. కొత్త ఏడాది వేడులకు మన పిల్లలతో జరుపుకోవడం ఉత్తమమైనది. వారి అమాయకత్వం మనకు అంతులేని ఆనందాన్నిస్తుంది. ఈ ఏడాది కూడా మరిన్ని విజయాలను, ఆనందాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాను -సుశీల్ కుమార్

జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్

ఢిల్లీ, పంజాబ్ బాక్సర్ల జోరు

విజయనగరం: జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల రెండో రోజున మంగళవారం చండీగఢ్, ఢిల్లీ, పంజాబ్ బాక్సర్లు అత్యధిక విజయాలు సాధించారు. ఢిల్లీకి చెందిన రియా తొకాస్ 54 కిలోల విభాగంలో వి వినోధిని(తమిళనాడు)ను 5-0తో ఓడించింది. రియా తర్వాత రౌండ్లో వరల్డ్ చాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనలిస్ట్ మనీషా మౌనితో తలపడనుంది. సోహిని(చండీగఢ్) బాక్సర్ సాయి శ్రీ రెడ్డి(తెలంగాణ)ను 69 కిలోల విభాగంలో ఓడించింది. హోరాహోరీగా సాగిన మరో పోటీలో బబిత బిస్త్ (ఉత్తర ఖండ్) 3-2తో సుమన్ ఖోడా(రాజస్థాన్)పై గెలిచింది. 60 కిలోల విభాగంలో భావ్య(కర్నాటక) 4-1తేడాతో సోమ్ మాయ సుబ్బ(సిక్కిం)పై విజయం సాధించింది. రియా చౌహాన్(పంజాబ్)సంద్య(హిమాచల్ ప్రదేశ్)లు ఈ రోజు జరిగిన పోటీల్లో గెలిచి తర్వాత రౌండ్లకు అర్హత సాధించారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.



L ively
I nteraction
F or
E ver

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్ I

బుధవారం 2 జనవరి 2019

యాప్త మిత్రులు

నూతన సంవత్సరంలో నయా జిందగీ కోసం యాపులు

ప్రతీ ఏడాది న్యూ ఇయర్ రోజున... కొత్త జీవితం ఆరంభించాలని, నూతన జీవనశైలి పెంపొందించుకొని పాత అలవాట్లను మానేసి, కొత్త హాబీలు అవలంబించాలని దాదాపు ప్రతీ ఒక్కరు భావిస్తారు, అలాగే ప్రతీ సంవత్సరం ప్రయత్నిస్తారు. 2019 లో కూడా బరువు తగ్గాలని, వ్యాయాయం చేయాలనీ, యోగా నేర్చుకోవాలని, కొత్త పుస్తకాలు, సాహిత్యం చదవాలని ఇలాంటి నిర్ణయాలు ఎన్నో తీసుకుంటూ ఉంటారు. డబ్బు ఆదా చెయ్యాలని పెద్దలు అనుకుంటే, ఇక నుంచి కొంచెం సీరియస్‌గా కష్టపడి చదువుకోవాలని, కొత్త హాబీలు నేర్చుకోవాలని విద్యార్థులు తీర్మానించుకుంటారు. అయితే అత్యధికమంది తీసుకున్న కొత్త సంవత్సరం నిర్ణయాలు మూడునాళ్ళ ముచ్చటగా, నీటి మీద రాతల్లా మిగిలిపోతాయి. అలాకాకుండా తీసుకున్న నిర్ణయాల అమలుకు తోడుగా నిలిచే వివిధ యాప్‌లు ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకోసమున్నాయి. విఘ్నాలు వచ్చినా మనం మన ప్రయత్నాలను విరమించుకోకుండా అవి అండగా నిలుస్తాయి. ఇకనేం వాటి సహాయంతో 2019కి శుభారంభం చేద్దాం-

రెజల్యూషన్స్ సృష్టించే యాపులు

2019 నూతన సంవత్సర తీర్మానాలు(రెజల్యూషన్స్) ఎలా చేయాలి, ఏం చేయాలి...అనేది తెలియక తికమక పడేవారి కోసం 100 కి పైగా తీర్మానాల పట్టికతో పాటు... చెడు అలవాట్లను మాన్పించడానికి, మంచి అలవాట్లు చేసుకోడానికి వీలుగా ప్రవర్తనా మనస్తత్వశాస్త్రవేత్తలచే సాక్ష్య ఆధారిత ఉపకరణం ఆధారిత యాపులు కొన్ని ఉన్నాయి. ఈ యాపులను ఉపయోగించి సొంత రెజల్యూషన్ల జాబితాను సృష్టించే ప్రక్రియ చాలా సులభం, పురోగతిని గమనించడం చాల సరళం.

New Year's 2019 Resolutions Make, My New Year's resolutions list, Goal Tracker & Habit List, iCan - New Year Resolution

ఫిట్నెస్ కోసం యాపులు

Calorie Counter - MyFitnessPa
Lose It! - Calorie Counter
Calorie Counter - EasyFit free
Lose Weight in 30 Days

బరువు తగ్గాలని కొందరు, కొవ్వు పదార్థాలు, స్వీట్లు, నూనె వంటకాలను మానేయాలని కొందరు, శారీరక దృఢత్వంతో ఫిట్‌గా ఉండాలని, పోషకాహారం, ప్రోటీన్ ఆహారం, మిల్లెట్స్ ఆహారం తీసుకోవాలని... ఇలా ఎన్నో అంశాలను

తీర్మానించుకుంటారు చాలామంది. ఈ యాపులు బరువు తగ్గాలనుకునేవారికి రోజువారి డైట్ షెడ్యూల్ పంపుతూ, ఆహార అలవాట్లను క్రమేపి మారుస్తూ, ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడతాయి. ఈ యాపుల డేటాబేస్‌లో లక్షల వంటకాలు పొందుపరచి ఉంటాయి. ప్రపంచంలో ఉన్న ఈ వంటకమైనా బార్కోడ్ స్కానర్‌తో సహా పొందుపరచబడ్డాయి. లేనివి మనం కొత్తగా జతచేసుకోవచ్చు. మనం వండుకున్న ఏ పదార్థానికైనా బార్కోడ్ స్కాన్ చేస్తే చాలు... వాటి రెసిపీ, క్యాలరీలు వంటి విషయాలు స్క్రీన్ మీద వస్తాయి. ప్రపంచంలో ఏ రెస్టారెంట్ మెనూ కార్డయినా స్కాన్ చేసి ఈ యాపులో పెడితే ఒక్కొక్క పదార్థం యొక్క క్యాలరీలు, కొవ్వు, ప్రోటీన్ వంటి అంశాలను తెలుపుతుంది. రోజులో ఎంత నీరు తాగుతున్నామో కూడా ట్రాక్ చేసి విశ్లేషణ అందిస్తుంది. ముఖ్యంగా మనం తినే ఏ ఆహారమైనా... వాటిలో ఉన్న పోషకాలు, కేలరీలు, కొవ్వు, ప్రొటీన్, పిండి పదార్థాలు, చక్కెర, ఫైబర్, కొలెస్ట్రాల్, విటమిన్లు... మరిన్ని విషయాలు తెలియజేసి తద్వారా ఏ ఆహారం హానికరమో, ఏది బరువు పెంచుతుందోలాంటి హెచ్చరికలు, చిట్కాలు ఇస్తుంది. ఈ యాపులలో ముందు మన ముఖ్యమైన లక్ష్యం ఏమిటి అనేది ఎంచుకొంటే ఆ విధంగా సహాయపడుతుంది, బరువు తగ్గాలా, కండలు పెంచాలా, పొట్ట తగ్గాలా వంటి వివిధ లక్ష్యాలను ఎంచుకోవాలి.

ఈ యాపుల్లో వందల వ్యాయామాలు, ఆసనాల వివరాలు కూడా ఉన్నాయి. వాకింగ్, బైకింగ్, స్విమ్మింగ్, యోగ, కార్డియో వ్యాయామాలు చేస్తున్నప్పుడు నమోదు చేస్తే ట్రాక్ చేసి సూచనలిస్తుంది, ఎప్పటికప్పుడు లక్ష్య సాధన పురోగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇస్తుంది.

హెల్త్, ఫిట్నెస్ ...ఇంకా వివిధ అంశాలకు మరికొన్ని యాపులున్నాయి

Nike Run Club, Fitbit, Jawbone UP, Garmin, MapMyFitness, Runkeeper, Strava, Runtastic, Misfit, Withings, HealthKit

ధూమపానం మానడానికి యాపులు

Quit Tracker: Stop Smoking
Stop Smoking - EasyQuit free
LIVESTRONG MyQuit Coach (IOS)

ధూమపానం ఆరోగ్యానికి హానికరం అని ఆ పేకెట్ మీదే ఉంటుంది, కానీ వ్యసనం అంత సునాయాసంగా వదలదు. ధూమపానం మానడానికి మానసిక స్థైర్యం, దృఢ నిశ్చయం కావాలి. ధూమపానాన్ని నెమ్మదిగా వదిలించడంలో సహాయపడే యాపులు చాలానే ఉన్నాయి. రోజులో నాలుగు సిగరెట్లు తగ్గిస్తే.... డబ్బు ఎంత ఆదా అయింది, ఆరోగ్యం ఎంత పెరిగింది, ఏ దుష్ప్రభావాలను తగ్గించుకోగలిగారు...ఈ వివరాలతో పాటు శాస్త్రీయ ఆరోగ్య గణాంకాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, సిగరెట్ తాగే కోరిక పుట్టగానే ధ్యాసని ఏదో ఒక విషయంపై మళ్లిస్తాయి ఈ యాపులు. రోజువారీ పురోగతికి రివార్డ్ పాయింట్లు ఇచ్చి, ప్రేరణ కలగజేసి ప్రోత్సహిస్తాయి, పూర్తిగా విడిచిపెట్టేందుకు తోడ్పడతాయి.

మద్యపానం మానడానికి యాపులు

Stop Drinking
Sobriety Counter - Stop Drinking (EasyQuit)
Sober Time - Sober Day Counter & Clean Time Clock
Quit Drinking - Andrew Johnson

మద్యపానం వలన ప్రభుత్వాలకు కోట్ల ఆదాయం చేకూరుతుంది, కానీ లక్షల కుటుంబాలు రోడ్ల మీద పడుతున్నాయి, వేల మంది రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఆల్కహాల్ మెదడు మొద్దుబారి విచక్షణా జ్ఞానం కోల్పోయేలా చేస్తుంది, ఫలితంగా అనేక ఘోరాలు, నేరాలు జరుగుతున్నాయి. మద్యపాన అలవాటుని వదిలించుకునేందుకు తోడ్పడే యాపులు చాలా ఉన్నాయి. కొన్ని యాపులు హిప్నోథెరపీ ద్వారా అలవాటు మాన్పించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఎప్పటికప్పుడు సానుకూల సలహాలను ఇస్తూ, తాగుడు మానేసే లక్ష్యాన్ని సాధించడంలో మానసికంగా దృఢంగా ఉండడానికి సహాయపడతాయి. ఈ యాప్ ఇతర ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవడానికి, గాఢ నిద్రలోకి జారుకోవడానికి కూడా సహాయపడుతుంది. అంతేకాదు... ఎప్పటికప్పుడు కఠినమైన లక్ష్యాలను, రిమైండర్లు ఇస్తూ ప్రేరణ కలిగిస్తుంది.

డబ్బు డబ్బు డబ్బు

Monthly Budget Planner & Daily Expense Tracker
Home Budget Manager Lite
Money Manager Expense & Budget
Money View Money Manager & Expense Manager
BeeWise #1 Money Saving App
Save Money India - BestCoupons

డబ్బు ఆదా, నెలవారీ బడ్జెట్ లాంటి మనీ మేనేజర్ యాపులు కోకొల్లలు. అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఒక్కో ప్రయాణికుడికిచ్చే ఆహారం నుంచి ఒక్క ఆలివ్ గింజ తగ్గిస్తే సాలీనా 40 వేల డాలర్లు ఆదా అయిందట ఆ సంస్థకి. ఒక్కో నీటి బొట్టు కలిపితే చెరువు అవుతుంది. డబ్బు టు ద పవర్ ఆఫ్ డబ్బు. ఈ యాపులు నెలవారీ గృహ బడ్జెట్ నుండి, ఆదాయం, ఖర్చు, మిగులు మొదలగు విషయాలు నిర్వహించడానికి సౌలభ్యం. రోజువారీ, వారం, నెలసరి, వార్షిక నివేదికలను చూడవచ్చు. కొన్ని యాపుల్లో టాక్స్ సేవర్ శీర్షికను ఉపయోగించి ఇన్‌కమ్ టాక్స్ ఆదా చేయొచ్చు, మరికొన్నిటి సహకారంతో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టొచ్చు. కొన్ని యాప్‌లు రోజూ ఆన్‌లైన్ షాపింగ్, ఈ కామర్స్ వెబ్‌సైట్లలో ఏయే డీల్, డిస్కౌంట్లున్నాయో తెలియజేసి డబ్బు ఆదా అవ్వడానికి సహకరిస్తాయి. మన వ్యక్తిగత ఖర్చు కాకుండా ఆఫీస్ కోసం చేసిన ఖర్చుని వేరే గా నమోదు చేస్తే రీయంబర్సుమెంట్ క్లెయిమ్ వాటంతట అవే తయారుచేసిస్తాయి.

ట్రావెల్ గైడ్ యాపులు

Skyscanner - Cheap Flights, Hotels and Car Rental
Trip Planner: India's Best Travel App by Holidify
Travel India

2019లో ఇప్పటివరకు వెళ్ళలేకపోయిన విహారయాత్రలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్ళాలి అనే నిర్ణయం తీసుకున్న వారికి యాత్ర, విమానాలు, బస, పర్యాటక స్థలాల గూర్చి వివరణతో పాటు, యాత్రా ప్రణాళికలు, చౌకైన విమాన చార్జీలు, హొటళ్లు మొదలైన అంశాలను గూర్చి చాలా యాపులున్నాయి.

టిక్ టిక్ టిక్ యాపులు

Smarter Time - Time Management - Productivity
TickTick: To Do List with Reminder, Day Planner
TimeTune - Optimize Your Time
SaveMyTime - Time Tracker

టైం ఈజ్ మనీ అన్నారు పెద్దలు. జీవితంలో ఏది కోల్పోయినా తిరిగి పొందడానికి ఆస్కారముంది, కానీ గడచిపోయిన కాలం...వృథాగా పోయినా దాన్ని తిరిగి సంపాదించలేము. టైం మేనేజ్‌మెంట్ అన్నది ఒక కళ.

ఈ ఇంటర్నెట్ యుగంలో దూరాలు తక్కువై, గంటలు, రోజులు కురచగా మారిపోతున్నాయి. టైం మేనేజ్‌మెంట్ యాపుల ద్వారా రోజులో ఒక గంట సద్వినియోగపరచుకొన్నా, సమయాన్ని విలువకట్టలేము కానీ... అదే కొన్ని లక్షల కోట్లు. సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని, ఉత్పాదకతను పెంచుకొని...మిగుల్చుకున్న సమయాన్ని వ్యక్తిగత వికాసంకోసం ఉపయోగించుకోవడంలో ఈ యాపులు సహాయపడతాయి.

ఆయుష్మాన్ భవ యాపులు

Welezo - Preventive Health App
GOQii - Smart Preventive Healthcare
HealthHub SG

ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యం సరిగా లేకపోతే సృష్టిలో ఉన్న సంపదలన్నీ ఉన్నా శూన్యంతో సమానం, సృష్టిలో కొనలేనిది, అంగడిలో అమ్మకానికి లేనిది ఒక్క ఆరోగ్యమే. ఆరోగ్యాన్ని నిలబెట్టుకోవటంలో సహాయపడే యాపులు ఉన్నాయి. శరీర ద్రవ్యరాశి సూచిక (బాడీ మాస్ ఇండెక్స్), హార్ట్ రేట్ కాలిక్యులేటర్, కేలరీ కాలిక్యులేటర్. గుండె సంకోచము, మహాధమనిలోని రక్తపు ఘన పరిమాణము, పీల్చే వదిలే శ్వాసలో ఉన్న వాయు పరిమాణము, శరీరంలో ఉన్న కొవ్వు, రక్తం పరిమాణం, బ్లడ్ ప్రెషర్, బ్లడ్ గ్లూకోస్, బరువు, ఆకస్మిక అనారోగ్యం లేదా గాయాలకు ప్రథమ చికిత్స కోసం మార్గదర్శకం, నగరాల్లో బ్లడ్ బ్యాంక్ వివరాలు వంటివి ఈ యాపుల ద్వారా పొందవచ్చు, హెల్త్ చెక్ అప్ కోసం ఆసుపత్రుల వివరాలు, ధరలు కూడా పొందొచ్చు. పైన ఉదహరించిన యాపులు మచ్చుకే, మరెన్నో ఆయా రంగాల యాపులు లభ్యమవుతున్నాయి.

పైన పేర్కొన్న యాపులు, సంస్థలతో ఆంధ్రప్రభ సంస్థకు కానీ, రచయితకు కానీ ఏ విధమైన సంబంధం, అనుబంధం, వ్యాపార లావాదేవీలు లేవు.



- సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్, నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

స్మార్ట్ డిస్‌ప్లే ఫోన్ కొనవచ్చా?



స్మార్ట్‌ఫోన్‌లు, టివిలతో పాటు ఇటీవల పలురకాల ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ బాగా పాపులర్ అవుతున్నాయి. రెండు మూడేళ్ల క్రితం గూగుల్ హోమ్ వంటి స్మార్ట్ స్పీకర్ల హవా మొదలైన విషయం తెలిసిందే. ఇటీవల మనదేశంలో వీటి వినియోగం బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో స్మార్ట్ స్పీకర్‌లకి అడ్వాన్స్‌డ్ వెర్షన్‌గా స్మార్ట్ డిస్‌ప్లేలను భావించవచ్చు. వీటిలో అదనంగా ఒక స్క్రీన్ ఉంటుంది. ఇంతకుముందు మాదిరిగా మనకు కావలసిన సమాచారం కేవలం స్పీకర్ చదివి వినిపించడం మాత్రమే కాకుండా, ఆ సమాచారం స్క్రీన్ మీద కూడా కనిపిస్తుంది. ప్రస్తుతం గూగుల్ హోమ్ హబ్, అమెజాన్ ఎకో షో స్మార్ట్ డిస్‌ప్లేలు బాగా వాడకంలో ఉన్నాయి. స్మార్ట్ డిస్‌ప్లే ద్వారా పాటలు వినవచ్చు. యుట్యూబ్ వీడియోలు చూడవచ్చు. ఇంకా పలు రకాల అప్లికేషన్లు దీంతో ఇంటిగ్రేట్ అయ్యాయి. అలాగే ఖాళీగా ఉన్న సమయంలో మీకు నచ్చిన ఫొటోలను ఒకరి తర్వాత మరొకటి కనిపించే విధంగా డిజిటల్ ఫొటో ఫ్రేమ్‌గా కూడా దీన్ని ఉపయోగించుకోవచ్చు. గూగుల్ హోమ్ అక్టోబర్ 2018లో విడుదలైంది. మనదేశంలోకి కూడా అతి త్వరలో వచ్చే అవకాశం ఉంది. దీని ధర సుమారు 11 వేల రూపాయలు ఉంటుంది. గూగుల్ అసిస్టెంట్ ప్రతి ఆండ్రాయిడ్ ఫోన్‌లోను తప్పనిసరిగా అంతర్గతంగా లభిస్తున్న నేపథ్యంలో మనకు ఏదైనా సమాచారం కావాలంటే నేరుగా ఫోన్‌లో వాయిస్ కమాండ్లు జారీ చేసి తెలుసుకునే అవకాశం ఉంది కాబట్టి ఎక్కువగా ఫోన్ వాడేవారికి స్మార్ట్ డిస్‌ప్లే పెద్దగా ఉపయోగపడకపోవచ్చు. మీ ఇంట్లో ఒకపక్క అలంకరణగా ఫొటో ఫ్రేములు కనిపించేలా అమర్చుకోదలచుకుంటే స్మార్ట్ డిస్‌ప్లేలను కొనుగోలు చేయవచ్చు తప్పించి ఎప్పుడూ చేతిలో ఫోన్ ఉండేవారు, ఒకవేళ స్మార్ట్ డిస్‌ప్లేలను కొనుగోలు చేసినా నాలుగురోజులు వాడి పక్కన పడేస్తారు.

క్యాష్‌బ్యాక్‌లకు అలవాటుపడిపోయారా?



ఒక కొత్త మొబైల్ కొనాలన్నా మొబైల్ రీచార్జి చేయాలన్నా క్యాష్‌బ్యాక్ ఎంతవస్తుంది అని ఆరాతీసి మరీ వీలైతే ఎక్కడైనా డిస్కౌంట్ కూపన్లు కనిపిస్తాయేమోనని ఓ అరగంటసేపు ఇంటర్నెట్ మొత్తం జల్లెడ పట్టి మరీ ఖర్చు పెట్టేవాళ్లు చాలామంది ఈమధ్య కనిపిస్తున్నారు. బస్ టికెట్లు బుకింగ్ నుంచి సినిమా టికెట్లు, రెస్టారెంట్ల నుంచి ఫుడ్ డెలివరీ వరకు ఇదే తంతు.

చాలామంది భావిస్తున్నట్లు క్యాష్‌బ్యాక్‌లు, డిస్కౌంట్లు అనేవి ఆయా కంపెనీలు బాగా లాభాల్లో ఉండి మనకు ఇవ్వడం లేదు. వీటిలో చాలా కంపెనీలు విదేశీ సంస్థల నుంచి పెద్ద మొత్తంలో అప్పుతెచ్చి మరీ మనకోసం ఖర్చుపెడుతూ ఉన్నాయి. ప్రత్యేకంగా క్యాష్‌బ్యాక్‌ల కోసం కొంత ఫండ్ పక్కన పెట్టుకుని మరీ ప్రతీ యూజర్‌కి 10,100,1000 రూపాయల క్యాష్‌బ్యాక్‌లు అందిస్తుంటాయి.

దీనికి ప్రధాన కారణం ఎలాగోలా మార్కెట్లో పాగా వేయాలి. క్యాష్‌బ్యాక్ ఆశ చూపించనిదే కనీసం కన్నెత్తి కూడా చూసే పరిస్థితుల్లో వినియోగదారులు లేరు. అందుకే మొబైల్ రీచార్జి మొదలుకుని బస్ టికెట్ బుకింగ్ వరకు క్యాష్‌బ్యాక్‌లు ఇస్తున్నాయి. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. క్యాష్‌బ్యాక్‌లు పొందడంమ ద్వారా మనమేదో లాభపడుతున్నాం అని సంతోషపడుతూ ఉంటాం కాని ఇలా ఆశపడి ఒక సర్వీసుని వాడటం మొదలుపెట్టిన తర్వాత ఏదో రూపంలో మీకు ఇచ్చిన క్యాష్‌బ్యాక్‌కి కనీసం నాలుగైదు రెట్లు అదనంగా మీనుంచి ఆయా కంపెనీలు సంపాదిస్తూ ఉంటాయి. ఉదాహరణకు...ఒక ఫోన్ కొన్నందుకు మీకు పేటిఎమ్ 500 రూపాయల క్యాష్‌బ్యాక్ ఇచ్చింది అనుకుందాం. ఖచ్చితంగా ఒక యూజర్‌గా మీరు పేటిఎమ్ ద్వారా ఇప్పటివరకు కొన్న అన్ని రకాల వస్తువులూ అంత సరసమైన ధరకు మీకు వచ్చి ఉండవు. మీకు తెలియకుండానే వాటిలో ఆయా సంస్థలకు పెద్ద మొత్తంలో మార్జిన్లు ప్లాట్‌ఫాం చార్జీల కింద ఆ ఫోన్ తయారీ కంపెనీల నుంచి కావచ్చు, ఇతర పద్ధతుల్లో కావచ్చు. లభిస్తుంటాయి. ఇక్కడ ముఖ్యంగా క్యాష్‌బ్యాక్ కల్చర్‌కి అలవాటుపడటం సుదీర్ఘకాలంలో ఆన్‌లైన్ షాపింగ్ చేసే ప్రతి ఒక్కరికీ ఆర్థికంగా అధిక భారం పడేవిధంగా చేస్తుంది. కొద్దిగా ఎకనామిక్స్ మీద అవగాహన ఉన్నవారికి మాత్రమే ఈ విషయాలు అర్థమవుతాయి. అలాగే ఇప్పటికీ చాలామంది తమ విలువైన సమయం మొత్తం వృధా చేసుకుని క్యాష్‌బ్యాక్‌ల కోసం, డిస్కౌంట్ కూపన్ల కోసం వెదుకుతుంటారు. పది రూపాయలు వచ్చే క్యాష్‌బ్యాక్ కన్నా పదినిమిషాల సమయం చాలా విలువైనది అన్న విషయం అర్థం అయ్యేసరికి చాలా సమయం వృథా అవుతుంది.

ఫేస్‌బుక్ వీడియో కాల్ గ్యాడ్జెట్



ఫేస్‌బుక్ వీడియో కాల్ గ్యాడ్జెట్

ఈమధ్య ఒక కొత్త గాడ్జెట్ బాగా పనిచేస్తోంది. అది ఇప్పటి మన అవసరాలనుబట్టి ముఖ్యమైన పరికరం. ఫేస్‌బుక్ మెసెంజర్ యాప్‌లో వీడియో కాల్స్ చేసే సౌకర్యం ఉంది. వీడియో కాల్స్ కోసం ఫేస్‌బుక్ పోర్టల్ అవసరం లేకుండా మెసెంజర్ యాప్ ఉంది. కాని దానికి రికార్డు నాణ్యత లేదు. మరి అదే ఎందుకు వాడాలి? అటువంటిదే ఇంకొక పరికరం ఉంది కదా. అది కూడా మెసెంజర్ యాప్ లాటి పరికరమే. అమెజాన్, గూగుల్‌లో వీడియో కాల్స్ మాట్లాడుకోవడానికి, మ్యూజిక్ వినడానికి లేదా వాయిస్ కమాండ్లకు స్పందించడం అవన్నీ మీ ఫోన్‌లోనే చేసుకోవచ్చు. దానికోసం పోర్టల్ ఉంది. ఇది టాబ్లెట్స్ లాగా మైక్రోఫోన్, ఇంకా కెమెరాతో ఉన్న స్క్రీన్‌లు మీ లివింగ్ రూమ్‌లో, కిచెన్‌లో, బెడ్‌రూమ్‌లో ఎక్కడైనా ఫిక్స్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. మీరెక్కడికి వెళ్తే అక్కడికి వస్తుంది.

ఫేస్‌బుక్ వారి యుఎస్‌డి349 పోర్టల్ ప్లస్ మెసెంజర్ ఉపయోగించి వీడియో కాల్స్ చేయడానికి ఉత్తమ పరికరం. దీని విండో 15.6 ఇంచిలు ఉంటుంది. దానిలాటిదే కాని కొంచెం చిన్న పోర్టల్ యుఎస్‌డి199. రెండు మోడల్స్‌ను ఫేస్‌బుక్ పోర్టల్ ద్వారా కాని లేదా మెసెంజర్ యాప్ ద్వారా కాని వేరే వాళ్లతో చాట్ చేసుకోవచ్చు. అమెజాన్ అలెక్స్ వాయిస్ అసిస్టెంట్ మీద ట్యాప్ చేస్తే మరిన్ని ఫీచర్లు అందుబాటులో వస్తాయి. అలాగే

గూగుల్ హోమ్ హబ్(యుఎస్‌డి), ఇంకా అమెజాన్ ఎకో షోలు కూడా వీడియో కాలింగ్ సౌకర్యం కల్పిస్తున్నాయి. కాని వాటి సామర్థ్యం పోర్టల్ అంత బాగా ఉండదు కాని ఇవి కూడా చాలా పనులు చేస్తాయి. ఉదాహరణకు మీకు కాల్ చేసే వ్యక్తిని మీరు చూడవచ్చు. అయితే ఈ పరికరానికి రెండువైపులా వీడియో కనిపించే వీలు లేదు. అవతలి వ్యక్తి మిమ్మల్ని చూడలేరు. కేవలం వీడియో కాలింగ్ మాత్రమే మీకు ముఖ్యమైతే పోర్టల్‌ను ఎంచుకోవడమే మంచిది. ఈ పరికరానికి ఉండే కెమెరాలో ముఖం గుర్తుపట్టే సాంకేతికత ఉండటం వలన మనుషుల్ని గుర్తుపట్టి మీ చుట్టే తిరుగుతుంది. పోర్టల్‌లో స్టోరీ టైమ్ అనే ఫీచర్‌లో ఫేస్ మాస్కులు, యానిమేషన్లు ఉంటాయి. మీరు అవతల మాట్లాడుతోంది పిల్లలతో అయితే ఆ ఫీచర్ మీ వీడియో కాల్‌ను మరింత సరదాగా మారుస్తుంది.

ఈ మూడు పరికరాలకు వివిధ వ్యక్తులను యాడ్ చేసుకోవచ్చు. ఈ పరికదాల నుంచి స్మార్ట్‌ఫోన్‌కి పోర్టల్ కేస్ ద్వారా కాల్స్ చేసుకోవచ్చు. పిల్లలను ఇంట్లో ఉంచిన తల్లిదండ్రులకు ఇవి ఎక్కువ ఉపయోగం. పిల్లలకు యానిమేటెడ్ కథలు కూడా ఈ పరికరాలు చెప్తాయి. ఫేస్‌బుక్ మెసెంజర్ వినియోగదారులు ఒక బిలియన్‌మంది ఉన్నారు. మీ స్నేహితులు ఇప్పటికే వాడుతుంటారు. వారందరితో మీరు ఈ పోర్టల్ ద్వారా మాట్లాడుకోవచ్చు. కాని ఈ పోర్టల్ వాట్సాప్‌కి పనిచేయదు. హోమ్ హబ్ గూగుల్ డ్యుయో మెసేజింగ్ సర్వీస్‌తో పనిచేస్తుంది కాబట్టి మీ స్నేహితులు వారి ఫోన్‌లలో రెండు యాప్‌లను వేసుకోవాలి.

- శ్రీదర్ నల్లమోతు, సాంకేతిక నిపుణులు


* రంగవల్లిక *



13 చుక్కలు 7 వరకు మధ్యచుక్క

గుర్రాల సరస్వతి, పామర్రు, కృష్ణాజిల్లా





21 నుండి 11వరకు మధ్యచుక్క



గోవిందమ్మ, సిరిసిల్ల

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

అవతారాల్లో అంతరార్ధం గ్రహించాలి

ఏ అవతారంలోనైనా లీలలు ఉంటాయి. వాటిని పొగడడం, కీర్తించడం, సత్కర్మ అవుతుంది. అదే సమయంలో అవతార తత్త్వం గ్రహించాలి. అది ముఖ్యం. ఏ అవతారమైనా అంతర్ముఖంగా విశ్వాంతర్థాయిలో తటస్థంగా ఉంటుంది కాని వెలుపలికి ఎంతో కర్తృత్వం వహించినట్లు కనిపిస్తుంది. కనిపించేదంతా నిజం కాదని, నిజమైనది కనపడదని, ప్రతి అవతారం సూచిస్తుంది.

భారతీయ పురాణేతిహాస వాఙ్మయం ఎన్నో అవతారాల గురించి చెప్పింది. సృష్టిలో దైవాంశ లేనిది ఏదీ లేదు. కాని కొన్ని అసాధారణ కార్యకలాపాలు నిర్వహించడానికి ఆ విశ్వశక్తి ఏదో ఒక రూపంతో ఆవిర్భవిస్తుంది. అటువంటి వాటిని అవతారము (కిందకు దిగి వచ్చిన శక్తి) అంటాము. భూభారాన్ని తగ్గించడానికి అవతారాలు ఏర్పడతాయని ఒక నానుడి.

ఆ విశ్వ శక్తి అవేశావతారాలుగా, అంశావతారాలుగా, లీలావతారాలుగా, పూర్ణావతారాలుగా ఆవిర్భవించింది. అవతార ముఖంగా ఒక్కో జీవి ఎంపిక, ఆ అవతారం సాధించాల్సిన కార్యక్రమం అన్నీ ముందుగానే నిర్ణయింపబడి ఉంటాయి.

అన్ని లౌకిక సమస్యలు ప్రకృతి వల్లనే ఏర్పడతాయి. ఇందులో మానవ ప్రమేయం, కర్తృత్వం ఉండవని గ్రహించాలి. సాకార స్థితిలోగల సమస్యలకు పరిష్కారం నిరాకార స్థితిలో ఉంటుంది. ఏ అవతారమైనా ఈ విశ్వ సత్యాన్ని ఖరారుగా చాటి చెప్పేదే. మనకు వచ్చే సమస్యలను కూడా అవతార పరమార్థాల ద్వారా తెలుసుకుని శాంతిమయమైన జీవితాన్ని సాధించుకోవచ్చును.

ఏ అవతారంలోనైనా లీలలు ఉంటాయి. వాటిని పొగడడం, కీర్తించడం, సత్కర్మ అవుతుంది. అదేసమయంలో అవతార తత్త్వం గ్రహించాలి. అది ముఖ్యం. ఏ అవతారమైనా అంతర్ముఖంగా విశ్వాంతరస్థాయిలో తటస్థంగా ఉంటుంది కాని వెలుపలికి ఎంతో కర్తృత్వం వహించినట్లు కనిపిస్తుంది. కనిపించేదంతా నిజం కాదని, నిజమైనది కనపడదని, ప్రతి అవతారం సూచిస్తుంది. శ్రీమద్భాగవతం ప్రకారం భగవంతుని అవతారాలు 22. ఆ అవతారాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

యజ్ఞవారాహావతారం

హిరణ్యాక్షుని సంహరించి నీటిలో మునిగి ఉన్న భూమిని ఉద్ధరించాడు

సుయజ్ఞుడు

అకూతి గర్భాన సుయజ్ఞుడు అవతరించాడు. సుయముడు మున్నగు దేవతలను కని ముల్లోకాల బాధలను హరించి హరి అయ్యాడు.

కపిలావతారము

కర్దమ ప్రజాపతి, దేవహూతిలకు కపిలుడు జన్మించాడు. తల్లికి బ్రహ్మ విద్య ఉపదేశించి మోక్షం ప్రసాదించాడు.



దత్తాత్రేయావతారము

అత్రి ముని కోరికపై ఆయన కుమారునిగా అవతరించాడు. సహస్రార్జునుడు మున్నగువారికి మోక్షం ప్రసాదించాడు

కుమారులు

సనక సనంద సనత్సుజాత, సనత్కుమారులు.మొదటి కల్పంలో ఆత్మజ్ఞానం మరచిన వారికి దానిని ప్రబోధించి వారు ఆత్మ సాక్షాత్కారము పొందునట్లు చేసెను.

నర నారాయణులు

మూర్తిదేవి గర్భాన నరనారాయణులుగా జన్మించెను. ధర్మ సంస్థాపన కోసం వీరు జన్మించారు

ధ్రువుడు

ఉత్తానపాదుని కుమారునిగా జన్మించాడు. బాల్యమునే అరణ్యాలకు పోయి తపస్సు చేపి ధ్రువ పదవి పొందెను

పృథువు

వేన రాజు శరీరం నుంచి పృథువుగా జన్మించాడు. భూమిని ఆవుగా చేసి దాని పొదుగు నుంచి ఓషధులు పితికాడు

పుష్కరుడు

ఈయన సుదేవి గర్భాన జన్మించాడు. జితేంద్రియుడై జడయోగాచార్యుడయ్యాడు.

హయగ్రీవుడు

ఈయన జ్ఞానమూర్తి. ఈయన ఊపిరి నుంచి వేద వాక్కులు పుట్టాయి

మత్స్యావతారము

వేదాలను రక్షించాడు

కూర్మావతారము

దేవదానవులు అమృతానికై సముద్రాన్ని మథించినపుడు మందర పర్వతాన్ని వీపుపై వహించాడు.

నరసింహావతారము

నరసింహావతారంలో హిరణ్యకశిపుని వధించాడు.

నారాయణుడు

గజేంద్రుని మకరి (మొసలి) చెర నుంచి రక్షించాడు.

వామనావతారము

బలి చక్రవర్తిని పాతాళానికి అణిచాడు

హంసావతారము

హంస రూపంలో నారదునకు భాగవత జ్ఞానము ఉపదేశించాడు

మనువు

చక్రధారియై దుర్మార్గులైన రాజులను సంహరించాడు.

ధన్వంతరి

ఆయుర్వేదమును ప్రచారం చేశాడు

పరశురామావతారము

పాలకులైన క్షత్రియులు ధర్మం తప్పినపుడు ఇరువది ఒక్కసార్లు భూమండలమంతా తిరిగి అటువంటి వారిని సంహరించాడు.

రామావతారము

ధర్మానికి ప్రతిరూపం. రావణుని సంహరించాడు. మానవ జాతికి ఆదర్శం

కృష్ణావతారము

భూదేవి భారాన్ని తగ్గించాడు. భగవద్గీతను బోధించాడు.

బుద్ధావతారం

ధర్మబోధ చేశాడు.

కల్కి అవతారము

ధర్మాన్ని స్థాపించడం

శుభం

- కోసూరు హయగ్రీవరావు

9949514583

చింతన

తిరుప్పావై

పాశురం 18

ఉన్దు మదకళిత్త నోడాద తోళ్ వలియన్
నన్దగోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిఱవాయ్;
వన్దెఙ్గుమ్ కోళి యళైత్తనగాణ్, మాదవి
ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలినఙ్గళ్ కూవినగాణ్;
పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్పాడ,
చ్చెన్దామరైక్కైయాల్ శీరార్ వళైయొలిప్ప
వన్దు తిఱవాయ్ మగిళ్ న్దు ఏలో రెమ్బావాయ్

తాత్పర్యం

శ్రీకృష్ణుని లేపుటకు నీళాదేవిని లేపుట మరచిపోవుటచే నీళదేవినే ప్రత్యేకముగ లేపుట ఉచితమని, మదజలము స్రవించు దర్పముగల అనేక ఏనుగుల సమూహముతో (పోరినను) ఓడనట్టి భుజబలము కల నందగోపాలుని కోడలివైన ఓ నప్పిన్నపిరాట్టీ! సుగంధ పరిమళములొలికించు కుంతలములు కలదానా! తలుపు తెరువుమా! ఊరిలోకంతటా వచ్చి తెల్లవారి పోయినదని కోళ్లు కేక లేయుచున్నవి. నీరాకకై బండిగురవింద పందిరిపై ఎప్పటి నుండో అనేకసార్లు కోకిలల గుంపులు కూయుచునే ఉన్నవి. బంతుల వలె ఒప్పుచున్న వ్రేళ్లు కలదానా! నీ మేనత్త కుమారుడైన శ్రీకృష్ణుని నామ సంకీర్తనం చేయుచున్నాము గనుక ఎర్ర




తామరలను బోలిన మృదువైన దివ్య హస్తములతో, నీ చేతికి అమరి యున్నట్టి కళ్యాణ గుణములు కల గాజులు గల గల ధ్వనించునట్లుగా వచ్చి తలుపు తెరువమ్మా! మేము కోరుటచే కాక నీవే సంతోషిస్తూ రావలసినది అని నీళా దేవి లేపబడినది.

పాశురం 19

కుత్తువిళక్కెరియ క్కోట్టుక్కాల్ కట్టిల్ మేల్
మెత్తెన్ఱ పఞ్చశయనత్తిన్ మేలేఱి,
కొత్తలర్ పూఙ్గళల్ నప్పిన్నైకొఙ్గై మేల్
వైత్తుక్కిడన్దమలర్ మార్పా! వాయ్‌తిఱవాయ్
మైత్తడఙ్కణ్ణినాయ్! నీ యున్మణాళనై
ఎత్తనైపోదుమ్ తుయిలెళ వొట్టాయ్‌కాణ్!
ఎత్తనై యేలుమ్ పిరివాత్తగిల్లాయాల్
తత్తువ మన్ఱు త్తకవే లో రెమ్బావాయ్

తాత్పర్యం

నీళా శ్రీకృష్ణులిరువురను కలిపి లేపుట, అర్థించుట మన కర్తవ్యము. చుట్టును దీపములు వెలుగుచుండగ కువలయాపీడమనే గజదంతముల కాళ్ళుగల మంచముపై మృదువైనట్టి చల్లదనము, మార్దవము, వైశాల్యము, సౌగంధము, తెల్లదనము వంటి ఐదు లక్షణములు గల శయ్యపై అధిరోహించి, గుత్తులుగ వికసించిన పుష్పములకు ఆధారమైన శిరోజములు కల నప్పిన్నపిరాట్టి యొక్క వక్షోజములను తనపై నుంచుకుని (లేక) నీళాదేవి యొక్క ఉన్నత స్తనగిరి తటములపై శయనించి యున్న విశాలమైన వక్షస్థలముచే శోభిల్లు స్వామీ! నోరు తెరచి ఒక్కమారు పలుకవయ్యా. కాటుక నలుపు కలిగి విశాలమైన నేత్ర శోభ కల ఓ నీళా దేవీ! ఏమమ్మా! నీవు నీ భర్తనొక్క క్షణమైన నీ యందలి మోహమును వదలి మా వద్దకు వచ్చుటకంగీకరింపకున్నావే! ఆ మాత్రము గూడ భర్త యొక్క విశ్లేషము సహించలేవా? ఇది నీయొక్క పురుషకార స్వరూపానికి, స్వభావానికి కూడ తగినది కాదమ్మా!



- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

శాపగ్రస్తుల కథా కమామిషు-12

అంబకు గంగశాపం

అంబ, అంబిక, అంబాలిక ముగ్గురూ కాశీరాజు పుత్రికలు. కాశీ రాజు తన పుత్రికలకు స్వయంవరం ప్రకటించాడు. తన తమ్ముడు విచిత్రవీర్యునికి ముగ్గురిని ఇచ్చి వివాహం చేయదలిచాడు భీష్ముడు. అందుకుగాను స్వయంవరానికి వెళ్ళి ఆ ముగ్గురు రాకుమార్తెలను బల ప్రదర్శన చేసి తీసుకువచ్చి తన తమ్మునికి వివాహం చేయదలిచాడు. అయితే ఆ ముగ్గురిలో అంబ అప్పటికే సాళ్వ రాజును ప్రేమించింది. ఆ విషయం తెలిసిన విచిత్ర వీర్యుడు ఆమెను కాక ఆమె చెల్లెళ్లు ఇద్దరినీ వివాహ మాడాడు. భీష్ముడు ఆమెను సాళ్వ రాజు వద్దకు పంపగా ఆయన తిరస్కరించాడు. దానితో తన గతి ఏమిటని విచారించిన ఆమె తన ఈ దుస్థితికి కారణం భీష్ముడని భావించి తనన వివాహమాడమని కోరింది. ఆయన తన ప్రతిజ్ఞ గురించి చెప్పి వివాహం చేసుకోలేనని తెలిపాడు. దానితో తండ్రికి ఈ విషయం తెలిపింది. ఆయన యోచించి, భీష్ముని గురువు పరశురాముడు కనుక అతని చెబితే వింటాడని సలహా ఇచ్చాడు. అంబ పరశురాముని ఆశ్రమానికి వెళ్లి విషయం చెప్పింది. తాను భీష్మునికి చెబుతానన్నాడు పరశురాముడు. భీష్ముని పిలిపించి అడగ్గా 'మీతో యుద్ధమైనా చేస్తాగాని శపథం వీడను' అన్నాడు. వారిద్దరికీ యుద్ధం జరిగింది. పరశురాముడు గెలవ లేకపోయాడు. ఆయన నిస్సహాత వ్యక్తం చేసి 'భీష్ముని ఓడించడానికి శివుని మెప్పించు' అని సలహా ఇచ్చి వెళ్లాడు. అయితే అజేయుడైన తన పుత్రుని గెలవడానికి అంబ తపస్సు చేస్తోందని తెలిసిన గంగ అంబ తపస్సును నివారించాలని ముందుగా నచ్చజెప్పింది. అంబ ఎంతకూ మంకుపట్టు విడవక పోవడంతో **'నీ కోరిక నెవరేరకుండుగాక నీవు నీరై ఏరులుగా పారినా, నీ నీటిని ప్రకృతిలోని ఏ జీవి స్పృశించకుండుగాక** అని అంబను శపించింది. అంబ అలాగే ఏరై కొన్నేళ్ల పాటు పారిన తర్వాత ఆమెకు మానవ రూపం వచ్చింది. దానితో ఆమె శివుణ్ణి గూర్చి కఠోర తపస్సు చేసి శివుణ్ణి మెప్పించి తన కోరిక వివరించింది. శివుడు భోళా శంకరుడు కదా అంబకు వరమిచ్చాడు. 'నీ కోరిక ఈ జన్మలో తీరదు. వచ్చే జన్మలో నీవు ద్రుపదుడికి కూతురివిగా పుడతావు, కొడుకుగా పెరుగుతావు, ధృష్టద్యుమ్నుడు నీ సోదరుడవుతాడు. నీవు



శిఖండిగా పేరుపొంది కురుక్షేత్రాన, భీష్మునికి ఎదురుపడి ఆయన అస్త్ర సన్యాసానికి కారణమై నీ పగ తీర్చుకుంటావు' అని వరమిచ్చాడు. ధర్మరాజుకు తన అస్త్ర సన్యాసం శిఖండి వలన అవుతుందని భీష్ముడే ధర్మ రాజుతో చెప్పాడు. స్త్రీగా పుట్టి మగవానిగా మారిన వారితో యుద్ధం చేయనన్నది ఆయన శపథం.

(ఇది ఉద్యోగపర్వంలోనిది)

- డాక్టర్ దేశిరాజు లక్ష్మీనరసింహారావు

9985844558

పరమాత్మ అవిభక్తుడు



భగవద్గీత

అవిభక్తం చ భూతేషు
విభక్తమివ చ స్థితమ్।
భూతభర్తృ చ తద్‌జ్ఞేయం
గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥

తాత్పర్యం

పరమాత్ముడు జీవుల యందు విభజింపబడినట్లు కనిపించినను అతడెన్నడును విభజింపబడక ఏకమై నిలిచి

అధ్యాయం-13, శ్లోకం -17

యుండును. సర్వజీవులను పోషించువాడైనను సర్వులను కబళించునది, వృద్ధినొందించునది అతడేయని అవగాహనము చేసికొనవలెను.

భాష్యం: భగవంతుడు ప్రతి జీవి హృదయములో పరమాత్మ రూపములో ఉంటాడు. దాని అర్థము భగవంతుడు అనేక భాగములుగా విడిపోయెనా ? అని ఎవరైనా ప్రశ్నించవచ్చును. లేదు భగవంతుడు ఒక్కడే ! మనకు భగవంతుడు విభజింపబడినట్లు కనిపించవచ్చును. ఎలా అనగా వేరు వేరు దేశాలలోని ప్రజలు మధ్యాహ్నపు సమయమున 'సూర్యుడు నా తలపైనే ఉన్నాడు' అని భావించుదురు కానీ మనందరికీ తెలుసు సూర్యుడు ఒక్కడే అని. భగవంతుడు సృష్టి సమయములో అన్ని జీవరాశులను తన నుండి వెలికితీస్తాడు. సృష్టి ఉన్నంతకాలము పోషించి, ప్రళయ సమయమున తిరిగి అంతటినీ హరించివేస్తాడు. మరల సృష్టి ఉన్నంత కాలము పోషించి, ప్రళయ సమయమున తిరిగి అంతటినీ హరించి వేస్తాడు. మరు సృష్టి మొదలయ్యేవరకు అంతా భగవంతునిలోనే ఇమిడి ఉంటుంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఇది మాత్రం కోర్టుకు పోదాయేమి?

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

1946-47 ఆ ప్రాంతంలో కుర్తాళం మౌనస్వామి సిద్ధి పొందారని భగవాన్ సన్నిధికి వార్త వచ్చింది. భగవాన్ విని సమీప వర్తులతో వారిని గురించీ, వారి మంచిని గురించీ ఏమేమో చెపుతూ వుంటే, నూతన భక్తులొకరు ''ఆ స్వామి అసలెవరు? ఆంధ్రులంటారు నిజమేనా? అన్నారు. ''అవునవును వారు ఆంధ్రులే. పూర్వాశ్రమ నామధేయం శివయ్య. నేను విరూపాక్ష గుహలో వుండగానే వారక్కడికి వచ్చారు. ఆ వెనుక చాలాసార్లు వస్తూ పోతూ వుండి ఆ వెనుక సన్న్యాసం తీసుకుని, దక్షిణానికి యాత్రగా వెళ్లి క్రమంగా కుర్తాళం చేరుకుని పెద్దస్వాములై, పీఠం గీఠం అంతా స్థాపించారు'' అన్నారు భగవాన్. ''వారు ఏమేమో సిద్ధులు సంపాదించారు గదా?''అన్నారు రాజగోపాలయ్యరు. మరొక భక్తులందుకుని ''అవునవును, బంగారం గూడ చేసి చూపేవారట''అన్నారు. భగవాన్ అన్నీ వింటూ ఊరుకున్నారు.

తరువాత కొన్నాళ్ల వరకూ హాల్లో వారిని గురించిన ప్రసంగం జరుగుతూనే వచ్చింది.. ఉన్నట్లుండి ఒకనాడొక భక్తుడు ''కుర్తాళం పీఠానికి యాజమాన్యం విషయంలో తగాదాలు వచ్చినవటే?''అన్నాడు. ''అవునవును వచ్చినవి. ఆయన ఆంధ్రుడు, నియోగి బ్రాహ్మణుడు తప్ప తదితరులు పీఠాధిపత్యానికి రారాదని విల్లు వ్రాశారట. అయినా డబ్బిచ్చింది మేమే గదా? మాకే రావాలని అరవలు తగాదా పెడుతున్నారట. కోర్టుకు పోయిందని అంటున్నారు'' అన్నాడా భక్తుడు. ''ఆ! కోర్టుకా?'' అని రాజగోపాలయ్యరు ఆశ్చర్యపడుతూ భగవాన్ వైపు చూచి ''విల్లున్నా కోర్టుకు పోయిందటనే'' అన్నాడు. భగవాన్ నవ్వుతూ ''అవునయ్యా ఆస్తి చేరిన వెనుక కోర్టుకు పోక ఏమవుతుంది. రేపు ఇది మాత్రం కోర్టుకు పోకుండా వుంటుందా యేమి?'' అన్నారు ఛట్టుక్కు. రాజగోపాలయ్యర్ చేతులు నలుపుకుంటూ ''మనకు విల్లున్నది గదా?'' అన్నాడు చల్లగా. ''అవునయ్యా! వున్నది. ముందు చిన్నస్వామి, తరువాత వెంకటు, ఆ వెనుక సుందరం, అల్లా వంశక్రమంగా యాజమాన్యం చేయాలని వున్నది. వుంటే యేం కోర్టుకు పోకుండా వుంటుందా? ఇక్కడా అదే అవుతుంది. అక్కడ ఇప్పుడు ఏమయింది?'' అని సెలవిచ్చి మౌనం వహించారు భగవాన్.



కుర్తాళంలో కోర్టులో నలిగి నలిగి విల్లు ప్రకారమే పీఠాధిపత్యం స్థిరపడినట్లే. ఇక్కడా భగవాన్ శరీరం విడిచినది మొదలు యాజమాన్యం వంశాను గతంగా సంక్రమించినా, వ్యవహారం మాత్రం విరామం లేకుండా కోర్టులో నలగక తప్పటం లేదు. అప్పుడే భగవద్వాణిలో భవిష్యత్తు పలికిందన్న మాట ఎంత చిత్రం?

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దిన ఫలాలు

వేషరాశి: పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. శుభవార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఎదురవుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించ గలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. ఆర్థిక అవమాన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు ఇప్పుడు తప్పులుగా మారతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూరప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనదోషాల ద్వారా సమస్యలు, అవమానాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. సంబంధ, బాంధవ్యాల విషయంలో మనస్పర్ధలు చోటు చేసుకుంటాయి. కాబట్టి జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆరోగ్యంలో అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.


వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు లభిస్తాయి. మానసిక చిరాకులు కొనసాగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల/ ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. విదేశీ లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కోరి తెచ్చుకొంటారు. ఆర్థిక వ్యవహారాలు గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ది చేకూరుతుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



తనను పెళ్లిచేసుకోమని అడిగిన వ్యక్తితో నువ్వంటే నాకిష్టం లేదని నిక్కచ్చిగా చెప్పింది. ఆ సూటితనమే ఆమెను ఆపదలోకి నెట్టివేసింది. ఊహించని ప్రమాదాన్ని తెచ్చి పెట్టింది. తనను తిరస్కరించిందనే కోపంతో, తనకు దక్కని ఆమె సంతోషంగా ఉండకూడదనే అక్కసుతో యాసిడ్‌తో దాడిచేశాడు. ఆ దాడి ఆమె జీవితాన్ని అంధకారం చేసింది. అలా అని ఆమె కృంగిపోలేదు. తనలాంటి వారికి తాను ఏవిధంగా ఉపయోగపడగలనా అని ఆలోచించడం మొదలు పెట్టింది. ఆ ఆలోచనే ఆమెను ఈరోజు మంచి ఉద్యోగం చేసుకోవడానికి కావలసిన మనోధైర్యాన్ని ఇచ్చింది. ఆ బాధితురాలెవరో.. ఆమె సాధించిన విజయమేమిటనే వివరాలు మీకోసం...

కృతి... సైంటిస్టులకు స్ఫూర్తి

కృతి మంగుళూరులో జన్మించింది. కుటుంబమంతా జీవపరిరక్షణకోసం కృషి చేస్తున్నవారే. ఆమె చిన్నప్పటి నుంచే అడవుల గురించి, జంతువులు గురించి ఎంతో ఆసక్తిగా తల్లిదండ్రుల దగ్గర నుండి తెలుసుకునేది. వివరాలు తెలుసుకోవడమే కాకుండా వన్యప్రాణులు ప్రశాంతంగా జీవించడానికి కావలసిన పరిసర ప్రాంతాలు ఏవిధంగా ఉండాలనే విషయాలమీద ఎక్కువగా ఆలోచించేది. ఆ ఆలోచన ఫలితమే ఆమెను వన్యప్రాణి సంరక్షణ దిశకు పయనించేలా చేసింది.

తండ్రి టైగర్ బయాలజిస్ట్ తాతగారు పేరున్న పర్యావరణవేత్త. ఆమె బాల్యం ఎంతో సంతోషంగా గడిచింది. కృతి నాన్నగారు పులుల జీవశాస్త్రవేత్త, పరిరక్షకుడు. అందువల్ల ఆమె బాల్యం ఎక్కువగా జంతువుల చుట్టూ వాటిని చూస్తూనే గడిచింది. తండ్రితో చేరిక ఎక్కువగా ఉండడం వల్ల ఆయన తనతో పాటు విహారానికి తీసుకెళ్లేవారు. తండ్రితో ఆవిధంగా బయటకు వెళ్లి ఆ ప్రాంతంలో జంతువులను చూడడమంటే ఆమెకు ఎంతో ఇష్టం ఉండేది. ఆహ్లాదకరమైన ప్రకృతి దృశ్యాలను చూస్తే ఆమె మనసుకు చాలా ప్రశాంతంగా ఉంటుందని వెళ్లేది. కాని అలా వెళ్లినప్పుడు ఆమె తండ్రి వన్యప్రాణులతో ఎదుర్కొన్న సమస్యలను కళ్లారా చూసింది. చాలా భయపడేది. అందువల్ల వారసత్వంగా తండ్రి తరువాత అలాంటి కెరియర్‌ని కొనసాగించాలంటే ఆమెకు చాలా భయ మనిపించి దూర మైంది.

తండ్రి నడిచిన దారి లోనే తనూ నడవాలని ఎప్పుడూ అనుకునేది కాదు. తనకంటూ ఒక మార్గాన్ని తానే ఏర్పరచుకోవాలనుకునేది. జీవితం మీద మంచి అవగాహన ఉండడంతో ఎన్నో ప్రణాళికలు వేసుకుంది. జియోగ్రఫీలో పర్యావరణ శాస్త్రంపై పరిశోధన చేసింది. కాని అనుకోకుండా వన్యప్రాణి సంరక్షణవైపు ఆకర్షితురాలైంది. ఆమె చదివిన డిగ్రీ వాటికి సంబంధించినది కాకపోవడంతో, వన్యప్రాణులకు

స్ఫూర్తి



సంబంధించిన విషయాలను తెలుసుకోవడానికి పేరుపొందిన యూనివర్శిటీలైన యేల్‌లో బిఎస్ చేశారు. బి.ఎడిగ్రీని యూనివర్శిటీ ఆఫ్ ఫ్లోరిడాలో చేసింది. పర్యావరణశాస్త్రంలో పిహెచ్‌డిని డ్యూక్ యూనివర్శిటీ నుండి చేసింది. 20 సంవత్సరాల నుంచి భారతదేశంలోనే వన్యప్రాణి సంరక్షణల పరిశోధనలమీదే దృష్టికొనసాగిస్తోంది. వన్యప్రాణుల్లో ఉన్న రకరకాల జాతులు, వాటి అభివృద్ధి ఏవిధంగా జరుగుతుందనే విషయాలను పరిశీలిస్తున్నది. వన్యప్రాణుల మీద పర్యాటక ప్రభావం ఏవిధంగా ఉంటుంది, స్వచ్ఛంద పునరావాస ప్రభావంపై ఆమె పరిశోధనలు చేసింది. అంతేకాకుండా వన్యప్రాణుల దాడుల వల్ల నష్టపోయిన కుటుంబాలకు నష్టపరిహారం అందేదిశగా చర్యలు తీసుకుంది. ఆమె మొదటి ప్రాజెక్ట్ కర్ణాటకలోని భాద్రాలో 2002సం.లో జరిగింది. ఆ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆమె వన్యప్రాణుల సంరక్షణ కోసం, స్థానిక ప్రజలకు స్వచ్ఛంద పునరావాసం కల్పించడం మీద, వారి జీవిత విధానాల మీద పరిశోధన చేసింది. ప్రస్తుతం ఆమె వైల్డ్ సేవ్ అనే ప్రాజెక్ట్‌లో పనిచేస్తుంది. ఆ పరిశోధన ద్వారా ఆమె 7000కుటుంబాలకు వన్యప్రాణుల వల్ల కలిగే నష్టాలకు తగిన పరిహారాన్ని అందజేయాలని అర్జీని దాఖలు చేసింది. అది వారికి అందాల్సిన ఫలితమని అధికారులతో చర్చించింది. ఆమె అర్జీ ఫలితంగా వారందరికీ సహాయమందడం మెచ్చుకోదగ్గ విషయమే. ఈ రంగంలో మహిళల ప్రవేశం తక్కువగా ఉండడంతో వారిని ప్రోత్సహించడానికి కౌన్సెలింగ్ క్లాసులు కూడా నిర్వహిస్తున్నారు. ఇన్ని సంవత్సరాలలో ఆమె తన వాక్చాతుర్యంతో భారతదేశం, ఆస్ట్రేలియా, బ్రిటన్, అమెరికాలలో వంద మంది సైంటిస్ట్‌లను తయారుచేయగలిగింది. మహిళా శాస్త్రవేత్తలను గుర్తించి వారిలోని నైపుణ్యాలను పెంపొందించడానికి చేస్తున్న కృషిని గుర్తించిన వింగ్స్ వరల్డ్‌క్వెస్ట్ ఆర్గనైజేషన్ వారు 'ఉమెన్ ఆఫ్ డిస్కవరీ అవార్డు2019'కిగాను ఆమెను ఎంపికచేశారు.

ఆదర్శం





యాసిడ్ మంటల్లో విరిసిన మమత

బాధితులకు అండగా నిలబడిన ఇంద్రజిత్ కౌర్

ఆమె పేరు ఇంద్రజీత్ కౌర్. ప్రస్తుత వయసు 30సంవత్సరాలు. ఆమె మొహాలిలోని మరౌలి కలాన్ గ్రామానికి చెందినది. భవిష్యత్తులో పెద్ద చదువులు చదవాలని, ఎమ్.ఎ పూర్తి చేసిన తరువాత పిహెచ్‌డి చేసి పెద్దపెద్ద కంపెనీలలో ఉద్యోగం చేయాలని ఎన్నో కలలు కన్నది. ఆమె కలలన్నీ కల్లలుగానే మిగిలి పోయేలా చేశాడు ఒక ఆగంతకుడు. జికర్‌పూర్‌కి చెందిన మన్‌జీత్ సింగ్ చేసిన యాసిడ్‌దాడి ఆమె జీవితాన్ని అతలాకుతలం చేసింది. తనను పెళ్లి చేసుకోమంటే తిరస్కరించిందనే కోపంతో అతను ఈదాడికి 2011సం.లో పాల్పడ్డాడు. ఈ యాసిడ్ దాడితో ఆమె కంటిచూపును కోల్పోయింది. ఏడు సంవత్సరాలు చాలా వేదనను భరించింది. ఆ దాడి ఆమె జీవితంపై ఎంతో ప్రభావం చూపగలిగింది కాని ఆమె మనోధైర్యం మీద ఎటువంటి ప్రభావం చూపలేకపోయింది. జీవితాన్ని నష్టపోయినా ఎన్నో సంవత్సరాలు మౌనంగా ఉండిపోయింది. తరువాత తేరుకుని తనకు తానే ధైర్యం తెచ్చుకుని తనలాంటి బాధితులకు ఆసరాగా నిలవాలనుకుంది. వారికోసం తనవంతు సహాయాన్ని అందజేయాలనుకుని అడుగు ముందుకు వేసింది. ఆ ఒక్క అడుగే ఎంతోమంది బాధితులకు నేడు మనోధైర్యాన్నిచ్చింది. ఆమెపై దాడి జరిగిన తరువాత యాసిడ్ దాడులను వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తూనే ఉంది. ఆమె ఆధ్వర్యంలోనే పంజాబ్, హర్యానా హైకోర్టులో రెండు రాష్ట్రాలకు చెందిన ఇటువంటి యాసిడ్ బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేయాలని కోరుతూ పిటీషన్‌ని వేసింది. అది అమలులోకి రావడానికి ఒక ఉద్యమాన్నే చేపట్టింది. ఆమె చేపట్టిన ఉద్యమం వల్ల పంజాబ్, హర్యానా ప్రాంతాల్లో యాసిడ్ బాధితులకు నష్టపరిహారాన్ని అందజేసి, ఉచితంగా వైద్యసదుపాయాలను అందజేసే విధంగా ప్రభుత్వాల చేత సంతకాలు చేయించగలిగింది. వారికి స్పెషల్ పాలసీలను కలుగజేస్తూ ప్రభుత్వం తమ సహాయ సహకారాలను అందజేయాలని కోరుకుంటుంది. ఇప్పుడామె ఢిల్లీలో కెనరాబ్యాంక్ హెడ్ ఆఫీస్‌లో క్లర్క్‌గా పనిచేస్తుంది. ఆమె రేడియో స్టేషన్‌లో కూడా పనిచేస్తుంది.

''నా దయనీయపరిస్థితిలో నాకు ఎప్పటికీ తోడుగా ఉన్నది అమ్మే, తన మాటలతో నాకు ధైర్యాన్నిచ్చేది. కుటుంబసభ్యులు, బంధువులు ఎవరూ కూడా నాకు సహాయాన్ని అందించలేదు. నేను ఒంటరిగానే నేరస్థులకు వ్యతిరేకంగా పోరాటాన్ని చేశాను. ఈ ప్రమాదం వల్ల నా చదువును మధ్యలోనే ఆపివేయవల్సివచ్చింది. నా పరిస్థితిని తలచుకుని ఏడుస్తూ ఉండేదాన్ని. నేనున్న పరిస్థితిని చూసి జాలి చూపకుండా గ్రామస్థులు, ఇరుగుపొరుగువారు అమ్మకు భారంగా తయారయ్యానని, సమాజానికి నావల్ల ఎటువంటి ప్రయోజనం లేదని అనడం చాలా బాధగా అనిపించేది. వారి మాటలతో నాలో ఏదో ఒకటి చేయాలనే తపన కలిగింది. డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్స్‌స్టిట్యూట్ ఫర్ విజువల్లీ హ్యాండీక్యాపెడ్డ్‌లో చేరాను. ఆడియో రికార్డింగ్స్‌లో టెక్నిక్‌లను నేర్చుకున్నాను. గ్రాడ్యుయేషన్‌ని పూర్తిచేశాను. అప్పటినుండి బ్యాంకింగ్ కాంపిటేటివ్ సర్వీస్ పరీక్షలకు కూడా ప్రిపేర్ అవుతున్నాను. జూన్ 2018లో రాశాను. ఆ పరీక్షల్లో ఉత్తీర్ణురాలు కావడంతో దివ్యాంగుల కేటగిరీలో నాకు ఉద్యోగం వచ్చింది. ఢిల్లీలో నన్ను నియామకం చేశారు'' అని రేడియోలో తన దీనగాథను చెబుతూ, ఇలాంటి ఆపదలు ఎదురైనప్పుడు బాధపడుతూ కృంగిపోకుండా ధైర్యంగా ముందడుగు వేయాలని పిలుపు నిస్తుంది.

ఆమె వేసిన పిటీషన్ వల్లే కేవలం పంజాబ్, హర్యానాలోనే కాకుండా కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో కూడా యాసిడ్ బాధితులకు ఉచిత చికిత్సను అందజేయాలని ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. అదేవిధంగా వారి భవిష్యత్తుకోసం నష్టపరిహారాన్ని కూడా అందజేస్తున్నారు. ఆమె చేసిన ప్రయత్నం ఎంతోమంది యాసిడ్ బాధితులకు ఓదార్పునిస్తుంది. జీవితం అంధకారంగా మారిపోయినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతున్న ఇంద్రజీత్ కౌర్ అందరికీ ఆదర్శనీయురాలే.

మహిళకు ప్రసవం పునర్జన్మ అంటారు. మరి అటువంటి క్లిష్టపరిస్థితుల్లో సరైన వైద్యం అందకపోతే వారి పరిస్థితి చాలా దుర్భరమవుతుంది. ప్రసవ సమయంలో వారికి వైద్యం అందించడానికి కేవలం డాక్టర్లే అవసరం లేదు. నాడీవైద్యం తెలిసిన వైద్యులు కూడా సులువుగా చేయగలరు. ఆవిధంగా తనకు తెలిసిన నాడీవైద్యంతో ఇప్పటివరకు పదిహేను వేల ప్రసవాలను చేసి రికార్డు సృష్టించింది ఆమె. ఉచిత ప్రసవం చెయ్యడమే కాకుండా బాలింతరాలు తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి, కావలసిన మందులను తయారుచేసుకొనేలా శిక్షణ కూడా ఇచ్చేది. ఆమే నరసమ్మ. అంతటి హస్తవాసి డిసెంబర్ 25, 2018వ తేదీన మరణించారు. 98యేళ్ల వయసు వరకూ ఆమె అంత ఆరోగ్యంగా ఎలా ప్రసవాలు చేయగలిగిందనే వివరాలు తెలుసుకుందాం.

పండు వయసులో ప్రసవ సేవలో...

15వేల కాన్పులు చేసిన నరసమ్మ

సూలగిత్తి నరసమ్మ. ఆమె కర్ణాటకలోని పావగడ తాలూకాలోని కృష్ణపురకి చెందినది. 1940సం.లో ఆమె గృహిణిగా ఉన్న రోజుల్లో ఎవరికైనా ప్రసవం ఉంటే అక్కడికి వెళ్లి సాయం చేసేది. అలా ఆమె తన పనిని నిర్వహిస్తూ ఏడు దశాబ్దాలు పూర్తిచేసింది. ఇప్పటివరకు ఆమె పదిహేనువేల మంది కంటే ఎక్కువగానే ప్రసవాలను ఉచితంగా చేసినట్లు వివరాల్లో వెల్లడైంది. ఆమె చేసిన సేవ నిరుపమానమైనది. వెలకట్టలేనిది. ఆమె చేసిన మంచిపనిని గుర్తించి సూలగిత్తి(కన్నడపదం) (మంత్రసాని)అనే బిరుదుతో అక్కడి ప్రజలు పిలిచేవారు.

బాల్యం

నరసమ్మ ఈ పనికి పూనుకోవడానికి కారణం అమ్మమ్మ మర్గమ్మే. ఆమె కూడా మంత్రసాని పనే చేసేది. మహిళకు సులువుగా ఎలా ప్రసవం చేయాలనే మెలకువలను అమ్మమ్మ మర్గమ్మ దగ్గరే నేర్చుకున్నానని, ఆమే నా ఐదుగురు పిల్లల ప్రసవం చేసిందని ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పింది. 2007వరకు ఆమె ఇంటిపేరు కృష్ణపుర అని ఉండేది. ఆమె చేసే అద్భుతమైన కార్యాన్ని గుర్తించి జిల్లాస్థాయి అవార్డుకు ఆమె పేరును అన్నపూర్ణ వెంకటనంజప్పా, రామకుమారి నమోదు చేశారు. అప్పటినుంచి ఆమెమీద మీడియాలో ఎన్నో కథనాలు వచ్చాయి. ఇలా ప్రసవాలు చేయడం చరిత్రేనని అందరూ మెచ్చుకున్నారు. ఆమె పనితీరును పరిశీలించిన తుమ్‌కూర్ యూనివర్శిటీ డా. సూలగిత్తి నరసమ్మ అనే పేరుతో ఆమెను సత్కరించింది. డాక్టరేట్‌ని ప్రదానం చేసింది.

ఆమె పనితీరు తెలుసుకున్న ప్రభుత్వం 2018సం.లో పద్మశ్రీ అవార్డుతో ఆమెను సత్కరించింది. మార్చి, 2018 న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రభుత్వ పురస్కారాల ప్రదానంలో రాష్ట్రపతి శ్రీరామనాథ్ కోవింద్ చేతులమీదుగా పద్మశ్రీ అవార్డును శ్రీమతి సూలగిత్తి నరసమ్మ అందుకున్నారు.

ఆమె నైపుణ్యం గురించి విన్న చాలామంది మహిళలు ప్రసవం కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి గ్రామంలో ఆమె ఆశ్రయం పొందేవారు. ఆమె చాలా దయార్ద్ర హృదయం కలది. ఆమె ఉచితంగా ప్రసవం చేయడమే కాకుండా బాలింతరాలకు కావలసిన మందులు ఎలా తయారుచేసుకోవాలో వారికి నేర్పించి పంపించేది. ఈ పని ఆమెకు ఎంతో పేరు, విజయాన్ని తెచ్చిపెట్టింది. గర్భంలో ఉన్న శిశువు పరిస్థితి ఏవిధంగా ఉన్నదనే విషయాన్ని గర్భిణీ చేయిపట్టుకుని సులభంగా తెలుసుకునేది. ఎటువంటి స్కానింగ్‌లు చేయకుండానే శిశువు తల ఎటువైపు ఉందో కూడా చెప్పగలిగేది.

స్మత్యర్థం



ఆరోగ్య రహస్యం

ఆమె 12మంది పిల్లలకు జన్మనిచ్చింది. 22మంది మనవలు, మనుమరాళ్లు ఉన్నారు. తన పూర్తి జీవితాన్ని ఎంతో సంతోషంగా, ఆనందంగా జీవించింది. తను ఆరోగ్యంగా ఉంటూ ప్రసవానికి వచ్చిన మహిళలు కూడా ఆరోగ్యంగా తిరిగి వెళ్లే విధంగా ఆమె జాగ్రత్తలు తీసుకునేది. ఎన్ని ప్రసవాలనైనా చాలా ఉత్సాహంగా చేసేది. ఆమె ఎక్కువగా పప్పుధాన్యాలను వాడేది. దానిలో ఎన్నో పోషక పదార్థాలు ఉండి కావలసిన శక్తిని అందజేస్తాయని నమ్మకం. రకరకాలైన పప్పుధాన్యాలను ఇతర వ్యాపారసంస్థల నుంచి తెప్పించి నిల్వ చేసుకునేది. 90 సంవత్సరాలు వచ్చినా ఆమెకు కళ్లజోడు అవసరం ఏర్పడలేదు. ఆమెకే కాదు ఆమె కింద పనిచేస్తున్న వారికి కూడా వాటి అవసరం ఏర్పడలేదంటే వారందరికీ అంతటి పోషకాహారాన్ని అందజేసిందని చెప్పవచ్చు. తనకు తెలిసిన విద్యను నేర్చుకునే ఆసక్తి ఉన్నవారందరికీ ఇప్పటివరకు దాదాపు 180మందికి నేర్పింది. అందులో మనమరాలు జయమ్మ కూడా ఉంది. నరసమ్మ తరువాత స్థానం జయమ్మదేనని చెప్పవచ్చు. ఆమె కూడా మంచి పేరుతెచ్చుకుంటున్నది. నరసమ్మ నేర్పిన పనితనంతో జయమ్మ పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని మనసారా కోరుకుందాం.



ఇంతకన్నా ఇంకేమి అడగను

సూపర్‌స్టార్ మహేష్‌బాబు అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తన ట్విట్టర్ ఖాతా ద్వారా స్పందిస్తూ ''నా ఫ్యామిలీ ఒక పక్కన, మీ ప్రేమ హృదంయలో ఉంచుకుని.... కొత్త ఏడాదిలోకి అడుగు పెడుతున్నాను '' అంటూ మహేష్ ట్వీట్ చేశారు. ''ఇంతకన్నా నేను ఇంకేమి అడగగలను.... హ్యాపీ న్యూ ఇయర్... అంతులేని ప్రేమ'' అంటూ ట్యాగ్ జత చేశారు.

మహేష్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'మహర్షి'. ఇటీవలే ఈ చిత్రం తాజా షెడ్యూల్ చిత్రీకరణలో పాల్గొన్న మహేష్ అనంతరం కుటుంబ సమేతంగా దుబాయ్ విహార యాత్రకు వెళ్ళారు. అక్కడే కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.

గరుడవేగ తర్వాత కల్కి



డా.రాజశేఖర్

'గరుడవేగ' తర్వాత డా.రాజశేఖర్ నటిస్తున్న చిత్రం 'కల్కి.' ప్రశాంత్ వర్మ దర్శకుడు. శివానీ శివాత్మిక మూవీస్ సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై నిర్మాణం అవుతున్న ఈ చిత్రానికి సి.కల్యాణ్, శివానీ, శివాత్మిక నిర్మాతలు. ఈ చిత్రంలో ఆదాశర్మ, స్కార్లెట్ విల్సన్ నాయికలుగా నటిస్తున్నారు. అశుతోష్ రానా, నాజర్ కీలక పాత్రధారులు. 1983 నేపథ్యంలో కథనం జరుగుతుంది. నూతన సంవత్సరం సందర్భంగా కల్కి ఫస్ట్‌లుక్ విడుదల చేశారు.

రామ చక్కని సీత



ఇంద్ర
సుకృతి వాగ్లే

ఇంద్ర, సుకృతి వాగ్లే నటిస్తున్న చిత్రం 'రామ చక్కని సీత'. ''రామాయణం నిజం అయితే తన కథ కూడా నిజమే'' అంటున్నాడు చిత్ర దర్శకుడు శ్రీ హర్ష మండ. రామ చక్కని సీత చిత్రం దాదాపు మూడొంతులు పూర్తిచేశారు. సినిమా అద్యంతం వినోదాత్మకంగా అందరికి నచ్చే విధంగా ఉంటుందని నిర్మాత విశాలక్ష్మి మండ, జి.ఎల్. ఫణికాంత్ చెప్పారు. నూతన సంవత్సరం మొదటిరోజు ఫస్ట్‌లుక్ విడుదల చేశారు.

ఇంకా ఈ చిత్రంలో ప్రియదర్శి, కాశీ విశ్వనాథ్, అభయ్. మధుమణి తదితరులు నటిస్తున్నారు. కేశవ కిరణ్ సంగీతం, మురుగన్ గోపాల్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు.

రవిబాబు ఆవిరి



'అదుగో' సినిమాతో చేదు అనుభవాన్ని చవిచూసిన నటుడు, దర్శకుడు రవిబాబు మరోసారి కొత్త ప్రయోగం చేస్తున్నారు. తాజా సినిమా పేరు 'ఆవిరి'. దీని కాన్సెప్ట్ పోస్టర్ విడుదల చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక జరుగుతోంది. త్వరలోనే వారి వివరాలు వెల్లడిస్తామని రవిబాబు చెప్పారు. ఫ్లయింగ్ ఫ్రాంగ్స్ పతాకంపై రవిబాబు నిర్మిస్తున్నారు.

కొత్త ఏడాదిలో కలలను సాకారం చేసుకోండి



రకుల్ ప్రీత్ సింగ్



కృతిసనన్

సినీరంగంలో కొందరికి మోదం...ఇంకొందరికి ఖేదం అన్నట్లుగా 2018వ సంవత్సరం ముగిసింది. కొత్త ఆశలతో...క్రొంగొత్త ఆలోచనలతో 2019వ సంవత్సరానికి ఆనందోత్సాహాల మధ్య సినీ ప్రముఖులు స్వాగతం పలికారు. 31వ తేదీ ముగిసి ఒకటో తేది మొదలైన అర్ధరాత్రి నుంచే ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ...తమ కుటుంబీకులు, స్నేహితులతో కలిసి ఆనందంలో మునిగి తేలారు. సామాజిక మాద్యమాలలో గతేడాది, నూతన ఏడాది గురించి ప్రస్తావిస్తూ...కొత్త ఏడాదిలో అందరి కలలు సాకారం కావాలంటూ అభిలషించారు. ఒక్కసారి వారు ట్వీట్ చేసిన వివరాల్లోకి వెళితే...

కొత్త ప్రయాణం

జీవితంలో మరో నూతన ఏడాది వచ్చింది. అందరం మరో కొత్త ప్రయాణం చేయబోతున్నాం. ఈ ఏడాది అందరిలో కొత్త సంతోషాలను అందించాలని కోరుకుంటున్నా...అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు...అమితాబ్‌బచ్చన్

ఇంతకంటే ఇంకేం కావాలి

2018 ఎంతో హాయిగా..ఎంతో అందంగా ముగిసింది. నా విషయానికి వస్తే...చాలా మంది నూతన ఫ్రెండ్స్ పరిచయమయ్యారు. మంచి సినిమాల్లో నటించే అవకాశాన్ని ముగిసిన ఏడాది అందించింది. మీకు మీరు విలువనిచ్చుకోండి. దానివల్ల మనలో స్థైర్యం ఏర్పడుతుంది. కొత్త ఆలోచనలతో...ఆనందంతో నూతన ఏడాదిలో ప్రయాణం సాగించేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇంతకంటే ఇంకేం కావాలి. ప్రతీఒక్కరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు..రకుల్‌ప్రీత్‌సింగ్



అమితాబ్ బచ్చన్

మీ కలలను నిజం చేసుకోండి

నూతన ఏడాది అనగానే నూతన భావాలకు ఆరంభంగా భావించాలి. పుస్తకంలో మొదలుపెట్టే మొదటి చాప్టర్ ఎలాంటిదో అలానే దీనిని అంత అందంగా అనుకోవాలి. సంకోచాలు, భయాలు లేకుండా మీ మనసులో ఉన్న లక్ష్యాలను, భావాలను అందులో పొందుపరచండి. మీ మంచి ఆశయాలు, లక్ష్యాల నుంచి వెనక్కి లాగుతున్న పరిస్థితుల నుంచి బయట పడేందుకు అన్నివిధాల ప్రయత్నించండి. మీ కలలను నిజం చేసుకునే విషయంలో ఎక్కడా రాజీపడకండి...కృతిసనన్.

అందరికీ మంచి జరగాలి

ప్రియమైన 2018వ సంవత్సరానికి వీడ్కోలు పలకక తప్పడం లేదు. నాకు గుర్తుండిపోయే ప్రత్యేక ఏడాదిగా నిలిచిపోవడమే అందుకు కారణం. నాకు రెండు అద్భుతమైన సినిమాల్లో నటించే అవకాశాన్ని అందించిన ఏడాదిగా 2018వ సంవత్సరం నా హృదయంలో నిలిచిపోయింది. అయినప్పటికీ నాతో పాటు..అందరికీ ఎంతో మంచి జరగాలని కోరుకుంటూ 2019వ సంవత్సరానికి స్వాగతం...సుస్వాగతం...త్రిష.

వీరితో పాటు ఇంకా పలువురు సినీ ప్రముఖులు సామాజిక మాద్యమాలలో కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ...తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. వారి కామెంట్స్ వైరల్ అవుతూ ప్రేక్షకాభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి.



త్రిష


లోక్‌సభకు పోటీ చేస్తా

విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ రాజకీయ అరంగేట్రం చేయనున్నారు. అనేక సందర్భాల్లో తనదైన శైలిలో స్పందించే ఆయనకు సమకాలిన రాజకీయాలపై స్పష్టత ఉంది. నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రకాష్ రాజ్ ఓ ట్విట్టర్‌లో ఓ ప్రకటన చేశారు. అందరికీ కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయబోతున్నట్టు తన ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. ''ప్రజల గొంతుని పార్లమెంట్‌లో వినిపించేందుకు, మీ అందరి సహకారంతో నేను రాబోయే ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాను'' అని వెల్లడించారు.

తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల నటునిగా ప్రకాష్ రాజ్‌కు పేరుంది. అనేక సందర్భాల్లో ఆయన స్పందించేవారు. తెలంగాణలోనికి ఓ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. అనేక అభివృద్ధి పనులు చేస్తున్నారు.



ప్రకాష్ రాజ్



బాలీవుడ్ నటుడు

ఖాదర్ ఖాన్ కన్నుమూత

ప్రముఖ బాలీవుడ్ నటుడు, రచయిత ఖాదర్ ఖాన్ కన్నుమూశారు. ఆయన వయస్సు 81 సంవత్సరాలు. చాలాకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం కెనెడా వెళ్లిన ఆయన సోమవారం సాయంత్రం అక్కడే తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని కుమారుడు సర్ఫరాజ్ వెల్లడించారు. కుటుంబ సభ్యులంతా కెనెడాలోనే ఉన్నారు. అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ''తమ తండ్రి చాలా కాలంగా ఆనారోగ్యంతో ఉన్నారని, నాలుగు నెలలుగా ఆసుపత్రిలో ఉన్నారని, పరిస్థితి విషమించి డిసెంబర్ 31న తుదిశ్వాస విడిచారని'' చెప్పారు.

ఖాదర్ ఖాన్ కాబూల్‌లో జన్మించారు. 1973లో 'ధాగ్' చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. దాదాపు 300 చిత్రాల్లో నటించారు. ఖాదర్ ఖాన్ నటుడే కాదు రచయిత కూడా. 250 చిత్రాలకు రచన చేశారు. కామెడీ పాత్రల నటునిగా ఆయనకు పేరుంది. ఒకప్పటి స్టార్స్ అమితాబ్ బచ్చన్, రాజేష్ ఖన్నా, జితేంద్ర, ఫిరోజ్ ఖాన్, అనీల్ కపూర్, గోవింద వంటి వారితో కలిసి సినిమాల్లో నటించారు. ఖాదర్ ఖాన్ నటించిన చిత్రాల్లో దో ఔర్ దో పాంచ్, ముకద్దర్ కా సికిందర్, మిస్టర్ నట్వర్‌లాల్, సుహాగ్, షహెన్‌షా తదితర చిత్రాలున్నాయి. ఖాదర్ ఖాన్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. ఖాదర్ ఖాన్ తన అద్భుత నటనతో వెండితెరకు మెరుగులు దిద్దారని పేర్కొన్నారు. ఖాదర్ మరణం వార్త తనను కలచివేసిందని అమితాబ్ పేర్కొన్నారు. గొప్ప ప్రతిభావంతుడిని కోల్పోయామని ట్వీట్ చేశారు.

హారర్...థ్రిల్లర్



సమీర్ ఖాన్, శైలజ

సమీర్ ఖాన్, శైలజ జంటగా నటిస్తున్న చిత్రం 'కెఎస్ 100'. షేర్ దర్శకత్వంలో వెంకట్ రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేశారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ ''వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కిస్తున్నాం. హారర్, సస్పెన్స్, థ్రిల్లర్, రొమాంటిక్ జోనర్‌లో ప్రేక్షకులకు ప్రేరణ కలిగించేలా ఉంటుంది. గోవా, హైదరాబాద్, మహారాష్ట్రలోని హిరంబుల్ లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. అంతర్జాతీయ మోడల్స్‌ను ప్రధాన పాత్రల్లో పరిచయం చేస్తున్నాం. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. టైటిల్ లోగో విడుదల చేశాం. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం'' అని చెప్పారు.

అక్షిత, అషి, సునీత, శ్రద్ధా, నందిని, సుమన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం వంశీ, సంగీతం నవనీత్ చారి, మాటలు, కథనం, దర్శకత్వం షేర్.